
# Avadhuta Sri Chivatam Amma Charitra

Smt. Sarada Vivek



ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయనమః
ఓం సమర్థ సద్గురు అలమేలు మంగ సహిత భరద్వాజాయ నమః

# అవధూత శ్రీ చివటం అమ్మ

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః ॥

## అధ్యాయము - 1

అక్షర ద్వాద్వరేణ్యా త్వాద్ధూత సంసార బంధనాత్ ।
తత్త్వమస్యాది లక్ష్యత్వా దవధూత ఇతీర్యతే ॥

నాశరహితుడు, శ్రేష్ఠుడు, సంసార బంధాలను విదిలించి వేసిన వాడు, తత్త్వమసీ మహావాక్యానికి లక్ష్యమైనట్టి వానిని అవధూత అంటారని పై శ్లోకంలో అవధూతోపనిషత్తు వివరించింది. అటువంటి ఉత్తమ అవధూత శ్రీ చివటం అమ్మ. 'తత్త్వ మసి' అంటే 'తాను మసై పోవడమే' అంటూ తనదైన ఒక ప్రత్యేక రీతిలో అతి సులభంగా, సూటిగా, హృదయానికి హత్తుకునేలా బోధించి, 'తాను' మసైపోగా మిగిలేదేదో అదే తానుగా జీవించిన మహామహితాత్మురాలు శ్రీ చివటం అమ్మ.

దత్తాత్రేయునికి అవధూత అనే బిరుదున్నది. ఈ భూమి మీద దత్తాత్రేయుడు లేని దేశం గానీ, కాలంగానీ లేనే లేదు. వివిధ మహాత్ముల, అవధూతల, సిద్ధపురుషుల రూపంలో ప్రకటమైన గురుతత్త్వమే శ్రీ దత్తాత్రేయుడు. అంబరీషునికి దూర్వాసుడిచ్చిన శాపాన్ని భక్త వత్సలుడైన శ్రీహరి తనకు వర్తింపచేసుకొని, ఈ భూమిపై తిరిగి తిరిగి అవతరిస్తూ వున్నాడు. ఇట్టి అవతారాలలో ఒకటి దత్తాత్రేయుడు. దత్తాత్రేయ అవతారానికి అవతార పరిసమాప్తి అంటూ వుండదు. జీవుల పట్ల అపారమైన కరుణ చేత వారందరికీ

గూడ తాను లభ్యమయ్యేందుకు పరిపూర్ణులైన మహనీయుల రూపంలో ఎల్లప్పుడూ భూమిపై సంచరిస్తూంటాడు దత్తాత్రేయుడు.

"సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు ప్రకృతిలో వివిధ రూపాలు ఎంతో శోభాయమానంగా మన దృష్టి నాకట్టుకుంటాయి. ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రత్యేక లక్షణంతో మన దృష్టిలో ప్రత్యేకంగా నిలుస్తాయి. కాని, ఇవన్నీ ఏ ఆకాశంలో వున్నాయో అది వాస్తవానికి వీటన్నిటి కంటె అద్భుతమైనది. మహిమాన్విత మైనది. కానీ మన దృష్టినది ఎన్నడూ ఆకర్షించదు, వాస్తవానికి అదే ముందు చెప్పినవన్నీ వుండడానికి అవకాశం. యోగులు, సిద్ధులు, మంత్రవేత్తలు, విరివిగా మహిమలను ప్రదర్శించే వారందరూ మన దృష్టి నాకర్షించే వారిలాగా వుంటారు గానీ, అవధూతావస్థలో నున్న జీవన్ముక్తులు ఎవరి దృష్టినీ ఆకర్షించకపోయినప్పటికీ అందరి కంటే మహోన్నతమైన స్థితిలో వుంటారు. అందుకే అవధూత అన్న పేరు ప్రపంచంలో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని వర్ధిల్లచేసే యోగ నాథుడైన దత్తాత్రేయుల వారికి వర్తిస్తుంది. ఆయన దక్షిణామూర్తి వలె యోగులకు యోగి, గురువులకు గురువు. అట్టి పరిపూర్ణమైన అవధూతే శ్రీ చివటం అమ్మ" అంటారు పూజ్య శ్రీ భరద్వాజ మాస్టర్ గారు.

★★★★★

# అవధూత శ్రీ చివటం అమ్మ

## జీవిత విశేషాలు

చివటం అనే గ్రామం పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకుకు రెండు మైళ్ళ దూరంలో గోస్తని నదీ తీరాన వున్నది. గోస్తనీ నదీ తీరంలో అనేక మంది ఋషులు తపస్సు చేశారట. నేటికీ ఎందరో ఋషులు, దేవతలు అదృశ్యంగా వున్నారని ప్రతీతి.

తణుకులో రిక్షా ఎక్కి వెళ్తుంటే - జనసందోహంనుంచి బయటపడి, పచ్చని తోపులు, చెరుకు తోటల మధ్య గుండా మలుపులు తిరుగుతూ మట్టి రోడ్డు మీద సుమారు మూడు కిలోమీటర్లు వెళ్ళేసరికి ఒక చిన్న గ్రామం కన్పిస్తుంది. అదే చివటం! సుమారు 60 సంవత్సరాల పాటు అమ్మ పాద స్పర్శను పొంది పునీతమైన పుణ్యభూమి! మన మాస్టర్ గారు నడిచి వెళ్ళిన నేల! మరెందరో మహాత్ముల పాదస్పర్శ సోకిన గడ్డ! అటువంటి పవిత్ర క్షేత్రంలో అడుగుపెట్ట గలిగే మహద్భాగ్యాన్ని ప్రసాదింపజేసిన గురుదేవులు భరద్వాజ మాస్టర్ గారికి నమస్కరించుకొని ముందుకు సాగుదాం! మన జీవితంలాగానే వంకరటింకరగా వున్న ఇరుకు సందుల్లోంచి ముందుకు నడువగా ప్రత్యక్షమౌతుంది రామాలయం! అమ్మ తపశ్శక్తితో ప్రాణం పోసు కున్న సీతారామచంద్రుల సుమనోహర, మనోజ్ఞ మూర్తులకు వందన మాచరించి, కన్నులకు కన్పించని అమ్మ మూర్తిని దర్శనం చేసుకుందాం! ఆ రామాలయానికి వెనుగ్గా వున్న కుటీరమే అమ్మ నివసించిన వైకుంఠం! కుటీర ద్వారం ముందు చేతులు జోడించి నిలబడితే, చెప్పలేని భావ పారవశ్యంలో హృదయం పులకించిపోతుంది. ఈ సువిశాల విశ్వంలో - పిపీలికాది బ్రహ్మపర్యంతమైన ఈ సృష్టిలోని కోటానుకోట్ల జీవుల్లోని ఒకానొక జీవియైన మనకు - ఎంతో కొద్ది మందికి మాత్రమే లభించే ఈ అదృష్టం - అమ్మ తపో భూమిలో అడుగుపెట్టగలిగే ఈ మహద్భాగ్యం ప్రసాదింప చేసిన గుర్వనుగ్రహానికి హృదయపూర్వక కృతజ్ఞతలు!

అది ఒక చిన్న కుటీరం - గడప దాటగానే ఒక గదిలో ప్రవేశిస్తాం! ప్రవేశిస్తూనే, మన ఎడమ వైపున మరొక ద్వారం కనిపిస్తుంది - ఈ ద్వార బంధం వెనుగ్గా కూర్చుని అమ్మ దర్శనమిచ్చేవారట. అమ్మ నివసించే ఆ గది అతి చిన్నది. అరడుగులు పొడవూ, రెండు అడుగులు వెడల్పూ వుంటుంది. గాలి వెల్తురూ రాని ఆ చిన్న గదిలో తలుపు వేసేసుకుని చెక్క పలకల మీద పడుకునే వారు అమ్మ. అమ్మకు ఎంత ఇరుకుగా వుంటే అంత ఇష్టమట. ముందు గది సుమారు 6 అడుగులు పొడవూ 6 అడుగులు వెడల్పు కలిగి చతురస్రాకారంలో వుంటుంది. గది గోడలకు మహాత్ముల చిత్రపటాలు తగిలించి వుంటాయి. మట్టి గోడల మీద తాటియాకులతో నిర్మించిన కుటీరమది. ఆ గదిలోని ప్రతి మట్టి కణమూ అమ్మ పాద స్పర్శతో, దేహ స్పర్శతో పునీతమై చెప్పలేనంత ఆధ్యాత్మిక శక్తిని తనలో నిక్షిప్తం చేసుకొని వుంది.

కుటీరానికి కొంచెం వెనుగ్గా వుంది అమ్మ సమాధి. అమ్మ వలెనే అతి సామాన్యంగా వుంటుంది అమ్మ సమాధి కూడా. సమాధి దగ్గర ఒకరిద్దరు ఆడవాళ్ళు కూర్చుని అమ్మ చెప్పిన మాటలు మననం చేసుకొంటూనో, అమ్మతో గడిపిన ఆ రోజుల్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూనో కన్పిస్తారు. ప్రస్తుతం అమ్మ సమాధి మందిరం నిర్మాణంలో వుంది. అమ్మ నివసించిన కుటీర ప్రదేశం కూడా మందిరంలో కలిసి పోయింది.

★★★

# అవధూత శ్రీ చివటం అమ్మ

## అమ్మ పూర్వాశ్రమం

ఇంతకూ ఎవరీ అమ్మ? అమ్మ తల్లిదండ్రులెవరు? పుట్టు పూర్వోత్తరాలేమిటి? కులగోత్రాలేమిటి? - అనేవి మన ప్రశ్నలు! దేహమే తానన్న భ్రాంతిని వీడి చైతన్య స్వరూపిణి అయిన అమ్మ గురించి కూడా ఇటువంటి ప్రశ్నలు మనకు - దేహ పరిమితులమైన మనకు కలగడం సహజమే మరి!

అమ్మగారికి తల్లిదండ్రులు పెట్టిన పేరు అచ్చమ్మ. వీరి స్వస్థలం చివటం గ్రామానికి 8 మైళ్ళ దూరంలో వున్న రేలంగి గ్రామం. వీరు కాపు కులస్థులు. వీరి తండ్రి శ్రీ మారిశెట్టి భద్రయ్య గారు. వీరి మొదటి భార్య సంతానం అమ్మగారు, అమ్మగారి తల్లిగారి పేరు తెలియరాలేదు. అమ్మ గారికి చిన్న వయస్సులోనే శ్రీ గరగ అంజయ్య గారితో వివాహమైంది. సుమారు 20 సం॥ వయస్సులో వీరికి ఒక కుమారుడు జన్మించాడు. వారి పేరు సూరన్న. రేలంగి గ్రామంలో జీవనం సరిగ్గా గడవక పోవడం వల్ల వీరు చివటం వచ్చి స్థిరపడ్డారు.

అమ్మ భర్త అంజయ్య గారు పండ్లు - కూరగాయల వ్యాపారం చేసేవారు. వచ్చిన డబ్బుతో తప్పతాగి, ఇంటికి వచ్చి, అమ్మను కొడుతుండేవారు. భర్త ఇంటి ఖర్చుకి డబ్బులివ్వకపోయినా, అమ్మ వారింట్లో వీరింట్లో వడ్లు దంచి, బియ్యం బాగుచేసి, ఆ వచ్చిన కూలితో పిల్లవాడికీ, తాగి ఇంటికి వచ్చిన భర్తకు, అన్నం వండి పెట్టేవారు. పెట్టినది తినక, నిష్కారణంగా అమ్మను హింసిస్తూండేవారు అమ్మ భర్త. ఏమి చేసినా పల్లెత్తు మాట అనకుండా దుర్మార్గుడైన భర్తను గూడా గౌరవంగా చూసేవారు అమ్మ. సహనానికి మారు పేరు అచ్చమ్మ! తన కష్టాలకు ఎవరూ కారకులు కారనే అవగాహనే అమ్మ ఓరిమికి పునాది.

అమ్మ చిన్నప్పటి నుంచీ మిగిలిన వారి కంటె భిన్నంగా వుండేవారు. అమ్మ బడిచదువులు ఏమీ చదువుకోలేదు. అమ్మకు రామనామమంటే ఎంతో ప్రీతి! అమ్మ నోటి వెంట కృష్ణా, రామా అనే పదాలు తప్ప మరేమీ పలికేవి కాదు.

ఏ పని చేస్తున్నా, ఆమె హృదయంలో రామ నామస్మరణ నిరంతరం జరుగుతుండేది. ప్రతి ఒక్కరిలో రాముని చూసుకొనేవారు అమ్మ. ఏ పనీ లేనప్పుడు అరటి గెలలు కావవేసే మట్టిగూటిలో కూర్చుని, ధ్యానంలో మునిగి పోయేవారు. చివటంలో ఎక్కడ భజనలు జరిగినా అమ్మ వెళ్ళేవారు. భర్త ఊళ్ళో లేని రోజుల్లో, తమ ఇంట కూడ భజన జరిపించి, ప్రసాదాలు పంచేవారు. అమ్మ ఎన్నడూ అనవసర కాలక్షేపం చేసేవారు కాదు. దైవధ్యానంలోనో లేక ఏదైనా పనులు చేస్తూనో కాలం గడిపేవారు.

అమ్మ తాను కూలిపని చేసి సంపాదించిన కొద్ది డబ్బుల్తోనే బియ్యం, పప్పులు కొని, వండి పిల్లల్ని పిలిచి పెట్టేవారు. తమ ఇంట్లో వున్న అరటిపండ్లు, కూరగాయలూ ఇతరులకు పంచేవారు. అది తెలిసి భర్త దండించినా, దానం మాత్రం మానేవారు కాదు. భర్త గుర్తించలేని విధంగా గెల మధ్యలో అక్కడక్కడా కాయలు తుంపి పిల్లలకిచ్చేవారు. పిల్లలంటే వీరికెంతో ప్రేమ! చిన్న చిన్న పిల్లలు పంచెలు కట్టుకొని, నామం పెట్టుకొని వుంటే అమ్మ ఎంతో ముచ్చట పడేవారు. తాను వండిన ప్రసాదాలు కుక్కలు తినిపోయినా, అమ్మ వాటినేమీ అనేవారు కాదు - అదిలించేవారూ కాదు.

అమ్మ భర్త నైజం అమ్మ స్వభావానికి పూర్తిగా విరుద్ధం! భార్యను, పిల్లవాడిని పట్టించుకొనే వారే కాదు. ఒక్కోసారి ఎటో వెళ్ళి పోయి నాలుగైదు రోజులు ఇంటికి వచ్చేవారే కాదు. వచ్చినా, అమ్మను కొట్టడమూ - తిట్టడమూ! అమ్మ మాత్రం మౌనంగా అన్నీ సహించేవారు. భర్తకెన్నడూ ఎదురు చెప్పేవారు కాదు. ఏ జన్మలోనో మిగిలిపోయిన ఋణానుబంధాన్ని తీర్చుకోవడానిగ్గా, బహుశా అమ్మ అంజయ్య గారి భార్య అయ్యుంటారు. ఆ ఋణం తీరి పోయింది కాబోలు - ఒక రోజు అమ్మ తన కొడుకును జాగ్రత్తగా చూసుకోమని అత్తగారితో చెప్పి, పుట్టింటికి వెళ్ళి వస్తానని చెప్పి వెళ్ళిపోయారు. దారిలో కొడుకు సూరన్న కన్పిస్తే, దగ్గరకు తీసుకొని రెండు పటికబెల్లం ముక్కలూ, రెండు రాగి కాసీలు ఇచ్చి, ఆశీర్వదించి, ఇంటికి వెళ్లమని చెప్పి, అటుగా పోతున్న గ్రామస్థులకు కొడుకును భద్రంగా ఇంటికి చేర్చమని అప్పజెప్పి, వెళ్ళిపోయారు. ఆ సంఘటన గుర్తు తెచ్చుకొంటూ సూరన్నగారు ఈ రోజుకీ కంట తడిపెడతారు - "నాకప్పుడు ఏమీ

తెలియని చిన్నతనం - ఆ కానుల్తో కొనుక్కు తినేశాను - అమ్మ గుర్తుగా ఆఖరి సారిగా ఇచ్చిన ప్రసాదమని అప్పుడు నాకు తెలియదు" అని బాధ పడతారు.

ఋణానుబంధం తీరిపోయిన అమ్మ అన్ని బంధాలనూ వదిలించుకొని, భగవంతునికి అంకితమైపోయారు. అమ్మ నేరుగా చిన్నాయ గూడెం వెళ్ళి, అక్కడ భజనలు చేస్తుండే ఒక భక్తుని ఇంట్లో ధ్యానంలో మునిగిపోయారు. అమ్మను వెదుక్కుంటూ అమ్మ తల్లి వాళ్ళు వచ్చారు గానీ, అమ్మ వారి కంట పడలేదు. చివరకు తెల్లవారుఝామున అమ్మ స్నానానికి నదికి వెళ్ళే సమయంలో పట్టు కోవాలని వేచి వున్నారు. తీరా ఆ సమయానికి వారికి నిద్ర పట్టింది. అమ్మ అటు వెళ్ళగానే మెలకువ వచ్చింది. అమ్మ తిరిగి వచ్చేటప్పుడు పట్టుకోబోతే, అమ్మ విదిలించుకొని పూజాగృహంలోకి వెళ్ళిపోయారు. తర్వాత అమ్మకు నచ్చచెప్పి ఇంటికి పంపుతామని చెప్పి, ఆ భక్తుడు వాళ్ళను ఇంటికి పంపేశారు. తర్వాత అమ్మను ఎలాగో ఇంటికి పంపించాడు. అమ్మ రేలంగి వెళ్ళి నెలరోజులు మాత్ర మక్కడ వుండి, తిరిగి చిన్నాయ గూడెం వెళ్ళిపోయారు. మరల కొంతమంది అమ్మను బ్రతిమాలి తీసుకువచ్చారు. అయితే మళ్ళీ త్వరలోనే అమ్మ ఇల్లు విడిచి వెళ్ళిపోయారు. కొన్నాళ్ళు చిన్నాయ గూడెం, మన్నెం జగన్నాథపురంలలో వుండి చివరకు చివటం చేరారు.

రెండవ సారి అమ్మ చిన్నాయ గూడెం వెళ్ళిపోయినప్పుడు, అమ్మను వెదికి మరలా రేలంగి తీసుకువచ్చారు. అప్పుడు అమ్మ అడబడుచు అమ్మకు గుండు చేయించి "పెట్టు మందు పసరు" (తాంత్రికులు మంత్రించి ఇచ్చిన పసరు) తలకు పట్టించారు. అమ్మ ఆవిడనేమీ వారించకుండా 'మీ ఇష్టం వచ్చింది రాసుకోండే' అన్నారు. ఆ రాత్రి అమ్మను గదిలో పెట్టి, తాళం వేశారు. ఉదయాన్నే చూస్తే, బయట వేసిన తాళం వేసినట్లే వున్నది గానీ, గదిలో అమ్మ లేరు! ఈ లీలతో రేలంగి వాస్తవ్యులకు అమ్మ దివ్యత్వం అర్థమైంది.

అమ్మ రెండవసారి చివటం వచ్చిన తర్వాత కూడా చీర ధరించే వుండే వారు. ఆమెకో నివాస స్థలం అంటూ వుండేది కాదు. ఎక్కడ బడితే అక్కడ ధ్యానంలో మునిగిపోయేవారు. అమ్మ ఎక్కువగా చివటం శ్మశానం లోని జమ్మి చెట్టు క్రింద కూర్చుని ధ్యానం చేసుకొనేవారు.

"ఎప్పుడూ శ్మశానాలలో ఎందుకమ్మా తిరుగుతారు?" అన్న భక్తులతో అమ్మ "చావనేది రాకుండా వుండటానికి" అనేవారు. అంటే ఈ చావు పుట్టుకలకు అతీతంగా ఏ స్థితి అయితే వుందో దాన్ని పొందటం కోసం అని అమ్మ భావం కావచ్చు. ఒక్కోసారి అమ్మ జనం తన జోలికి రాకుండా వుండాలని శ్మశానంలో తన చుట్టూ ఎముకలు పేర్చుకొని, మధ్యలో పడుకొనేవారు. అది చూచి కొందరు అమ్మ శవాల్ని తింటుంది అనుకొనేవారట.

'జమ్మి చెట్టు క్రిందనే కూర్చుని ధ్యానం చేసుకొంటారు ఎందు కమ్మా?' అని అడిగితే, "కాయలు కాయని చెట్టు క్రింద కూర్చోవాలే" అనేవారు. అంటే కర్మఫలం లేని విధంగా జీవితాన్ని గడపాలనీ, పునర్జన్మ కల్గించే వాసనలకు దూరంగా వుండాలనీ అమ్మ భావం అయ్యుండవచ్చు. అమ్మకు ఆ జమ్మిచెట్టు అంటే చాలా ప్రీతి - తర్వాత కుటీరంలో నివసించే కాలంలో కూడా అమ్మ తరచూ భక్తులను తీసుకొని వెళ్ళి ఆ చెట్టు క్రింద భజన చేయించేవారు. తన భక్తులను ఆ చెట్టు క్రింద ధ్యానం చేసుకోమని పంపేవారు.

అమ్మ మన్నెం జగన్నాథపురంలో కొంతకాలమున్నారు. ఎవరితో మాట్లాడ కుండా మౌనంగా వుండేవారు. ఎక్కువగా శ్మశానాల దగ్గరా, తోపుల్లోనూ వుంటూ కఠినమైన దీక్షలు చేస్తుండేవారు. ఒక్కోసారి అమ్మ సమాధి స్థితిలో పాము పుట్ట మీద ఒరిగిపోయేవారు. భయంకరమైన నాగుపాములు అమ్మ మీదుగా ప్రాకుతూ వెళ్ళిపోతున్నా, అమ్మకేమీ తెలిసేది కాదు. అవి కూడా అమ్మనేమీ చేసేవి కావు. అమ్మ అడవుల్లో తపస్సు చేసుకొనేటప్పుడు ఒక గోవు రోజు అమ్మ దగ్గరికి వెళ్ళి పాలిచ్చి వచ్చేదట. ఆవు ఇంటికి వచ్చిన తర్వాత పాలివ్వక పోవడంతో యజమానికి అనుమానం వచ్చి, ఒకరోజు ఆవును వెంబడించి వెళ్ళి చూశాడట. ఆ ఆవు అమ్మ దగ్గరకు వెళ్ళి, తన దూడకు పాలిచ్చినట్లు ఇచ్చేదట! అది చూసిన యజమాని, ఆ ఆవును అమ్మకోసమని విడిచిపెట్టేశాడనీ, కొంతకాలానికి ఆ ఆవు ఎవరికీ కనిపించ కుండా పోయిందనీ చెప్పుకుంటారు.

మన్నెంలో వున్న రోజుల్లోనే అమ్మ కాషాయం ధరించడం ప్రారంభిం చారు. ఒకరోజు రాత్రివేళ అమ్మ ఒంటరిగా వెళ్తుండటం చూచిన ఒక యువకుడు అమ్మను వెంబడించాడు. అది గమనించి అమ్మ జుట్టు పీక్కుంటూ, గాజులు

పగుల గొట్టుకుంటూ పిచ్చిదానిలా నటించి తప్పించు కొన్నారు. మర్నాడు ప్రొద్దున్నే అంత కాషాయం తెచ్చుకొని, కట్టుకొన్న చీర సగభాగం కాషాయం అద్దుకొని, అది ఆరాక, మరో సగభాగానికి అద్దు కొన్నారట.

అమ్మ చిన్నాయగూడెం, మన్నెం జగన్నాథ పురం ప్రాంతాల్లో సుమారు 12 సం॥లు వున్నారు. ఆ రోజుల్లో కొందరు భక్తులు గజ్జరం అనే గ్రామానికి అమ్మను తీసుకు వెళ్ళి, అక్కడ భజనలు చేసేవారు. అమ్మ రాత్రంతా మేలుకొనే వుండేవారు. ఒకరోజు అమ్మ మకాం చేసిన ఇంటివారబ్బాయి అమ్మ నిద్ర పోకుండా ఏం చేస్తుందో చూడాలని కుతూహలంతో అమ్మను గమనిస్తూ మెలకువగా గడిపాడు. అమ్మ తెల్లవార్లూ రామనామం చేస్తూనే వున్నారు. ఉదయాన్నే ఆ ఇంటామెతో అమ్మ "రాత్రంతా రాముడు నన్ను పరీక్ష చేశాడు" అన్నారు.

మన్నెం జగన్నాథపురం గ్రామ పొలిమేరల్లో వున్న పుంతలో ఒక పుట్టపై పడివున్న అమ్మను చూసి, ఎవరో పిచ్చి మనిషి పుట్ట మీద పడివుందని చూసిన వారంతా చెప్పుకోవటం మొదలైంది, అమ్మ నాలుగు రోజులు అదే స్థితిలో వుండగా ఆ గ్రామస్థులు శ్రీ వేములపల్లి బాపన్న గారు అమ్మను చూసి, పిచ్చిమనిషి కాదు అని గ్రహించి అమ్మకు ఎండ తగలకుండా పందిరి వేయించారు, అమ్మ అక్కడ చాలా కాలం వున్నారు. ఒకరోజు పొలాల్లో ఎండిపోయిన పంటబోదిలో, అరిటాకులు తనపై వేసుకొని అమ్మ సమాధి స్థితిలో పడుకొని వుంటే, ఒక నాగుపాము వచ్చి అమ్మతలవైపు పడగ విప్పి నిల్చొని వుండటం గొడ్లు కాచుకొనే పిల్లలు చూశారట.

ఆ గ్రామంలో ఒకరు తమ ఇంటిలో ఒక గదిలో అమ్మకు మకాం ఏర్పాటు చేశారు. ఆ ఇంటామె ఒకరోజు అమ్మ గదిలోకి భోజనం తీసుకు వెళ్ళేసరికి, అమ్మ భూమికి నాలుగడుగుల ఎత్తులో, గాలిలో కూర్చుని కనిపిం చారు. అది చూసి ఆమె భయపడి బయటకు వచ్చి తలుపు మూసింది. ఆ తర్వాత అమ్మ ఆమెతో "ఇందాక భయపడ్డావా? ధ్యానం చేసుకొనే సమయాల్లో రాకమ్మా? అన్నారు.

ఒక్కోసారి అమ్మ మనుషులకు దూరంగా పొలాల్లోనూ, డొంకల్లోనూ

గడిపేవారు. పైడి పర్రు వీరన్న అనే రైతు కూలీ ఒకరు తెల్లవారు జామున కూలిపనికి వెళ్తుండగా అతనికి కొంచెం ముందుగా అమ్మ ఆ దారిన వెళ్తుండటం గమనించి, ఆ వెనుక నెమ్మదిగా నడుస్తున్నారు. అమ్మ వెళ్ళే దారిలో వున్న ముళ్ళపొదలూ, చెట్ల కొమ్మలూ విడిపోయి అమ్మకు దారి ఇవ్వటం స్వయంగా తన కళ్ళతో చూసి, ఆశ్చర్యపోయాడట!

ఆ తర్వాత అమ్మ కొంతకాలం రాజమండ్రిలోని సాధుస్త్రీల మఠంలో వున్నారు. అమ్మ ఎప్పుడూ శ్మశానంలోకో, గోదావరి ఒడ్డుకో వెళ్ళి ఒంటరిగా ధ్యానం చేసుకొనేవారు. ఒక్కరోజు రాత్రంతా ధ్యానం చేసుకొని తెల్లవారు జాముకు తిరిగి వచ్చేవారట. ధ్యానస్థులైన అమ్మకు బాహ్యస్ఫురణగానీ, ఆకలి దప్పులు గానీ వుండేవి కావు. మఠంలోని స్త్రీలు అన్నం తీసుకొని అమ్మ కోసం వెదుక్కుంటూ వెళ్ళి, తినిపించి వచ్చేవారు. ఒక్కోసారి తినేవారు - ఒక్కోసారి అదీ లేదు. యవ్వనంలో వున్న అమ్మ రాత్రిపూట అలా ఒంటరిగా వెళ్ళడం మంచిది కాదని మఠంలోని స్త్రీలు అమ్మతో చెప్పేవారు. "సరే, అలానే - ఇక వెళ్ళనులే!" అనేవారే గానీ, మళ్ళీ మామూలే!

ఒకసారి అమ్మ చీరనిండా రక్తపు మరకలు! "ఏమిటమ్మా ఇవి?" అని చూస్తే, అమ్మ వంటి నిండా బ్రహ్మజెముడు ముళ్ళు గుచ్చుకొని రక్తం కారుతున్నది. అమ్మకు మాత్రం శరీరస్ఫురణే వుండేవి కాదు.

★★★

# అవధూత శ్రీ చివటం అమ్మ

## అవధూతగా మారిన అచ్చమ్మ

అమ్మ దిగంబరి కావడం గురించి అమ్మను సేవించిన భక్తులు ఇలా చెప్పారు.

ఒకసారి పాలకొల్లు వద్ద లక్ష్మీపాలెం అనే గ్రామంలో సాధూరాం బాబాజీ పౌరాణికోపన్యాసాలు చెబుతున్నారు. అమ్మ ఆ సభలకు వెళ్లారు. ఆరోజు అవధూత లక్షణాలను గురించి వారు చెబుతుంటే వివరంగా మరోసారి చెప్పమని అమ్మ అడిగారు. అప్పుడు సాధూరాం బాబాజీ అమ్మతో 'వివరిస్తే, నీవు ఆచరించగలవా?' అని ప్రశ్నించారు. అమ్మ జవాబుగా వెంటనే తన వస్త్రాన్ని విప్పి, ఆయన వైపు విసిరి దిగంబరిగా నిలిచారు. అప్పుడాయన తన భుజం పైనున్న కండువాను అమ్మపైకి విసిరి "ముండనం చేయించుకొని ముండలాగా వుండు" అన్నారు. అమ్మ అప్పటి నుంచీ వారిని తన గురువుగా భావించి, ఆయన విసిరిన కండువాను కొంతకాలం ధరించి, తర్వాత దిగంబరిగానే వుండిపోయారు. అమ్మ సాధూరం బాబాజీ నిర్వహించే గురుపూజలకు ప్రతి సంవత్సరం వెళ్ళేవారు. అలా మూడు సం॥లు వెళ్లి, తర్వాత మానేశారు.

ఆ రోజుల్లో అమ్మ తనకై తాను స్నానం చేసేవారు కాదు. శేషమ్మ అనే భక్తురాలు అమ్మతో "సాధనకు తోడుపడే శరీరం కూడా శుభ్రంగా వుండాలి" అని చెప్పి, అమ్మను ఒప్పించి ఇంటికి తీసుకువెళ్ళి తలుపులు మూసి, స్నానం చేయించి, ఒళ్ళు తుడిచి కట్టడానికి చీర తెచ్చేలోపుగా అమ్మ వీధిలోకి వెళ్ళి పోయారు. శేషమ్మ గారు తన చేతనున్న చీరను అమ్మకు చుట్టబెట్టాలనే ఉద్దేశ్యంతో అమ్మను వెంబడించగా, అమ్మ రోడ్డు ప్రక్కన గల బురదలో పడి దొర్లి, శరీరం అంతా దుమ్ము, మన్ను అంటిన తర్వాత లేచి పొలాల వైపు వెళ్ళిపోయారు. గ్రామంలోని స్త్రీ పురుషులంతా అచ్చమ్మ బట్టలు విడిచేసింది అని వింతగా చెప్పుకున్నారు. అమ్మ అప్పటి నుంచీ దిగంబరంగా వుండిపోయారు అని కూడ

కొందరు చెప్తారు.

అమ్మ దిగంబరి కావడం గురించి మరో విధంగా కూడా కథనం వున్నది. అమ్మ తీవ్రధ్యానస్థితిలో వుంటూండే రోజుల్లో తరచు వంటి మీది చీర జారిపోతూ వుండేది. అమ్మ తిరిగి చీరను బిగించి కట్టుకొనేవారు. ఇలా తరచూ జరుగుతూ వుండేది. ఒకసారి అలా జారిపోయిన చీరను తన ముందు నడుస్తున్న ఓ బాలునిపై వేసి అప్పటి నుంచీ అలా దిగంబరిగా వుండి పోయారు అంటారు కొందరు. చివటం వచ్చిన క్రొత్తలో అమ్మ ఎక్కడ పడితే అక్కడ కూర్చుని ధ్యానం చేసుకొనేవారు. ఒక్కసారి వారికి బాహ్యస్మృతే వుండేది కాదు. మలమూత్ర విసర్జన కూడా తెలిసేది కాదు. ఎవరో ఒకరు అమ్మకు స్నానం చేయించి శుభ్రం చేసేవారు. అమ్మ తమ తడి వంటిని ఎవరూ తుడవటానికి అంగీకరించేవారు కాదు. తన శరీరాన్ని ఎవరినీ తాకనిచ్చే వారు కాదు. "నన్ను తాక వద్దు - నాకు ముళ్ళు గుచ్చుకొంటున్నట్లుంటుంది" అనేవారు అమ్మ. అమ్మ ఎండా, వానా ఏదీ పట్టించుకొనేవారు కాదు. ఆ వర్షపు నీటితోనే స్నానం చేయటం, వాటినే త్రాగటం చేసేవారు.

అమ్మను మహాత్మురాలుగా గుర్తించిన కొందరు గ్రామస్థులు అమ్మ మీది ప్రేమతో కుటీరం ఒకటి వేసి ఇచ్చారు. రామాలయం వెనుక వున్న అమ్మ కుటీరం అలా వేసిన కుటీరాలలో అయిదవది. మొదట మామిడి తోటలోను, తర్వాత ఊరిలోనూ, ఆ తర్వాత కంటిరెడ్డి గవరమ్మ గారి దొడ్లోనూ కుటీరం వేసి ఇచ్చారు. అక్కడ బావిలో నీళ్ళు తోడే శబ్దాన్ని అమ్మ భరించలేక "నా గుండెలలో చాదవేస్తున్నట్లున్నది" అనేవారట. అందువల్ల రోడ్డు పక్కన సర్కారు వారి స్థలంలో వేపచెట్టు క్రింద కుటీరం వేసి ఇచ్చారు.

ఆ వేపచెట్టు ఒక ఇంటి స్థలానికి అనుకొని వుంది. ఆ ఇల్లూ, స్థలమూ మరొకరు కొనుక్కున్నారు. వారు తమ గుమ్మలో దిగంబరిగా వుండే అమ్మ నివసించడం తమకు మంచిది కాదనీ, అమ్మ అక్కడ నుంచి వెళ్ళకపోతే ఆ ఇల్లు విడిచి తామే వెళ్ళిపోతామని ఊరివారితో చెప్పున్నారు. ఆ విషయం విని అమ్మ "నా గురించి వాళ్ళు ఇల్లు విడిచి వెళ్లిపోవడమెందుకు? నేనే వెళ్ళిపోతాను' ' అని అక్కడి కుటీరం పైద తాటి ఆకులు లాగి వేశారు. అమ్మ భక్తులు ఆ

కుటీరం అక్కడ నుంచి తీసేసి, రామాలయం వెనుక క్రొత్త కుటీరం నిర్మించారు. ఆ సందర్భంలో కొందరు పెద్దలు అమ్మతో "మీ కుటీరం తొలగించడానికి కారకు లెవరు? వాళ్ళ పని మేము చూస్తాం" అంటే, "ఇదే తీసేసింది బాబా" అన్నారు అమ్మ.

వేపచెట్టు క్రింద కుటీరంలోని మట్టిని కొంత తవ్వించి, రామాలయం వెనుక కట్టిన క్రొత్త కుటీరంలో వేయించారమ్మ! ఆ కుటీర నిర్మాణానికి కొందరు భక్తులు వారికి తెచ్చిన సొమ్మును ఒక భక్తుని వద్ద వుంచి, కుటీర నిర్మాణానికి వినియోగించమన్నారు. ఆ సందర్భంలో చిన్నం సీతా మహాలక్ష్మిగారు అమ్మకు ఒక రూపాయి ఇచ్చింది. అమ్మ ఆ రూపాయిని తన వద్ద వుంచుకొని, ఆమెకు 10 రూపాయిల కాగితం ఇచ్చి, ధనాన్ని సేకరించి వినియోగిస్తున్న భక్తునికి ఇచ్చి రమ్మన్నారు. అమ్మకు తాను ఇచ్చింది ఒక్క రూపాయి అయితే పది రూపాయలు ఇచ్చినట్లుగా అబద్ధం చెప్పడం ఇష్టం లేక తాను పట్టుకెళ్ళి, ఇవ్వను అన్నది. అప్పుడు అమ్మ తానే స్వయంగా వెళ్ళి, పది రూపాయలు ఇచ్చి, సీతామహాలక్ష్మి భర్త ఇచ్చినట్లుగా వ్రాయించారు.

చివటంలోని వారంతా అమ్మను దైవంగా భావించేవారే గానీ, వారి దిగంబరత్వాన్ని చూసి హేళన చేసేవారు కాదు. సాధారణంగా అమ్మ భిక్షకు వచ్చే వేళల్లో పురుషులు ఆమెకు ఎదురురాకుండా ప్రక్క వీధుల్లోంచి తప్పుకు పోయేవారు. క్రొత్తవారు ఎవరైనా ఎదురైతే, అమ్మే రోడ్డు దిగి ఒక ప్రక్కగా ఒదిగి నిలుచుండిపోయేవారు వాళ్ళు వెళ్ళిపోయేదాకా.

అమ్మ అప్పుడప్పుడూ రైల్లో కూడా ప్రయాణం చేసేవారు. అమ్మ ఎక్కువగా రాత్రి వేళలే ప్రయాణం చేసేవారు. ఒకసారి రాజమండ్రి స్టేషన్‌లో అమ్మ దిగంబరిగా వుండటం గమనించిన రైల్వే అధికారులు అలా రైల్లో ఎక్క కూడదనీ, అరెస్టు చేస్తారనీ అన్నారు. అమ్మ ఏమీ మాట్లాడలేదు. ప్రక్కనున్న నారాయణమ్మగారు అమ్మ మహాత్మురాలనీ, అమ్మ అలా చాలా కాలంగా దిగంబరంగా వుంటున్నారనీ నచ్చ చెప్పారు.

అమ్మ ఒక్కోసారి తణుకు వీధులలో తిరుగుతూ కన్పించేవారట. అమ్మ

దిగంబరంగా వుండడం వలన పిచ్చామో అనుకొని పిల్లలు రాళ్ళతో కొట్టేవారు. ఒళ్ళంతా నెత్తురు కారుతున్నా, వారినేమీ అనక, ఆశీర్వదించేవారట. తనను హేళన చేసిన వారిని కూడా అమ్మ మౌనంగా ఆశీర్వదించే వారట!

అమ్మ దిగంబరి, అవధూత. ఆజానుబాహువు. చామనఛాయ శరీరంతో, చక్కని కనుముక్కు తీరుతో అందంగా వుండేవారు. దాదాపు 5'2" ఎత్తుండేవారు. దృఢకాయులు.

అమ్మ మితభాషి. సన్నిహిత భక్తులతో అవసరమైనంత మాత్రమే మాట్లాడేవారు. కొత్తవారితో అసలు మాట్లాడేవారు కాదు. మౌనంగా కూర్చునేవారు. కొత్తవారు వచ్చినప్పుడు సన్నిహితులతో కూడా మాట్లాడకుండా, సైగలు చేసి చెప్పేవారు. లేకపోతే, చాలా చిన్నగా లోగొంతుతో మాట్లాడేవారు. ఎప్పుడైనా కోప్పడేటప్పుడు మాత్రం గట్టిగా మాట్లాడేవారు. ఒక్కోసారి క్రొత్తవాళ్ళు వచ్చినప్పుడు అమ్మ మోకాళ్ళ మీద తలపెట్టుకొని, ఒదిగిపోయి కూర్చునేవారు. వాళ్ళు వెళ్ళిపోయిందాకా తల ఎత్తేవారే కాదు.

అమ్మ నవ్వు తమాషాగా వుండేది. ఆమె నోరు తెరిచి నవ్వేవారు కాదు. మూతి మూసుకుని "ఉహు-ఉహు" అని నవ్వేవారు. ఎంత ఎక్కువగా నవ్వు వచ్చినా సరే, అలాగే నవ్వేవారు గానీ, నోరు తెరచేవారు కాదు. చాలా చిన్నగా నవ్వేవారు.

అమ్మ ఎక్కువగా పద్మాసనం వేసుకొని కూర్చునేవారు. ఒక్కోసారి అమ్మ ఒక కాలు మీదే నిలబడి, ఇంకో కాలు ముడుచుకొని, అలా గోడకు ఆనుకొని నిలబడేవారు.

అమ్మ మట్టి పాత్రలో భోజనం చేసేవారు. ఆమెకు పడుకోవడానికి పట్టుపరుపులు, దిండ్లు లేవు. ఒక మనిషి మాత్రమే పడుకునే వీలుండే ఆ చిన్నగదిలో నేలపై పరచిన చెక్క పలకల మీద పడుకునేవారు. వాటిని చూస్తుంటే, అవి అమ్మకు ఎంతగా ఒత్తుకునేవో కదా అనిపిస్తుంది. తల క్రింద దిండుగా మరొక చెక్కముక్క పెట్టుకునేవారు. ఆచెక్కల క్రింద చీమలు, బొద్దింకలు స్థిరనివాసం చేస్తుంటాయి. ఒక్కోసారి అవి కుట్టి ఒంటి నిండా దద్దుర్లు వచ్చేవి.

అమ్మ మాత్రం వాటిని దులపనిచ్చేవారు కాదు. అమ్మ వుండే ఆ చిన్న గదిలోకి ఎవర్నీ రానిచ్చేవారు కాదు. ఆ గదిలోనే చిన్న అటక వుండేది. దాని మీద ఏవో కొన్ని పచ్చళ్ళూ, ఇతర వస్తువులు దాచి వుంచి, అవసరమైనప్పుడు తానే స్వయంగా తీసి ఇస్తుండేవారు. అమ్మ పడుకునే ఆ గది చాలా చిన్నది ('6×2')గా వుంటుంది. ఆ గది ముందు చతురస్రాకారంగా వున్న ('6×6') అడుగుల గది వుంటుంది. అమ్మ రోజులో చాలాకాలం ఈ రెండు గదులలోనే గడుపుతారు. అమ్మ సాధారణంగా ఎవర్నీ కుటీరంలో పడుకోనివ్వరు. అమ్మని చూడటానికి వచ్చే భక్తులు అమ్మ కుటీరానికి ఆనుకొని వున్న రామాలయంలో పడుకొంటారు.

ఈ రామాలయానికి కూడా కొంత చరిత్ర వున్నది. ఆ రోజులలో పరుచూరి వెంకట్రామయ్యగారనే పౌరాణికులు వుండేవారు. వారు శాస్త్రం విడమరచి చెప్పేవారు. అమ్మ, వెంకట్రామయ్యగారు ఒకే ఆకులో అన్నం తినేవారట. ఈ వెంకట్రామయ్యగారు కరుటూరి నారాయణ మూర్తి గారింట్లో వుండేవారు. వారింటికి అమ్మ కూడా వెళ్ళేవారు. నారాయణ మూర్తిగారే ఈ రామాలయ దాతలు. ఈ రామాలయంలోనే అమ్మ ప్రతిరోజూ మధ్యాహ్నం సత్సంగం చేసేవారు. సాయంత్రం పూట సత్సంగము, భజన చేయించేవారు. ఈ రామాలయానికి ఎంతో మంది మహనీయులు విచ్చేశారు. అందు వలన ఆ రామాలయం ఎంతో పవిత్రమైనది.

చివటం వచ్చిన మొదట్లో దాదాపు 12 సంవత్సరాలు అమ్మ మౌనంగానే వుండేవారు. పరుచూరి వెంకట్రామయ్య గారు తన శిష్యురాం డ్రను అమ్మకు అప్పగించి, దివంగతులైనప్పటి నుంచే అమ్మ మాట్లాడటం మొదలు పెట్టారు.

అమ్మ దిగంబరియైన దగ్గర నుంచీ భిక్ష చేసేవారు. మొదటి రోజుల్లో అమ్మ భిక్ష చేతిలోనే వేయించుకొని తినేవారు. ఒక్కోసారి అలా వెళ్ళిపోతున్న అమ్మను ఆపి, కొందరు చేతిలో పెద్ద ముద్దలు పెట్టేవారు. అమ్మ కుటీరంలో నివసింపసాగాక, ఒక మట్టి పాత్ర తీసుకొని భిక్షకు వెళ్ళేవారు. తెచ్చిన భిక్షనంతా రుచి విచక్షణ లేకుండా కలిపేసి, భక్తులకు ప్రసాదంగా పెట్టేవారు. కుక్కలకు కూడా పెట్టేవారు. మిగిలినదే తాము తినేవారు. ఒక్కోసారి అమ్మ తనకు తోచిన వారింటికి వెళ్ళి వారి అన్నం కుండ నుంచి తనే చేయి పెట్టి తీసుకొని తినేవారు.

రోజు అమ్మ భిక్ష ప్రొద్దున్న 9 గం॥ నుంచి చేసేవారు. ఇన్ని ఇళ్ళకని ఏమీ లేదు. తనకు తోచిన ఇండ్లకు వెళ్ళేవారు. అమ్మ ఇంటి ముందు నిల్చుని 'భిక్షాందేహి' అనడం లాంటివి చేసేవారు కాదు - ఇంటి లోపలికి వచ్చి, చిన్నగా దగ్గేవారు. భిక్ష తీసుకొని వస్తూ దారిలోనే కనిపించిన పిల్లలకూ, పేదవారికీ, కుక్కలకూ పెట్టి వచ్చేవారు.

భిక్ష తీసుకొని కుటీరానికి వచ్చినతర్వాత అక్కడ ఎవరుంటే వారికి ప్రసాదం పెట్టేవారు. కానీ, రాగానే పెట్టేవారు కాదు. 'కాసేపు గీత చదువు కుందామే' అనేవారు. రోజు లక్ష్మిగారికీ, శ్రీదేవీ, సుబ్బమ్మా అనే పిల్లలకూ, ఇంకా ఎవరుంటే ఆ సమయానికి వారందరికీ భిక్షాన్నం పెట్టేవారు. అమ్మ ఒక్కోసారి రెండు మూడు సార్లు కూడా భిక్షకు వెళ్ళేవారు.

మొదటి రోజుల్లో అమ్మ భిక్షాపాత్రను భక్తుల ఇంటి ముందు వుంచి, కూర్చుని, చిల్ల పెంకులతో నహా భంగిమలు చేస్తూ ఆడేవారట. ఆ తర్వాత ఆ పెంకులతోనే లెక్క పెడుతూ నామం చేసేవారట! అందరూ అమ్మ మా ఇంటికి రావాలంటే మా ఇంటికి రావాలని ఎదురుచూసేవారు. ఒక్కోసారి అమ్మ వస్తుందని ఎక్కువ అన్నం వండి పెట్టుకొన్న వారింటికి వెళ్ళేవారే కాదు. అమ్మ ఏమి వస్తుందిలే అని తక్కువ బియ్యం పోసి వండుకొన్న వాళ్ళింటికి వెళ్ళేవారు. ఇలా తమకు తోచిన వారింటికే వెళ్ళేవారు.

చింతాలమ్మగారు ఒకసారి అమ్మతో, "అమ్మా! నాకు పది బస్తాల ధాన్యం వస్తుంది. మన ఇద్దరికీ సరిపోతుంది. అందరిళ్ళకూ ఇలా నువ్వు భిక్షకు పోవడ మెందుకమ్మా? మా ఇంట్లోనే భోంచెయ్యండమ్మా!" అన్నారట. అప్పుడు అమ్మ "మాలవాళ్ళున్నారు, మాదిగలున్నారు, తెలగలవాళ్ళున్నారు, కాపులున్నారు - వాళ్ళంతా తరించవద్దా?" అన్నారు. దీనిని బట్టి మహాత్ములు భిక్ష చేసేది పరహితం కోసమే గానీ, కేవలం తమ క్షుద్బాధను నివారించు కోవడానికి కాదని అర్థమౌతుంది. మహాత్ములకు సమర్పించిన భిక్ష సర్వజీవ కోటికీ చెందుతుంది. ఆ విధంగా అపారమైన పుణ్యాన్ని సంపాదిస్తాడు భిక్ష సమర్పించిన భక్తుడు.

అమ్మ సమాధి చెందే ముందు వరకూ కూడా స్వయంగా భిక్ష చేసేవారు.

బొత్తిగా ఓపిక లేని రోజున ఎవరి భుజం మీదనైనా ఆసరాగా చెయ్యివేసి, భిక్షకు వెళ్ళేవారు.

అమ్మ పళ్ళు తోముకొనేవారు కాదు. ఊరికినే నీళ్ళతో నోరూ, ముఖమూ కడుక్కునేవారు. అమ్మ కోసం భక్తులు ప్రొద్దున్నే కాఫీ తెచ్చిచ్చేవారు. "అమ్మ కాఫీ, చాలా ఇష్టంగా త్రాగేవారు" అంటారు లక్ష్మిగారు. కాఫీ త్రాగి రెండు ఇడ్లీలు తినేవారు. మధ్యాహ్నం భిక్షాన్నం భుజించేవారు. అమ్మ భోజనం మామూలుగా మనం తినేటంతే తినేవారు.

మధ్యాహ్నం రోజూ రామాలయంలో దీపారాధన చేయించి సత్సంగం చేయించేవారు. శనివారం భజన చేయించేవారు. తనను చూడటానికి వచ్చిన వారి చేత ఏదో ఒక పుస్తకం చదివిస్తుండేవారు. లేకపోతే "అత్తమామా దీని కేసే చూత్తారే!" అనేవారు. అమ్మ ఎక్కువగా భగవద్గీత చదివించేవారు. యోగవాసిష్ఠము, సాయిలీలామృతము, ఇతర మహాత్ముల చరిత్రలు కూడా చదివించేవారు.

మధ్యాహ్నం కొంచెంసేపు పడుకొనేవారు. లేచిన తర్వాత టీ త్రాగేవారు.

సాయంత్రం 6 గం॥వేళ రాత్రి భిక్షకు వెళ్లేవారు. ఒకటి, రెండు ఇళ్ళకే వెళ్ళేవారు. రాత్రి పడుకొనే ముందు 10-11 గం॥ సమయంలో కాళ్ళకు కొబ్బరి నూనె రాయించుకునేవారు. ఒకసారి సత్యంగారు ఇలా నూనె రాస్తూ వున్నారు. ఊరంతా సద్దుమణిగి నిశ్శబ్దంగా వుంది. అమ్మ ఇలా అన్నారు - "చూడు బాబూ! ఎంత ప్రశాంతిగా వుందో! ఈశ్వరుడు కోళ్ళను కప్పెట్టినట్టు కప్పెట్టే శాడు. మరలా ప్రొద్దుటే ఒదిలి పెడతాడు. వారంతా అప్పుడు కాకర బాకరలాడతారు".

తర్వాత తమ చిన్నగదిలో గడియవేసుకొని పడుకొనేవారు. రాత్రంతా ధ్యానంలో వుండేవారు. తలుపు కొట్టి, లేపవద్దనే వారు. తమ దగ్గర ఏదీపం వుంచుకొనేవారు కాదు. అమ్మ రాత్రి పూట ఏంచేస్తుంటారో అని గమనించిన ఒక భక్తునికి అమ్మగదిలో నుంచి ఏవో మూల్గులు, కొన్ని శబ్దాలూ, నామాలూ వినిపించాయట. ఒకసారి కుటీరం ముందు గదిలో కూర్చున్న భక్తులకు లోపల అమ్మ గదిలో నుంచి "నా వొంతుకు అన్నీ పచ్చి కాయలే వచ్చాయి దేవుడో" అని అమ్మ శోకాలు పెడుతూండటం వినిపించిందట.

అమ్మకు చిన్న పిల్లలంటే ఎంతో ప్రీతి. ఎప్పుడూ రామాలయం వద్ద అమ్మ సన్నిధిలో చాలా మంది పిల్లలు ఆడుకొంటూ వుండేవారు. అమ్మకు భక్తులు సమర్పించిన ప్రసాదాలను, అమ్మ ఆ చిన్న పిల్లలను పిలిచి ఆప్యా యంగా పెట్టేవారు. అలా ఆ పిల్లలకు నిరంతరం ప్రసాదాలు అందుతూనే వుండేవి - అమ్మ ప్రసాదాల్ని రోజూ తినే ఆ పిల్లలు ఎంత అదృష్టం చేసుకొని పుట్టారో! అమ్మకు దక్షిణగా ఎవరైనా చిల్లర డబ్బులిస్తే, బిళ్ళలు కొనుక్కోమనీ, సోడాలు త్రాగమనీ, ఆ పిల్లలకే పంచేసేవారు.

అమ్మకు చిన్నప్పటి నుంచీ శ్రీ రాముడంటే చాలా ప్రీతి. అందుకే ఆమె ఎప్పుడూ రామనామం స్మరిస్తూ వుండేవారు. తమ దగ్గరకు వచ్చిన వారితో రాముణ్ణి తలచుకోమని చెప్పేవారు. అమ్మ తాను గృహిణిగా వుండే రోజుల్లో కూడా వడ్లు దంపటం వంటి పని పాటలు చేసుకుంటూనే నిరంతర రామనామం చేస్తుండే వారు. ప్రొద్దు పొడవగానే సూర్యుని చూచి సుమారు అరగంట సేపు "శరణు, శరణు" అనేవారట. ఆ రోజుల్లో అమ్మ వంటి నిండా చీర కట్టుకొని, పెద్ద బొట్టు పెట్టుకొని వుండేవారట. ముక్కుకు బేసరి, కాలికి అందెలు కూడా వుండేవట. తర్వాత కాలంలో ఆ బేసరి (ముక్కుపుడక), అందెలు ఎవరో భక్తుల కిచ్చేశారట.

అమ్మ తనకు ఎటువంటి సౌకర్యాలు చేయడాన్నీ ఒప్పుకునేవారు కాదు. కొందరు ఊరి పెద్దలు అమ్మకు మంచి ఆశ్రమం కట్టిస్తామని ముందుకు వస్తే "ఆశ్రమాలను కట్టిస్తామని పది ఊళ్ళు తుడుస్తారురా!" అన్నారట అమ్మ.

భక్తులు అమ్మకు ఫోటో తీయిద్దామని ఒకసారి ఫోటోగ్రాఫరును పిలిపించారు. అమ్మ ఎటో వెళ్ళిపోయి, ఆ ఫోటోగ్రాఫరు వెళ్ళిపోయే వరకు రాలేదట. అలానే ఒకసారి మంగమ్మగారూ, అమ్మా ముమ్మిడి వరం బాలయోగి గారిని దర్శించడానికి వెళ్ళినప్పుడు, ఒకరు అమ్మను ఫోటో తీయడానికి ప్రయత్నిస్తే, అమ్మ అతడిపై మట్టి పెళ్ళలూ, రాళ్ళు విసిరి అతన్ని తరిమేశారు. చివరకు చివటం స్కూలు హెడ్‌మాస్టర్ గారు ఆ ఊరు నుంచి బదిలీ అయి వెళ్ళిపోతూ అమ్మను ఎంతగానో బ్రతిమాలితే, చివరికి ఒప్పుకొన్నారట. అదే మనం పూజించే అమ్మ ఫోటో. పద్మాసనంలో ఉన్న ఈ ఫోటోనే కాపీలు తీయించి అందరికి అందుబాటు



అవధూత శ్రీ చివటం అమ్మ

లో వుండేలా చేయమని అమ్మ తమ సమాధికి ముందు సూచించారు.

అమ్మ ఒక్కోసారి భక్తుల పాదాలు తాకి నమస్కారం చేసేవారు. శ్రీ శిరిడీ సాయిబాబా కూడా ఒక్కోసారి భక్తుడైన తాత్యా పాదాలు తాకి 'జయదేవా, జయదేవా' అని నమస్కరిస్తారు. "బాబా! ఇలా మాత్రం చేయకండి" అని చేతులు లాగివేస్తున్న తాత్యాతో "నోర్మూయ్! నీకేం తెలుసు!" అంటూనే నమస్కరిస్తారు. అలానే అమ్మ భక్తులను కూడ భగవత్స్వరూపంగా భావించి నమస్కరించేవారేమో! తత్త్వద్రష్ట లేక బ్రహ్మజ్ఞానియైన గురువు శిష్యుణ్ణి ఆ భగవంతుని రూపంగానే దర్శిస్తారు - అంటారు.

అమ్మ పడవల్లో, లాంచీల్లో ప్రయాణిస్తూ చాలా సార్లు భద్రాచలం వెళ్ళి భద్రాచల రాముని సేవించుకొని వచ్చేవారట. అమ్మతరచు ఈ క్రింది పాటలను పాడుకొంటూ, ఒక్కోసారి పాడి వినిపించుకొంటూ వుండేవారు.

**"రాముడే నా పంచప్రాణము - భూమి దేవత సాక్షిగా**
**ఏమరక నాదు సుతులను విడువకుండుడి**
**మునివరా - గురువరా సద్గురువరా**
**ఎండవానల తిప్పకుండుడి - ఏమి ఎరుగని బాలలు**
**వేళ తప్పక బువ్వ పెట్టుడి - గురువరా సద్గురువరా!"**

ఒకరోజు ఉదయం తలుపులు వేసుకొన్న అమ్మ గది ముందు కూర్చున్న కట్టా సత్యం గారికి 'హృదయమా వదలకే శ్రీహరి పదములు' అని అమ్మ పాడటం వినిపించిందట. అమ్మకు 'బ్రూహిముకుందేతి' అన్న కీర్తన అంటే చాలా ఇష్టం. భక్తుల చేత ఆ కీర్తనను తనివితీరా పాడించుకొని వినేవారు. మన్నె మంగమ్మగారిని అమ్మ అప్పుడప్పుడూ భాగవతంలోని పద్యాలు చదవమనేవారు. మధ్యలో మర్చిపోతే, అమ్మ వెంటనే అందించే వారు.

ప్రతిరోజూ ఉదయం నిద్ర లేస్తూనే రామునిపై పాటలు పాడుకొనే వారు. అమ్మ డైరీ వ్రాసిన భాస్కరిగారు అమ్మ పాడుకొనే పాటలలో కొన్నింటి ఇలా వ్రాసుకున్నారు.

1. శ్రీ రఘు రామ సీతారామ
రామరామ రఘు రఘు రామ
రామ రామయని ధ్యానము చేయరా
హరే హరే నారాయణ నారాయణా
పావన రామా పావన రామా
రామా రామా రామా రామా

2. రామ రామ పరాత్పర
రామా రామా శివ శివ
రామ రామ ప్రణవ స్వరూప
రామ రామ జానకి రామా!
వీరాంజనేయ రామాంజనేయ
శ్రీహరి హరి హరి
శ్రీకృష్ణ పరమాత్మా, శ్రీ కృష్ణ పరమాత్మా

3. కలిమి రామా కలిమి రామా
కలిమి రామా కలిమి రామా
పట్టాభిరామా పట్టాభిరామా
పట్టాభిరామా పట్టాభిరామా
అయోధ్య రామా అయోధ్య రామా
అయోధ్య రామా అయోధ్య రామా
కారుణ్య రామా కారుణ్య రామా
రామా రామా రామా రామా
దైవం గురువు రామ రామ
శాంతి రామ శరణు రామ

4. పరులను దూషించకే ఓ మనసా
రామ రామ రామ రామ అనవే
సురులు మునులతో కూడి కదలి నాడే
నాబాల దైవమే కోదండ రాముడు
తాటకిని వధించి, తపస్సును రక్షించి
బయలు దేరినాడె నా బాల దైవము
నా బాల దైవము కోదండ రాముడు

అమ్మ కుటీరంలో ఒక జపమాల వుండేది. ఒకనాడు లక్ష్మిగారు 'ఈ జపమాల ఎందుకమ్మా మీకు? అంటే "ఇది (తాను) ఎవ్వరైనా జపం చేసుకొంటుందే" అన్నారు. "మీకు జపం ఏమిటమ్మా!" అంటే అమ్మ మౌనం వహించారు. పూర్తిగా పండిపోయిన అమ్మ తన తరింపు కోసం చేయాల్సింది ఏమీ లేకపోయినా, ఇతరులకు మార్గదర్శకంగా వుండగలందులకు అట్లా చేసేవారేమో!

★★★★★

# అవధూత శ్రీ చివటం అమ్మ

## సర్వజ్ఞత్వం

భగవంతుడు సర్వజ్ఞుడు సర్వవ్యాపీ, సర్వశక్తి మంతుడూ అని చెప్తారు. భగవంతుని ఈ లక్షణాలు అమ్మలో అనుక్షణం ప్రకటమయ్యేవి. అమ్మ కావాలని ప్రయత్నంతో ఎప్పుడూ ఏ లీలలూ ప్రదర్శించలేదు. పుష్పాల నుంచి వచ్చే సుగంధ పరిమళాల్లాగా, సహజాతి సహజంగా, ఆ భగవల్లక్షణాలు అమ్మలో వాటంతట అవే ప్రకటమయ్యేవి. అంతే కానీ, అమ్మ ఎప్పుడూ తన సర్వజ్ఞతను ప్రదర్శించు కోవటం గానీ, ప్రశ్నలు చెప్పటం గానీ చేయలేదు. తన సర్వ శక్తిమత్వాన్ని అర్హులైన భక్తులను ఆదుకోవటానికీ, వాళ్ళ రోగాలనూ, కష్టాలనూ దూరం చెయ్యటానికీ, తద్వారా వారిలో భక్తి బీజాల్ని నాటటానికి మాత్రమే అమ్మ వినియోగించేవారు. అమ్మ చిల్లర మహిమలు ఏనాడూ ప్రదర్శించలేదు. అమ్మ వాక్కు బ్రహ్మ వాక్కు - అమ్మ నోటి వెంట మాట వచ్చిందంటే చనిపోయిన వారు కూడ లేచి రావలసిందే! ఇలాంటి సంఘటనలు కొన్ని మనం ముందు ముందు చదవబోతాం.

ఒకసారి రామాలయంలోని సీతమ్మ వారి విగ్రహం మెడలోని మంగళ సూత్రాలు ఎవరో దొంగిలించారు. అప్పుడు అమ్మ సేవకురాలైన లక్ష్మి "అమ్మా! సీతమ్మ వారి మంగళసూత్రాలు కదా పోయింది! మీరు సర్వజ్ఞులు గదా, ఎవరు దొంగిలించారో చెప్పకూడదా!" అన్నది. అప్పుడు అమ్మ "నీకు చెబితే అందరికి చెప్పవలసి వస్తుందే" అన్నారు. దీనిని బట్టి అమ్మకు అన్నీ తెలిసినా ప్రకటమవడం ఇష్టముండదని అర్థమవుతుంది. ఒక భక్తుని ఎద్దులను ఎవరో దొంగిలించారు. ఆ విషయం అమ్మతో చెప్తే, "దొంగవాడు దొరక కూడదు - ఎద్దులు దొరకాలి" అన్నారట. అట్లాగే జరిగింది.

ఒకరోజు అమ్మకొక జాబు వచ్చింది. ఆ సమయంలో అక్కడ గీతాపఠనం జరుగుతున్నది. వ్రాత సరిగా లేకపోవటంతో ఆ ఉత్తరం ఎక్కడ నుంచి వచ్చిందో అక్కడున్న భక్తులెవరికీ అర్థం కాక సతమతమవుతున్నారు. "ఎక్కణ్ణుంచి ఏటే!

మన మాధవానందుల దగ్గర్నుంచే" అన్నారట అమ్మ. అమ్మకు చదవటమే రాదు - కానీ, ఆ ఉత్తరం ఎక్కడ్నుంచి వచ్చిందో చెప్పేశారు. అమ్మ సర్వజ్ఞురాలు!

అమ్మ వద్ద కూర్చొని గీత చదువుతుండగా, ఒక భక్తునికి బాగా దాహం వేసింది. ఆపడం బాగుండదని అలానే చదువుతున్నారు. అంతలో అమ్మలేచి వెళ్ళి గ్లాసులో మంచినీళ్ళు తీసుకొచ్చి ఇచ్చారు.

అమ్మ సమాధికి కొద్ది రోజుల ముందు కట్టా సత్యం గారితో భగవద్గీత చదివిస్తున్నారు అమ్మ. ఆయన చదువుతుండగా అమ్మ పడుకున్నారు. కాసేపు చదివిన తర్వాత అమ్మ నిద్రపోతున్నారు కదా అని, అతడు చదవడం ఆపేశాడు. వెంటనే అమ్మ "చదువు - ఏం మానేశావు ఏం?" అన్నారు. మళ్ళీ చదవడం మొదలు పెట్టాడతను. అమ్మ మళ్ళీ పడుకున్నారు. ఈ సారి గురక పెడుతున్నారు. నిద్రపోతున్నారు కదా సరేలే తర్వాత చదువుదామని అతడు చదవడం మానేశాడు. అమ్మ వెంటనే లేచి 'నువ్వు చదువుతావా లేక ఎవరినైనా పిలిచి చదివించుకోనా?' అన్నారు. దాంతో అతడు ఇక ఆపకుండా 18 అధ్యాయాలూ పూర్తయ్యే వరకూ చదివాడు. అప్పుడమ్మ లేచి, ప్రసాదం పెట్టారు. అలా నిద్రలో కూడా మెలకువగా ఉండగలగడం కేవలం గొప్ప యోగులకు మాత్రమే సాధ్యమవుతుంది. అక్కల్ కోటస్వామి కూడా ఒకసారి గురకపెట్టి నిద్రపోతూ ఉంటే, గోవిందరావనే భక్తునికి, "స్వామి ఇలా గురకలు పెట్టి నిద్రపోతున్నారేమిటి? నిజమైన యోగికి నిద్ర అనే స్థితే వుండదని శాస్త్రాలు చెప్తున్నాయే" అని సందేహం మనసులో మెదిలింది. వెంటనే స్వామి కనులు విప్పి అతని కేసి చూచి "ఓయ్! నీ సందేహానికి ఇక్కడ తావు లేదు" అని వెనువెంటనే గురకలు తీయటం మొదలెట్టారు.

ఒకసారి అమ్మ సత్యంగారితో "పాలమూరి కాంతమ్మ గారింటికి వెళ్ళి, భగవద్గీత ఒక అధ్యాయం చదివి, ఈ ప్రసాదం ఇచ్చిరా - రాజు గారికి కడుపులో పోటంట!" అన్నారు. ఎక్కడ ఏ భక్తుడు బాధలో వున్నా అమ్మకు తెలుసు!

ఒక తల్లి తన అనుభవాన్నిలా చెప్పింది - నా పెద్దకుమార్తె తన అత్త వారింటిలో ప్రతికూల పరిస్థితికి విసిగి ఆత్మహత్య చేసుకోవటానికి ఎండ్రిన్ సేకరించి, రహస్యంగా దాచి వుంచి, ఆఖరిసారిగా చూసి పోదామని పుట్టింటికి

వచ్చింది. తిరిగి వెళ్ళేందుకు బట్టలు సర్దుకుంటూ కన్నీరు పెట్టుకుంది. ఆ సమయంలో నన్ను వెంటనే రమ్మని అమ్మ కబురు చేయగా వెళ్లాను. అమ్మ ఏమీ ఎరగనట్లు "పెద్దపిల్ల వుందా? పంపి వేశావా?" అన్నారు. ఇవ్వాళే వెళుతుంది అని చెప్పగా "పంపకే అమ్మా - పంపకు! పంపితే అమ్మాయి దక్కదు" అన్నారు.

ఒకసారి మా ఇంట్లో కుమార్తె పెళ్ళి విషయంలో కట్న కానుకల గురించి వరుని తరపు వారితో మాటలు జరుగుతున్నాయి. వారికీ మాకూ రూ॥ 500 దగ్గర తేడా వచ్చింది. నేను తటపటాయిస్తున్నాను. అంతలో ఒకామె వచ్చి "అయిదు వందల దగ్గర వెనకాడక సంబంధం చేసేయమనీ, అలా చేస్తే అమ్మాయికి లోటు వుండదనీ అమ్మ నీతో చెప్పిరమ్మన్నారు" అంది. మా ఇంటిలో జరుగుతున్న మాటలు ఎక్కడో కుటీరంలో వున్న అమ్మకు తెలియడం, సరైన సమయంలో తగిన సలహా పంపటం ఆశ్చర్యం కలిగిం చింది. మహాత్ములు తమ భక్తులను ఎప్పుడూ అప్రమత్తతతో కాపాడుతూ వుంటారు.

చివటం గ్రామస్థులు నెక్కంటి రంగమ్మగారు తాను రాజమంద్రి సభలకు వెళ్తున్నట్లు అమ్మగారితో చెప్పగా, అమ్మ భగవద్గీత ఇచ్చి చదవమన్నారు. ఆమె చదువుతుండగా కొన్ని శ్లోకాలకు వివరణ చెప్పి "ఇంత కంటే మంచివి చెబుతారేమిటే ఆ సభల్లోను - అది పెద్ద సభ అయితే, ఇది చిన్న సభ - నువ్వు అక్కడికెళ్ళద్దు" అన్నారు అమ్మ. ఆ మాటలు పట్టించు కోకుండా రంగమ్మగారు రాజమండ్రి వెళ్లారు. అక్కడ పందిళ్లూ, పాకలూ, అగ్ని ప్రమాదానికి గురై చాలా మందికి ప్రమాదకరమైన గాయాలు తగిలాయి. "నాకు ముంజేయి భాగం అంతా కాలి బొబ్బలు వచ్చాయి. అమ్మ ఎందుకు వెళ్లద్దు అన్నారో అప్పటికి గాని నాకు అర్థం కాలేదు. అమ్మ అనుగ్రహం వల్లనే బ్రతికి బయట పడ్డానని తోచి, వెంటనే అమ్మను దర్శించాను" అంటారు రంగమ్మ గారు.

ఎవరైనా క్రొత్తగా భక్తులు అమ్మ దర్శనానికి వస్తుంటే, వారు వచ్చే సమయానికి, ఆ వచ్చిన వారి ఇష్టదైవం పటాన్ని ఎదురుగ్గా పెట్టి ఉంచేవారు అమ్మ. అన్ని దైవాలు తమ రూపమేనని చెప్పకనే చెప్పారు అమ్మ.

★★★★★

# అవధూత శ్రీ చివటం అమ్మ

## రోగ నివారణ

అమ్మ వద్దకు వచ్చే భక్తుల్లో ఎక్కువ మంది తమ రోగాలు తగ్గించమనో, తమ కష్టాలు తీర్చమనో వస్తుంటారు. అమ్మ ఆశీర్వదించినంతనే ఎంతటి రోగాలైనా తగ్గిపోయేవి. ఒక్కసారి అమ్మను స్మరించినంత మాత్రాన్నే కూడా వ్యాధి నివారణమయ్యేది.

కైకలూరుకు చెందిన ఒక భక్తుడు రక్తపోటుతో బాధపడేవాడు. అతడు ధ్యానం చేసుకుంటే చాలు, రక్తపోటు ఇంకా అధికమయ్యేది. అమ్మ సన్నిధిలో ధ్యానం చేసుకుంటే మాత్రం రక్తపోటు ఉండేది కాదు. అందుకని అమ్మ సన్నిధిలో కూర్చుని అతను ఎక్కువ సమయం ధ్యానంలో గడిపేవాడు. అమ్మ సన్నిధే ఒక వైద్యాలయం!

ఒక భక్తురాలికి త్రుప్పుపట్టిన ఇనుపరేకు గుచ్చుకొన్నది. డాక్టర్లు ఎక్స్‌రే తీసి చూసినా, ఏమీ కనిపించలేదు. మందులు వాడుతున్నా బాధ తగ్గకపోయేసరికి, ఆమె అమ్మను ఆశ్రయించింది. అమ్మ ఆమెను ఆపరేషన్ చేయించుకోమని చెప్పారు. అమ్మ చెప్పినట్లు ఆమె ఆపరేషన్ చేయించు కుంటే ఆ ఇనుపముక్క కనిపించింది. డాక్టర్లు దానిని తొలగించారు. వైద్యులకు కూడా అంతుపట్టని ఆమె బాధను అమ్మ తమ సూచన ద్వారా నివారించారు. అమ్మ ఆమెను తన వద్ద ఒక వారం రోజులు వుంచుకుని, ఆమె బాధ పూర్తిగా తగ్గిపోయాక ఇంటికి పంపారు.

పసిపిల్లలకు జ్వరం వస్తే, అమ్మ దగ్గరకు తీసుకువచ్చేవారు. అమ్మ బొట్టుపెట్టి ఆశీర్వదించేవారు. వెంటనే జ్వరం తగ్గిపోయేది.

ఒకరోజొక భక్తురాలు అమ్మ సన్నిధిలో కూర్చొని గీత చదువుతుంటే ఆమె గొంతు పొడారిపోయింది. వెంటనే అమ్మ తన గొంతు సవరించు కున్నారు. తక్షణమే ఆమె గొంతులోని బాధ నివారణైంది.

ఒకరోజు నారాయణమ్మ గారి పిల్లవాడు మేడ మీద నుంచి క్రింద పడి, బాధతో ఏడుస్తున్నాడు. అతని తల్లిదండ్రులు ఒక గ్లాసులో నీళ్ళు తీసుకొని, అమ్మను తలచుకొని, వాటినే అమ్మ తీర్థంగా భావించి, ఆ పిల్లవాడి చేత త్రాగించారు. వెంటనే పిల్లవాడు ఏబాధా లేకుండా ఆడుకొన్నాడు.

అలాగే ఒకసారి ఒక పిల్లవానికి కాలుమీదుగా బస్సు పోయింది. పాదం రెండుగా చీలిపోయింది. కాని ఎముకలు ఏమాత్రం దెబ్బ తినలేదు. ఆస్పత్రికి తీసుకెళ్ళి వైద్యం చేయించారు. అతని బాధ తగ్గింది కానీ, కొంచెం కూడా నడవలేక పోయేవాడు. అమ్మ భక్తురాలైన అతని తల్లి అతడ్ని అమ్మ దగరకు తీసుకు వచ్చింది. అమ్మ ఆ పిల్లవాడి కాలును నవరిస్తూ, 'బాబూ! ఇంకా నువ్వు నడవడం లేదా!' అన్నారు. వెంటనే అతని కాలు నొప్పి తగ్గిపోయి మామూలుగా నడిచాడు.

మరో ఊరిలో వున్న మారెళ్ళ శ్రీరాములుగారికి ఒకసారి జ్వరం వచ్చింది. ఎన్ని రోజులకూ తగ్గలేదు. తెలిసిన వారి ద్వారా అమ్మకు ఆ సంగతి తెలియజేసారు. అక్కడ అమ్మకు కబురందడంతోనే ఇక్కడ ఆయన జ్వరం తగ్గిపోయింది.

ఒకసారి సీతామహాలక్ష్మి గారి పాపను పగబట్టి, ఒక పాము వారింటికి వచ్చింది. ఇంట్లో అంతా భయపడ్డారు. సీతామహాలక్ష్మి గారు ఆ పాపను అమ్మ వద్దకు తీసుకువెళ్ళి, విషయం విన్నవించారు. అమ్మ ఆ పాప శరీర మంతటికీ విభూతి పూసి, ఏమీ భయం లేదని చెప్పి ఇంటికి పంపారు. ఆ పాము ఏమైందో గానీ, మళ్ళీ కన్పించలేదు.

ఒకసారి కాంతమ్మ అనే భక్తురాలికి మండ్రగబ్బ కరిచి చాలా బాధ పడుతున్నది. ఆమె అమ్మ దగ్గరకు వెళ్ళి ఆ బాధ నివారించమని వేడుకొంది. అమ్మ ఆమెకు కొంత విభూతి ఇచ్చి, అది కొత్తలంక యోగి గారి విభూతియనీ, దానిని నీళ్ళల్లో వేసుకొని త్రాగమనీ చెప్పారు. ఆమె అలా చేయగానే, బాధ తగ్గిపోయింది.

ఒకసారొక భక్తుని పాపకు పొంగు చూపింది. అతడు రామనామం స్మరిస్తున్నాడు. ఆ రోజు రాత్రి అతనికి కలలో అమ్మ కనిపించి, అమ్మ వారి బండారు తెచ్చి పాప నొసట పెట్టమనీ, పాప పడుకున్న మంచం కోళ్ళకు కూడా పెట్టమనీ

చెప్పారు. తెల్లవారి అమ్మ చెప్పినట్లు చేయడమెలానా అని అనుకుంటూ వుండగా, తెలిసినామె ఒకరు పాపను చూడటానికి వచ్చాననీ, పాప కోసం అమ్మవారికి పూజ చేయించి బండారు తెచ్చాననీ చెప్పి బండారు ఇచ్చింది. ఆ భక్తులు ఆశ్చర్యపోయి అమ్మ కల్లో చెప్పినట్లే చేశారు. పాపకు పొంగు తగ్గిపోయింది. అమ్మ అనుగ్రహానికి వారెంతో పొంగిపోయారు.

ఒక చిన్న పాపకు ప్రక్కింటి వారి చనిపోయిన చిన్నపిల్ల గాలి రూపంలో పట్టుకొని బాధిస్తున్నది. తల్లిదండ్రులు ఆ పాపను అమ్మ దగ్గరకు తీసుకు వచ్చారు. పాపను చూస్తూనే అమ్మ "ఏమీ లేదు, పోయింది" అన్నారు. ఆ క్షణం నుంచి పాపకు ఆ బాధ నివారణైంది.

ఒకసారి రంగమ్మ గారి తండ్రికి జ్వరం వస్తే ఒక మందుకు బదులు వేరొక మందు వేసేసరికి ఆయన పరిస్థితి విషమించింది. అమ్మకు విన్నవించు కుంటే అమ్మ కొంచెం విభూతి నిచ్చి, దానిని నీటిలో కలిపి రోగికి త్రాగించమన్నారు. వెంటనే అతడు స్వస్థుడైనాడు.

అమ్మ తమ ఆశీస్సులతో రోగ నివారణ చేయటమే కాదు. ఒక్కోసారి దిక్కులేని వారికి తానే స్వయంగా పరిచర్యలు కూడా చేసేవారు. వారి రోగాన్ని తాను తీసుకొని అనుభవించేవారు. బలుసు మంగమ్మ గారిని చూచే వారెవరూ లేరు. ఏ దిక్కూలేని ఆమెను అమ్మే కనిపెట్టి వుండేవారు. ఒకసారి ఆమెకు జ్వరం వచ్చింది. అమ్మ ఆమెను తన దగ్గర వుంచుకొని స్వయంగా సేవలు చేశారు. ఆమెకు జబ్బు తగ్గలేదు కానీ, అమ్మకు మాత్రం జ్వరం వచ్చింది. అప్పుడు సేవకులు అమ్మతో, "అమ్మా! మీరే జ్వరంతో బాధపడుతున్నారు కదా, మరి మీరు ఆమెకేమి సేవ చేయగలరు? ఆమెను ఎక్కడికైనా పంపకూడదా?" అన్నారు. అమ్మ అందుకంగీకరించడంతో ఆమెను మరొకరి ఇంటికి పంపించారు. అక్కడకు వెళ్ళిన మూడు రోజులకు ఆమె మరణించింది. అమ్మకు గూడ జ్వరం తగ్గి పోయింది.

మంగమ్మగారు విరేచనానికి వెళ్ళిన గుడ్డలను అమ్మ బ్రహ్మంగారి భార్యను వుతకమన్నారు. ఆమె అసహ్యించుకొని వాంతి చేసుకుంటే అమ్మ "నీ

దానికి నీకు దోకు వస్తుందా?" అని మందలించారు.

విస్సయ్య పంతులు గారి కుటుంబ సభ్యులంతా అమ్మ భక్తులు. ఒకసారి వీరి తల్లిగారికి ఆపరేషన్ చేయించవలసి వచ్చింది. ఆపరేషన్ గుంటూరులో చేయించాలా, కాకినాడలో చేయించాలా అని అమ్మనడిగారు. అమ్మ ఆ రెండు చోట్లా వద్దు, తణుకులో శ్రీ జేజేశ్వర రావు గారి హాస్పిటల్‌లో చేయించమన్నారట. ఏ ప్రమాదం లేకుండా ఆపరేషన్ జరిగి, ఆమె త్వరగా కోలుకున్నారు.

ఒకసారి విస్సయ్య పంతులుగారి తమ్ముడు విజయనగరంలో వున్న తమ అక్కను చూచి రావాలని అమ్మగారి అనుమతి కోరాడు. అమ్మ అనుమతించలేదు. అయిదురోజుల తర్వాత మళ్ళీ వెళ్ళి, తనకు విజయ నగరం వెళ్ళడానికి అనుమతినివ్వమని కోరాడు. అమ్మ అనుమతించక, ఒక అరటి పండు తాను కొద్దిగా తిని, నాల్గవ వంతు పండు అతని కిచ్చి, మిగిలినది చెత్తలో పడవేశారు. అతడు ఇంటికి చేరుకోగానే, కడుపు నొప్పి వచ్చి, ఆపరేషన్ చేయించవలసి వచ్చింది. ఈ విషయం అమ్మకు విన్నవించగా అమ్మ 'నాకు తెలుసు బాబూ! తమ్ముడు నా మాట వినబట్టే బ్రతికాడు. విజయనగరం వెళ్తే బాబుకు దిక్కెవరు?' అన్నారు. ప్రతి రోజూ తీర్థము, తానారగించిన ప్రసాదం పంపేవారు. అతి త్వరలోనే అతనికి ఆరోగ్యం చేకూరింది.

బ్రహ్మం అనే ఒక భక్తునికి జాతకం ప్రకారం తనకు గండముందని తెలుసు. ఒకరోజు అతడు రామాలయానికి సున్నం వేస్తుంటే, నిచ్చెన జారి క్రింద పడిపోయాడు. అమ్మ దయ వల్ల అతడు బ్రతికి బయటపడ్డారు. అంతకు కొన్ని రోజుల ముందు అమ్మ అతని భార్యకు కలలో కనిపించి, నుదుట బొట్టు పెట్టారట! అలా ఆమె పసుపు కుంకుమల్ని కాపాడారు అమ్మ.

రేలంగి వాస్తవ్యులు శ్రీ దత్తుగారు ఇలా చెప్తున్నారు - నా కుమార్తె చిన్న వయస్సులో ఆడుకుంటూండగా కాలి మీద దెబ్బ తగిలింది. డాక్టర్లు సుమారు రెండు నెలలు వైద్యం చేసినా, నొప్పి పూర్తిగా తగ్గలేదు. హైదరా బాదులో ఒక ప్రముఖ వైద్యుని వద్ద చికిత్స చేయించగా, ఆయన ఆపరేషన్ చేసి, కాలి ఎముకలో ఏర్పడ్డ లోపాన్ని సరిచేశారు. అయినా నొప్పి తగ్గలేదు. ఒక రోజు నా కుమార్తె

నాతో పాటు అమ్మ దర్శనానికి వచ్చినపుడు అమ్మతో విషయమంతా చెప్పాను. నొప్పి వున్న భాగాన్ని అమ్మ తన చేతితో తడిమి చూసి, నొప్పి ఇక పోతుందిలే అన్నారు. అమ్మ నోటి మాటే నా కుమార్తెకు నిజమైన చికిత్స అయింది. ఆ రోజుతో నొప్పి పూర్తిగా మాయమై పోయింది.

చివటం గ్రామస్తులు శ్రీమతి చిన్నం సీతామహాలక్ష్మిగారి భర్తకు జబ్బు చేసి మంచం పట్టారు. అప్పుడు అమ్మ రోజూ వారింటికి వెళ్ళేవారు. వారి భర్త నమస్కారం చేసుకొనేవారు. ఒకరోజు అమ్మ రెండు రూపాయలిచ్చి వెళ్ళి పోయారు. ఆమె ఆ డబ్బులతో టీ పొడి, పంచదార, పాలు కొని భర్తకు టీ కాచి ఇచ్చింది. అప్పటి నుంచి ఆయనకు రోగం తగ్గు ముఖం పట్టి కొన్నాళ్ళకి పూర్తిగా ఆరోగ్యవంతులయ్యారు. ఈ సందర్భంలో శ్రీ శిరిడీ సాయిబాబా చరిత్రలోని ఒక సంఘటన గుర్తుకు వస్తుంది. శ్యామా మొల్లల వ్యాధితో బాధపడుతూంటే బాబా సోనాముఖి ఆకు తెప్పించి, కషాయం కాచి ఇస్తే, వ్యాధి తగ్గిపోయింది. బాబా సమాధి చెందిన తర్వాత అదే వైద్యం అదే వ్యాధికి శ్యామా మరలా చేసుకొంటే, వ్యాధి తగ్గడానికి బదులు ఎక్కువైంది. నిజానికి వ్యాధి తగ్గడానిక్కారణం మహాత్ముల సంకల్పమే గాని, మరేదీ కాదని గమనించాలి.

సూరమ్మగారు అమ్మ దగ్గర కూర్చుని వుండగా, వారి మేనల్లుడు ఆమె ఒడిలోకి వచ్చి కూర్చున్నాడు. ఆ పిల్లవాడు వీపు మీద పెద్ద వ్రణంతో బాధపడుతున్నాడు. అమ్మ ఆ బాలుడిపై ఒక చాక్లెట్ విసిరారు. చాక్లెట్ తిని, పిల్లవాడు ఆడుకోడానికి వెళ్ళిపోయాడు. మర్నాటి కల్లా అంతకురుపూ అణగిపోయి బాధ పూర్తిగా తగ్గిపోయింది.

తెతలి సీతమ్మ గారింట్లో పిల్లి పిల్లలను పెట్టింది. ఆ కూనలు ఒకటే కాళ్ళకు అడ్డాలు పడుతుంటే, సీతమ్మ గారి పాప ఒక పిల్లిపిల్లను చేత్తో పట్టుకుని ఎత్తి అలా విసిరేసింది. అంతే! ఆ పిల్లి గిలగిలా కొట్టుకొని తల వేలాడేసింది. సీతమ్మగారు దుఃఖంతో కుమిలిపోతూ "అమ్మా! అమ్మా!" అని అమ్మను స్మరిస్తున్నారు. పిల్లిని చంపడం మహాపాతకం అంటారు కదా! ఆ పిల్లి కూన మీద గంప కప్పి పెట్టి ఆరాటంతో అమ్మని స్మరిస్తూ ఏడుస్తున్నారు. కాసేపటికి గంపెత్తితే, చటుక్కున లేచి తుర్రున పారిపోయిందా పిల్లికూన!

చిన్నం సుబ్బారావు గారికి బాగా జబ్బు చేసింది. డాక్టర్లు చనిపోతాడని చెప్పారట. కానీ ప్రతిరోజు ఆయనకు, అమ్మగారు తన మంచం దగ్గరగా కూర్చుని "నీవు బ్రతుకుతావు" అని చెప్తున్నట్లుగా స్వప్నం వచ్చేది. అది పూర్తిగా కలా, మెలకువా కాని స్థితి. కళ్ళు తెరిచి చూసి, "అమ్మగారు ఇక్కడున్నారు - ఏరీ?" అని అడిగేవారట. ఈ సంఘటన అమ్మ భౌతిక దేహంతో వున్న రోజుల్లోనే జరిగింది. అమ్మ ఆశీస్సుల వలన అతడు మృత్యు ముఖం నుంచి బయట పడ్డాడు.

మహాత్ముల ఆజ్ఞను యమ ధర్మరాజు కూడా పాటించి తీరవలసిందే! చనిపోయిన వారిని బ్రతికించిన లీలలు మహాత్ములందరి చరిత్రల్లోనూ కన్పిస్తాయి. అయితే కొందరు ప్రత్యక్షంగా అలాంటి లీలలు ప్రదర్శిస్తే, కొందరు పరోక్షంగా - తాము గుప్తంగా వుండి ప్రదర్శిస్తారు. ఈ రెండో కోవకు చెందిన వారు అమ్మ!

శ్రీ శిరిడీ సాయిబాబా చనిపోయిన మాలంబాయి అనే భక్తురాలిని బ్రతికించారు. సిద్ధారూఢ స్వామి శివపంచాక్షరీ మంత్రం ఉచ్ఛరించగానే, చనిపోయిన సర్పం సజీవమై చరచరా ప్రాకుతూ వెళ్ళిపోయింది. గజానన్ మహరాజ్ తమ దృష్టి మాత్రం చేత చనిపోయి, కుళ్ళిపోయిన ఒక కుక్కను జీవింపచేశారు. ధునీవాలా దాదాకైతే పునరుజ్జీవింప చేయడమనేది ఒక చిన్న పిల్లల ఆటలాగ వుండేది. చనిపోయిన పిట్టల్నీ, కుక్కల్నీ పిల్లలు వినోదంగా ఆయన మీదకు విసిరేసేవారు. అంతే, అవి నిద్ర లేచినట్లు లేచి ఎగిరిపోయేవి, పరిగెత్తిపోయేవి.

చివటం గ్రామంలో నత్తాలు అనే ఆమె తన అనుభవాన్నిలా తెలియజేశారు.

ఒకసారి నా భర్తకు జబ్బు చేసి ప్రమాద పరిస్థితి ఏర్పడింది. బ్రతకడం కష్టమన్నారు డాక్టర్లు. అమ్మ వచ్చి అతడిని చూచి, "ఇతడు బ్రతుకుతాడు - మీరు జాగ్రత్తగా సేవచేయాలి" అన్నారు. అమ్మను అడిగి విభూతి తెచ్చి రోగికి పెట్టాము. కానీ, ఆరాత్రే అతడు మరణించాడు. ఆ విషయం బంధువు లందరికీ కబురు చేశాము. అతని అంత్యక్రియలకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. పాడె మీద పడుకోబెట్టడానికి శవాన్ని లేవనెత్తబోయేంతలో, అతని శరీరంలో కదలిక ఏర్పడింది. అది చూచిన వారి ఆశ్చర్యానికి అంతు లేదు. అమ్మ మాటలు గుర్తు

తెచ్చుకొని, వెంటనే అతడిని మంచం మీద పడుకోబెట్టి హాస్పిటల్‌కు తరలించాము. రెండు మాసాల్లో పూర్తిగా స్వస్థత చెంది, తిరిగి వచ్చారు. ఈ రోజుకీ ఆరోగ్యంగా తిరుగుతున్నాడు" అంతే కాదు. అతడు శరీరాన్ని వీడివెళ్ళి, మళ్ళీ వచ్చే లోపల ఇతర లోకాల్లో తనకు కల్గిన అనుభవాలను కూడా గ్రామస్థులకు చెప్పాడు. అమ్మ వాక్కు అమృత వాక్కు.

తేతలి వాస్తవ్యులు శ్రీ కట్టా సత్యంగారి పాపకు ఆరేళ్ళ వయస్సులో బాగా జబ్బు చేసింది. నెల రోజులు తణుకులో హాస్పిటల్‌లో చికిత్స చేయించినా, ఏమీ లాభం లేకపోయింది. చివరకు ఒక రోజు డాక్టర్లు పెదవి విరిచి, "ఈ పాప రేపు ఉదయం 8 గంటల కల్లా చనిపోతుంది. ఇంటికి తీసుకెళ్ళ"మన్నారు. పాపను ఇంటికి తీసుకు వచ్చారు. డాక్టర్లు చెప్పినట్లే తెల్లవారి 8 గం॥ల కల్లా ప్రాణం పోయింది. తల్లిదండ్రులు గుండెలవిసేలా ఏడుస్తున్నారు. చుట్టూ వున్నవారు తరువాత జరగవలసిన కార్యక్రమానికి సన్నాహాలు చేస్తున్నారు. ఏడ్చి ఏడ్చి బిడ్డ శవాన్ని చూడలేక బయటకు వచ్చి నిల్చున్నారు సత్యంగారు. అంతలో చివటం నుంచి ఒకమ్మాయి వచ్చి "అమ్మగారు పాప బ్రతుకుతుంది అని చెప్పారు." అని చెప్పింది. 'ఇంకేం బ్రతకడం - అంతా అయిపోయింది' అన్నారు సత్యంగారు. ఆ వచ్చినమ్మాయి లోపలకి వెళ్ళి చూసేసరికి పాప కదులుతున్నది. పిల్లలందరూ 'మీ పాప కదులుతుంది - కదులుతుంది' అంటూ పరిగెత్తుకుంటూ వచ్చి సత్యంగారితో చెప్పారు. సరిగ్గా అమ్మగారి కబురు అక్కడ అందిన క్షణాన్నే పోయిన ప్రాణం తిరిగి వచ్చింది. మహాత్ముల ఆజ్ఞను మృత్యుదేవత కూడా శిరసావహించ వలసిందే! తర్వాత సత్యంగారు అమ్మ వద్దకు వెళ్ళి, "అమ్మాయి చనిపోయింది మీరు కబురు చేసిన మాట వినగానే బ్రతికింది" అని చెప్తుంటే అమ్మ నోటికి చెయ్యి అడ్డం పెట్టుకొని చిన్నగా నవ్వుకున్నారు. అంతే! మహాత్ములు దేనికీ కర్తృత్వం వహించరు.

ఆ పాప తన తోటి స్నేహితులతో, చనిపోయిన తర్వాత నుంచి మళ్ళీ బ్రతికే లోపల తనకు కల్గిన అనుభవాన్నిలా చెప్పేదట - "అప్పుడు నేను ఒక క్రొత్త ప్రదేశానికి వెళ్ళాను. అక్కడ ఎంతో గొప్ప ప్రకాశంగా వుంది. అక్కడ నేను పూలు కోసుకుంటుంటే ఎవరో చెప్పారు - అక్కడ మీ అమ్మా నాన్నా ఎంతగానో

ఏడుస్తున్నారు నీ కోసం, వెళ్ళు! వెళ్ళు! అని" ఆ పాపకిప్పుడు పెండ్లి అయింది. అమ్మ ఈ నాటికీ ఆమెను అనుగ్రహిస్తూనే ఉన్నారు. ఇటీవల ఆమె ఒక రోజు తెతలిలో రామాలయం శుభ్రం చేయడానికని వెళ్ళి, తలవంచి తుడుస్తూ వుంటే తన వెనగ్గా ద్వార బంధం దగ్గర అమ్మ పాదాలు కనిపిం చాయి. చివుక్కున తలెత్తి చూస్తే, అమ్మ! ద్వార బంధానికి ఒక చెయ్యి వేసి, చక్కగా నిల్చుని వున్నారట. సమాధి చెంది ఇన్ని సంవత్సరాలు అయినప్పటికీ, ఇప్పటికీ తన భక్తులకు భౌతికంగా కూడా దర్శనం ఇస్తూనే వున్నారు అమ్మ!

రంగమ్మ గారి భర్త కోపిష్ఠి. తరచూ రంగమ్మను తిడుతూ కొడుతూ వుండేవాడు. ఒకసారి అతడు రంగమ్మను తీవ్రంగా కొట్టాడు. అప్పుడు అమ్మ అతనిని పిలిపించి ప్రసాదం పెట్టారు. వెంటనే అతని కోపం పూర్తిగా తగ్గి పోయింది. ఆయన ఇంటికి వెళ్ళి 'అమ్మ ప్రసాదం పెట్టగానే తన కోపమంతా తగ్గిపోయిందనీ, తన మనస్సు ఎంతో ప్రశాంతమైందనీ, చెప్పారు. అమ్మ ఆశీర్వచనమే మనశ్శాంతి నివ్వగలదు.

ఒకసారి ఒక దంపతులు అమ్మ వద్దకు వచ్చారు. వారిద్దరూ తగవుపడి విడిపోవాలనుకున్నారు. అమ్మ వారిని చూచి, "కాగే కాగే పాలు, పొండిరా!" అని వారికి ఒక పండు ఇచ్చారు. ఆ ప్రసాదం తినేసరికి వారిద్దరికీ విడి పోవాలనే తలంపు నశించిపోయింది. ఏ న్యాయస్థానాలూ మహాత్ముల ఆశీర్వా దానికి సాటి కాజాలవు.

ఒకసారి కస్తూరి గారి అమ్మాయి స్నానానికని తుంగభద్రానదికి వెళితే, అక్కడ ఆ అమ్మాయి నగలు పోయాయి. ఆ విషయం అమ్మకు విన్నవించగా అమ్మ "సీతమ్మ వారికి పమిట పిన్ను చేయించండే, నగలు దొరుకుతాయి" అన్నారు. వారలా చేయగానే పోయిన నగలు దొరికాయి.

కొంత మందికి కష్టాలు భక్తులు అమ్మను ధ్యానించగానే తొలగి పోయేవి. అలాగే సత్సంగంలో ఏమైనా ధర్మ సందేహాలు వస్తే, ఆ సత్సంగం పూర్తయ్యేలోపల వారి సందేహాలు తీరేవి.

అమ్మ కొందరు భక్తులకు భౌతికంగా గూడ దర్శనమిచ్చేవారు. ఒకరోజు

ఒక భక్తునికి అమ్మ అతని ఇంటిలోని స్తంభానికి అనుకొని నిలుచుని కన్పించారు. అమ్మ అతనితో, 'నీకు ప్రసాదం పంపించానే, ఇంకా అందలేదా?' అని అడిగారు. అతను లేదని చెప్పగానే అమ్మ అదృశ్యమయ్యారు. మరి కొంత సేపటికల్లా ఒక అమ్మాయి వచ్చి అమ్మ పంపిన ప్రసాదం తెచ్చిచ్చింది. అతనికి అమ్మ కనిపించిన సమయంలో అమ్మ చివటంలోనే వున్నారు.

ఒకసారి మంగమ్మగారు తెలిసిన వారికి ఏదో వస్తువు ఇస్తానని మాట ఇచ్చారు. కానీ, సమయానికది ఆమెకు అందలేదు. ఆ సంగతి ఆమె అమ్మతో చెప్పారు. అప్పుడు అమ్మ ఆమెకు సీతమ్మ వారి మెడలోని మంగళసూత్రాలు తీసి మంగమ్మగారికిచ్చి, పని కానివ్వమన్నారు. పైకం సమకూడిన తర్వాత మంగమ్మగారు అమ్మవారికి మంగళసూత్రాలు చేయించి ఇచ్చారు. అమ్మ అప్పుడు కొందరికి ఆ విధంగా ఆర్థిక పరంగా కూడా సర్దుబాటు చేస్తుండేవారు.

అమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు ఆమె అనుజ్ఞ లేకుండా తిరిగి వెళ్తే, అనేక ఇబ్బందులకు గురయ్యేవారు. అమ్మ అనుజ్ఞ ఇచ్చాక వెళ్తే, అన్నీ సవ్యంగా జరిగేవి.

ఒకసారి చిలకపాడు ముత్తయ్యగారు అమ్మకు బూరెలెవరు పెడతారు అనుకొని బూరెలు చేయించి తీసుకొని అమ్మ వద్దకు వచ్చారు. ఆయన వచ్చేసరికి అమ్మ రామాలయంలో కూర్చుని వున్నారు, అక్కడ ఎన్నో రకాల పిండివంటలు వుండటం చూచి, ఆయన తమ ఆలోచనకు సిగ్గు పడ్డారు.

చివటం గ్రామంలోని స్కూలులో కొందరు పిల్లలు అమ్మ ఫొటోకు పూలదండలేసి, భక్తితో కొలిచేవారు. ఒకసారి బడిపంతులు గారు అమ్మ దర్శనార్థం 14 మంది పిల్లలు వస్తారని చెప్పారు. అప్పుడమ్మ పదిమంది మాత్రమే వస్తారని చెప్పారు. అమ్మ చెప్పినట్లే పదిమందే వచ్చి అమ్మ ఆశీర్వాదం, ప్రసాదం తీసుకొని వెళ్ళారు.

వర్షాలు పడనప్పుడు అమ్మతో విన్నవించుకుంటే వర్షాలు కురిసేవి. అలాగే అకాలంలో వర్షం పడుతుందేమోనని భయపడుతున్నప్పుడు "అమ్మ! ఇప్పుడు వర్షం కురవకూడదమ్మా - పంటలు పాడైపోతాయి" అని అమ్మకు

చెప్పేవారు. అమ్మ వర్షం కురవదనేవారు, అలానే జరిగేది.

అమ్మ దగ్గర ఒక చత్వారపు కళ్ళజోడు వుండేది. అది దృష్టి లోపం వున్న ఎవ్వరికైనా సరిపోయేది. దృష్టిలోపం ఎక్కువ వున్నా, తక్కువ వున్నా వారు ఆ కళ్ళజోడు పెట్టుకొని, అమ్మ ఇచ్చిన పుస్తకం చదివి, తర్వాత ఆ కళ్ళజోడు, పుస్తకము అక్కడే పెట్టి వెళ్ళేవారు.

తూర్పు విప్పర్రు గ్రామస్థులు శ్రీ అంబటి చిన వెంకన్నగారు తమ అనుభవాలను ఇలా తెలియజేశారు -

నేను 1980 సం॥లో అమ్మను మొదటిసారిగా దర్శించాను. ఆమె సన్నిధిలో నాకు ఏదో తెలియని ఆనందం, ప్రశాంతత కలిగేది. ఎప్పుడు దర్శించినా, తల్లి కంటే ఎక్కువ ఆదరణ చూపేది. మట్టి భిక్షాపాత్రలో అన్నం కలిపి ముద్దలు చేసి పెట్టేది. 'రాముడినీ, వాసుదేవుడినీ తలుచుకో బాబూ' అన్నారు అమ్మ. నా కుమార్తె వివాహ యత్నాలు సాగుతున్నప్పుడు అనుకొన్న నాలుగు సంబంధాల లోనూ ఏది చేయమంటారో అమ్మని అడగాలని ఒకరోజు చివటం చేరాను. అమ్మ ఒక పుస్తకం ఇచ్చి చదవమన్నారు. అమ్మ వింటూ కూర్చున్నారు. ఆ రోజు అమ్మ సన్నిధిలో నాకు అంతులేని ఆనందం అనుభవమైంది. కాలగమనాన్ని కూడా గమనించలేదు. అమ్మ "వెలుగు వుండగా ఇంటికి చేరుబాబూ" అన్నారు. నేను సైకిలు మీద బయలుదేరి సగం దూరం వచ్చాక నేను నా కుమార్తె సంబంధం గురించి అడగటం మరచిన సంగతీ, అమ్మ ఆరోజు నాకు ప్రసాదం ఇవ్వకుండానే నన్ను పంపించిన సంగతీ గుర్తు వచ్చాయి. మర్నాడు వెళ్దామనుకొని ఇంటికి చేరాను.

ఆ రాత్రి సుమారు 8-30 సమయంలో కొంచెం వయస్సు మళ్ళిన ఒక స్త్రీ మా ఇంటికి వచ్చి, ఒక చిన్న చేతి సంచీ ఇచ్చింది. అందులో బొప్పాయి పండు ముక్కలూ, అరటి, జామ మొ॥ పండ్లు వున్నాయి. ఆమె ఇలా చెప్పింది. "చివటం అమ్మ ఈ రోజు నీకు ప్రసాదం ఇవ్వటం మరచిందట - అందుచేత ఈ ప్రసాదం నీకు అందజేయమని అమ్మ పంపించారు. ఈశాన్యం మూలగా వున్న గ్రామంలో మీ అమ్మాయికి సంబంధం కుదురుతుందట. ఈ మాట కూడా చెప్ప

మన్నారు" - ఈ మాటలు చెప్పి, ఆమె వెళ్లబోగా, అప్పటికి ప్రొద్దుపోవటం వల్ల ఆ రాత్రికి మా ఇంట వుండి, ఉదయాన్నే వెళ్ళమని కోరాము. తెల్లవారు జామున, నేను నిద్రలో వుండగా తాను బస్సుకు బయలుదేరుతున్నట్లు చెప్పి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళాక నా భార్య తలుపు వేసుకొంటుండగా, మెలకువ వచ్చి, ఆమెను బస్సు ఎక్కించి వద్దామని వెళ్ళాను. ఆమె ఎక్కడా కన్పించలేదు. టైము చూడగా మూడు గంటలు అయింది. ఆ టైములో మా ఊరికి బస్సు వచ్చే అవకాశమే లేదు. చివటం అమ్మ ఎలా సంబోధిస్తుందో, ఈ వచ్చినామె కూడా అలాగే సంబోధించింది. అమ్మే స్వయంగా ఈ రూపంలో వచ్చి వెళ్లారని స్ఫురించింది. ఈ లీల వలన అమ్మ ఎడల నా ఆరాధనాభావం మరింత బలపడింది.

ఒకసారి ఢిల్లీలోని ఒక కుటుంబానికి అమ్మ స్వప్న దర్శనం ఇచ్చారట. వాళ్ళకు అమ్మ ఎవరో, అసలు చివటం అనే గ్రామం ఎక్కడ వున్నదో కూడా తెలియదు. అప్పుడు వారింటికి ఎవరో తెలిసినవారు వచ్చి, చివటం గ్రామానికి ఎలా వెళ్లాలో ఏమిటో చెప్పారు. వారు కుటుంబ సమేతంగా వచ్చి చివటం అమ్మ దర్శనం చేసుకొన్నారు. అమ్మను చూసి, "నాకు స్వప్నంలో దర్శనం ఇచ్చింది ఈ అమ్మే" అని అక్కడి వారితో చెప్పారు.

అమ్మ ఒకసారి సూరమ్మ గారినీ, రంగమ్మ గారినీ ఒకరింటి పెరట్లో గల బావి దగ్గరకు తీసుకు వెళ్లారు. ఆ ఇల్లు చాలా రోజులుగా తాళం పెట్టి వుంది. ఆ బావిలో చచ్చి పురుగులు పట్టిన కుక్క కళేబరం పడివుంది. అమ్మ ఒక తట్టకు తాళ్ళు కట్టి, బావిలోకి దించి, అది తట్టలోకి వచ్చేటట్టు చేసి, పైకి లాగమన్నారు. పైకి లాగి, అవతల పారేసేదాకా దుర్గంధానికి బదులు మంచి వెలగపండు వాసన వచ్చింది వాళ్ళకి. అమ్మ కృప ఉన్నవారికి సంసారంలో అసహ్యంగా, భరించలేనివిగా తోచే సంఘటనలూ, సన్నివేశాలూ కూడా ప్రియమైనవిగా మారిపోతాయి కాబోలు!

అమ్మ భక్తుల హృదయాల్లో అదృశ్యంగా మార్పును తీసుకు వచ్చేవారు, ఒక భక్తురాలు అమ్మను మొదటిసారిగా చూసినప్పుడు, అమ్మ ఇలా ఎంగిలి భిక్షాపాత్రలో కలిపిన అన్నం పెడుతుందేమిటి? అనుకున్నారట. అప్పటి నుంచి అమ్మ ఆమెకి ఇంకెప్పుడూ అన్నం పెట్టలేదు. అమ్మ భరద్వాజ మాస్టర్ గారికీ,

మిగిలిన వారికీ అన్నం కలిపి ప్రసాదం పెడుతుంటే ఈ భక్తురాలు తనకు కూడా ప్రసాదం పెట్టమని అడిగితే, అప్పుడు పెట్టారు.

శ్రీ బదరీనాథ్ భీమవరం ఇంజనీరింగ్ కాలేజిలో చదువుతున్నప్పుడు, ఒకరోజు క్లాసులో కూర్చుని వుండగా చివటం అమ్మ ఆ క్లాస్ రూం ముందు నుంచి నడిచి పోతున్నట్లు భౌతికంగా దర్శనం ఇచ్చారు. అతడు వెంటనే బయలు దేరి తమ ఇంటికి (తేతలి) వెళ్ళి అక్కడ నుంచి అమ్మ దర్శనానికి చివటం వెళ్లాడు. అప్పుడు అమ్మ "సరాసరి వచ్చావా బాబా?" అనడిగారు. "లేదమ్మా! ఇంటికి వెళ్ళి వచ్చాను" అని అతడు సమాధానం చెప్పాడు. సరిగ్గా ఇదే విధంగా రెండోసారి కూడా జరిగింది. రెండవసారి కూడా సరాసరి అమ్మ వద్దకు వెళ్ళనందుకు బాధపడ్డారు బదరీనాథ్! చివరకు అమ్మ సమాధి చెందిన తర్వాత మాత్రమే తాను అమ్మ ఆజ్ఞానుసారం సరాసరి భీమవరం నుంచి చివటం వెళ్ళి అమ్మ సమాధి దర్శనం చేసుకోగలిగాను అని చెప్తారు శ్రీ బదరీనాథ్! అమ్మ ఆజ్ఞను తు.చ. తప్పకుండా పాటించడమే మన కర్తవ్యం!

ఒకసారి చివటం అమ్మగారు బదరీనాథ్ తల్లిగారైన సీతమ్మ గారికి కూడా పట్టపగలు భౌతికంగా దర్శనం ఇచ్చారు. అమ్మ భిక్షాపాత్ర పట్టుకొని ఆకాశంలోకి చూస్తూ, ఒక కాలు వెనుకకు మడుచుకొని స్తంభానికి ఆనుకొని తేతలిలో కన్పించారు. నిజానికి అప్పుడు అమ్మ చివటంలోనే వున్నారు.

అమ్మ ఖండయోగం చేసేవారని కొందరు చెప్తారు. ఒకసారి స్మశానంలో అమ్మ కాళ్ళు, చేతులు, మొండెం విడివిడిగా పడి వుండటాన్ని ఒకామె చూసి, అమ్మను ఎవరో చంపేశారనుకొని, భయంతో ఇంటికి వచ్చేసిందట. మర్నాడు ప్రొద్దుట చూస్తే అమ్మ యథాప్రకారం మామూలుగా తిరుగుతూ కన్పించారట. అమ్మ ఆమెను చూసి, "రాత్రి దడుచుకొన్నావా?" అని అడిగారట!

అమ్మగారి దర్శనానికి ఒకసారి తమిళనాడు నుంచి కొందరు సాధువులు వచ్చారట. వారు తాము అమ్మ దగ్గర ఖండయోగం నేర్చుకోవడానికి వచ్చామని చెప్పారట! వారికి అమ్మ ఖండయోగం చేస్తారని ఎలా తెలిసిందో, మరి అమ్మగారు వారికి నేర్పారో, లేదో ఆ వివరాలేమీ తెలియరావడం లేదు. ఆకలిదప్పులు మరచి

రోజులకు రోజులు సమాధి స్థితిలో వుండి పోగల్గిన అమ్మ, ఏకకాలంలో వేరువేరు చోట్ల భౌతిక శరీరంతో తిరుగగల అమ్మ ఖండయోగం చేసేవారంటే ఆశ్చర్యపో నక్కరలేదు, కాకపోతే, అమ్మ తమ శక్తిని ఎప్పుడూ ప్రకటించక, గుప్తంగా వుంచుకొనే వారు కాబట్టి, మనకు వివరాలు తెలియరాకపోవచ్చు.

ఒకసారి డి.జి.కె. మూర్తిగారు, వారి మనుమరాలు కృష్ణచైతన్యతో కలిసి సైకిల్ మీద తణుకు నుంచి చివటం వెళ్ళారు. తిరిగి వచ్చేటప్పుడు చీకటి పడింది. కాలువ గట్టున సైకిల్ మీద వస్తుండగా, సైకిల్ స్లిప్ అయి కాలవలో పడిపోయారు. ఆ సంఘటన గూర్చి కృష్ణచైతన్య ఇలా చెప్తుంది - "ముందు నేను లోపల పడ్డాను. నా మీద మా తాతయ్య పడ్డారు. మా ఇద్దరి మీద సైకిల్ పడిపోయింది. అక్కడ కాలువ చాలా లోతుగా వుంది. నేను భయంతో 'బాబా' అని అరవగానే చివటం అమ్మ, శిరిడీ సాయిబాబా ఇద్దరూ వచ్చి, పైకి లేపారు - మమ్మల్ని ఇద్దరినీ లాగి బయట పడవేశారు. అమ్మ బాబా నాకు స్పష్టంగా కనిపించారు"

★★★

## అమ్మను మించిన అమ్మ - చివటం అమ్మ

సాధారణంగా అవధూత స్థితిలో వున్నవారు నిష్క్రియులై వుంటారు. వారికి కర్మాచరణ అనేది వుండదు. ఏమీ చేయకనే వారి నుండి బ్రహ్మాండమైన కార్యకలాపం జరిగిపోతూ వుంటుంది. కానీ, శ్రీ చివటం అమ్మ మాత్రం ఒక్క విషయంలో తద్భిన్నంగా కన్పిస్తారు. వారు అవధూత అయినప్పటికీ, వారిలోని అవధులు లేని మాతృప్రేమ మాత్రం అలానే వుండిపోయింది. అమ్మ తల్లివలె తన వద్దకు వచ్చిన భక్తులందరికీ కడుపు నిండా తినబెడు తూండేవారు. భిక్షాన్నం ఒక్కటే కాదు - కాఫీలు, టీలు, ఫలహారాలు, పండ్లు, చాక్లెట్లు, సోడాలు - ఒకటేమిటి? ఎవరికి ఏది ఇష్టమో అలాంటివన్నీ నుష్టుగా తినిపించేవారు.

అమ్మ ఒక మట్టి పాత్రనే భిక్షాపాత్రగా వాడేవారు. అందులో అన్నం, పప్పు, కూర అన్నీ కలిపి పెద్ద పెద్ద ముద్దలు చేసి చేతిలో పెట్టేవారు. అమ్మ గుప్పెడు అన్నం పెడితే, అది మన దోసిలి నిండా వచ్చేది. ఒక్కోసారి వేరే ప్లేటులో పెట్టి ఇచ్చేవారు. ఒక్కొక్కరికి కలిపి, నోటిలో పెట్టి, పసిపిల్లలకు తినిపించినట్లు తినిపించేవారు. కొందరికి తాను తింటూ వారికి తినిపించేవారు. ఏదైనా సరే కడుపు నిండా పెట్టడం - వారిక తినలేము వద్దంటూన్నా, 'కొంచెం తిను బాబూ' అని కొసరి కొసరి తినిపించడం - చేసేవారు అమ్మ. తమ దగ్గరకు వచ్చినవారు పూర్తిగా తృప్తులై వెళ్లాల్సిందే! భగవత్స్వరూపిణి అయిన అమ్మ తమ స్వహస్తాలతో తినిపించారంటే - ఆ ప్రేమను, ఆప్యాయతను పొందిన ఆ భక్తులెంత అదృష్ట వంతులో! అసలు వారి అదృష్టం ఇంతటిదీ అని చెప్పనలవి అవుతుందా?

ఒకసారి ఒంగోలు వాస్తవ్యులు శ్రీ సుబ్బయ్యగారు, వారి శ్రీమతి సీతగార్లు అమ్మ దర్శనార్థం వెళ్లారు. అప్పుడే భరద్వాజ మాస్టర్‌గారు కూడా వచ్చి వున్నారు. అప్పటికే వారందరికీ అన్నం కలిపి పెడుతున్నారు. చివరికి పెరుగన్నం కలిపి పెట్టారట. అప్పటికే కడుపు నిండిపోయింది. దానికి తోడు పెరుగు పుల్లగా



అవధూత శ్రీ చివటం అమ్మ

వుండేసరికి సీతగారు తినలేకపోతూన్నారు. అమ్మ ప్రసాదం కాబట్టి వదిలి పెట్ట కూడదు. "అంత ఆవకాయ ముక్కైనా వుంటే తిందును కదా!" అనుకొన్నారట. మనసులో ఆ ఆలోచన అలా వచ్చిందో లేదో అమ్మ చివుక్కున లేచి, తమ చిన్న గదిలో అటక మీద ముంత లోంచి చేత్తో ఆవకాయ ముక్క తీసి, సీత గారికి వేసారట!

సీతగారి ద్వారా అమ్మ మాతృప్రేమ గురించి విన్న నాకు, "అయ్యో! అమ్మను సశరీరులుగా చూడలేకపోయానే! అమ్మ స్వహస్తాలతో ముద్దలు తినే మహద్భాగ్యం కోల్పోయానే! అని ఎంతో బాధ పడ్డాను. అనుకోకుండా 1982 దీపావళి రోజున చివటం దర్శించే భాగ్యం కల్గింది. నరక చతుర్థి రోజు సాయంకాలానికి తణుకు చేరుకొన్నాను. హైమ వాళ్లింటికి వెళ్లాను. నేను వెళ్ళిన కాస్సేపటికి నేను ఏమీ అడగకుండానే, ఆశ్చర్యకరంగా హైమ వాళ్ళ తమ్ముడు, "అమ్మ చివరిసారిగా తమ చేత్తో నాకిచ్చిన ప్రసాదమండీ" అంటూ పటిక బెల్లం తెచ్చి నా చేతిలో పెట్టాడు. నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి! మర్నాడు చివటం దర్శించి, అమ్మ కుటీరంలోని ముందు గదిలో కూర్చుని పారాయణ చేసు కొంటూన్నాను. సరిగ్గా 12 గంటల సమయానికి బ్రహ్మంగారనే భక్తుడు కారియర్‌తో భోజనం తీసుకు వచ్చి, అమ్మ భిక్షాపాత్రలో పెట్టి, అమ్మకు నివేదించారు. ఆ రోజు తెల్లవారు ఝామున అమ్మ ఆ భక్తునికి కలలో కనిపించి, "నా భక్తులొకరు వస్తున్నారు - భోజనం తీసుకు రమ్మని" చెప్పారట! అలా అదృశ్యంగా వుండి అమ్మ అందించిన ఆ ప్రసాదాన్ని పొందినప్పటి నా ఆనందానికి అవధులు లేవు. ధారాపాతంగా కారుతున్న కన్నీళ్ళతో అమ్మ ప్రేమకు, ఆదరణకు కృతజ్ఞతలు తెల్పుకొన్నాను. తిరిగి వచ్చిన తర్వాత మాస్టర్‌గారితో నా అనుభవం చెప్పి, "ఏ అర్హతా లేని నా మీద అమ్మకెందుకు ఇంత ప్రేమ?" అనడిగితే, మాస్టర్‌గారన్నారు - 'అమ్మ ప్రేమకు అర్హతలతో పని లేదు - చంద్రుని వెన్నెలలా అమ్మ ప్రేమ అందరి మీద సమానంగా ప్రసరిస్తూనే వుంటుంది. అదే మహాత్ములలోని ప్రత్యేకత!' అన్నారు.

★★★

## అన్నపూర్ణేశ్వరి

రేలంగి గ్రామస్థులు శ్రీ దత్తుగారు తమ అనుభవాలను ఇలా తెలియజేస్తున్నారు.

1966లో నేను చివటం గ్రామంలో టీచరుగా పని చేశాను. మా పాఠశాల ప్రక్కనే ఒక కుటీరంలో అమ్మ వుండేవారు. నేను చాలా తరచుగా అమ్మ వద్ద గడిపేవాడిని. అమ్మ సన్నిధిలో ఏదో తెలియని ఆనందం అనుభవమయ్యేది. ఒక్కొక్క రోజు స్కూలు విడిచే గంట కొట్టేసరికి అమ్మ వచ్చి, నన్ను చేయి పట్టుకొని తీసుకు వెళ్ళేది. ఆమె భిక్షాపాత్రలో అన్నీ కలిపి, ముద్దలు చేసి తినిపించేది. ప్రతి రోజూ వెన్నతో కూడిన మజ్జిగ గానీ, పెరుగు గానీ, నాకు భోజనంలో వేయమని పంపేవారు.

ఒకరోజు నా భోజన సమయానికి నా భార్య వీధి తలుపులు గడియ వేసి, అరటి ఆకులో నాకు భోజనం వడ్డించింది. సరిగ్గా ఆ సమయంలో అమ్మ ఎలా వచ్చిందో తెలియదు కానీ నా వద్ద నిలబడి, "ఈ రోజు నీతో భోజనం చేస్తాను" అన్నారు. ఆమె భిక్షాపాత్రలో నిండి వున్న భోజన పదార్థాలు నా విస్తరిలో వుంచారు. ఆమె తింటూ నాకు తినిపించారు. ఒకే ఆకులో ఇద్దరమూ భోజనం చేశాము. భోజనం పూర్తి అయ్యాక, నేను పెరటిలో చేతులూ కాళ్ళు కడుక్కొని వచ్చేసరికి అమ్మ అక్కడ లేరు. వాకిలికి గడియ వేసే వుంది. గడియ వేసి వుండగా అమ్మ లోనికి ఎలా వచ్చారు? ఎలా వెళ్ళారు? నిజంగా అమ్మ వచ్చి భోజనం చేశారా? లేక నేను కలగన్నానా? అని అనుమానం వచ్చి, వెంటనే అమ్మ కుటీరానికి వెళ్ళాను. "అది కల కాదు" అన్నారు అమ్మ. ఇది నా జీవితంలో మరువురాని సంఘటన.

అత్తిలి హనుమంతరావు గారు అంటారు - అమ్మ దోసిట్లో పెట్టిన అన్నం తినగానే మళ్ళీ అన్నం పెట్టేవారు. తినే వాడికి తన ఆకలి తెలిసినా, తెలియక



అవధూత శ్రీ చివటం అమ్మ

పోయినా అమ్మకు తెలిసేది. ఆకలి తీరేంతవరకూ అలా పెడుతూనే వుండేవారు.

"ఒకరోజు నాకూ, లక్ష్మిగారికీ ఆకుల్లో ప్రసాదం పెట్టారు. నేను తింటూ న్నాను. అమ్మ "లక్ష్మి" అని పిలిచారు. ఏదో పనిలో వుండి లక్ష్మిగారు రాలేదు. ఇంతలో ఒక కుక్క వచ్చి లక్ష్మిగారికి పెట్టిన ఆకులో పదార్థాలు తినడం మొదలు పెట్టింది. అపుడు అమ్మ లేచి బయటకు వెళ్ళి, "లక్ష్మి! రావేమే - పిలవగానే రావే - పెట్టగానే తినవే" అని కోపంగా అంటూ అటూ ఇటూ తిరుగుతున్నారు. నేను అమ్మ కోపంగా మాట్లాడడం గానీ, అసలు ఇన్ని మాటలు గానీ ఎప్పుడూ చూడని కారణంగా నాకు కొంచెం భయం వేసింది. కుక్క ఆ పదార్థాలను తిని వెళ్ళగానే అమ్మ శాంతించి, కుటీరంలోనికి వెళ్ళి కూర్చున్నారు. అపుడు నాకు అర్థమైంది ఏమంటే - ఒక ప్రక్క పెట్టగానే తినలేదని లక్ష్మిగారిని కేకలేస్తూనే - ఆ కుక్క పూర్తిగా తినేవరకూ దానికి ఎవరూ అడ్డురాకుండా రక్షణ కలిగించారు. అది తృప్తిగా తిని వెళ్ళగానే ఏమీ జరగనట్లే వెళ్ళి కుటీరంలో కూర్చున్నారు. అమ్మ ప్రేమ సర్వజీవుల పట్లా సమానంగా వుండేది.

ఒకరోజు సాయంత్రం 4గం॥ల సమయంలో అమ్మ దగ్గరకు వెళ్ళాను. కొద్దిసేపు అమ్మ సన్నిధిలో కూర్చుని, "వెళ్ళొస్తాను అమ్మా" అన్నాను. అమ్మ ప్లేటులో అన్నంపెట్టి, నా ముందు వుంచి తినమన్నారు. నేను అది తిని, అమ్మ చూస్తే ఇంకొంచెం అన్నం పెడతారని తలచి, అమ్మ చూడకుండా ఆ ప్లేటులో చేయి కడిగేసి లేచాను. కానీ, నా పేంటు కిందకు పట్టి లాగుతున్నారు అమ్మ. నేను వెంటనే కూర్చున్నాను. "బాబు ఇంకొంచెం తింటాడు" అంటూ, నేను చేయి కడిగేసిన ప్లేటును అమ్మ బయటకు పట్టుకెళ్ళి నీళ్ళు పారబోసి తీసుకొచ్చి, అందులో మరలా అన్నం పెట్టారు. కూర్చుంటే లేవడం కష్టమయ్యే వయస్సు అమ్మది. అటువంటి స్థితిలో గబుక్కున లేచి, నేను చేయి కడిగిన ప్లేటు బయటకు తీసుకెళ్ళ కడిగి, మరలా అన్నం పెట్టడం చూడగా - అమ్మ చూపిన వాత్సల్యానికి, నా కళ్ళల్లో నీళ్ళు నిండాయి. నిజానికి నాకు అప్పుడు ఆకలిగానే వుంది - అమ్మను ఇబ్బంది పెట్టకూడదనే నేను మొదట చేయి కడిగింది.

ఒక్కోసారి అమ్మ భక్తులకు రానున్న ఆపదలను నివారించడాని క్కూడా ప్రసాదం పెట్టేవారు. తణుకులో శ్రీదేవి హోటల్ యజమాని రఘుపతి ఇలా చెప్పారు

- ఒకసారి ఆయన అమ్మ కుటీరానికి వెళ్ళారట. అక్కడి వాతావరణాన్నీ, అమ్మనీ చూసేసరికి ఆయనకు వికారం అనిపించిందట - అంతలో అమ్మ ఆయనకు ఇడ్లీ ఒకటి ఎంగిలి చేసి, ప్రసాదం పెట్టారు. దానిని తినటానికి అసహ్యం వేసి, బయటకు వచ్చి ఒక బురద గుంటలో వేశారు. అది బురదలో క్రమంగా క్రిందికి దిగిపోయింది. ఆయన ఇంటికి చేరాక, సాయంత్రం ఒక టెలిగ్రాం వచ్చింది. అంతకు ముందు రోజు శ్రీశైలం యాత్రికులను తీసుకెళ్ళిన ఆయన కారు ప్రమాద వశాత్తూ కొండ పైనుండి లోయలోకి పడిపోయినట్లు తెలిసింది. ఆయన వెంటనే శ్రీశైలం వెళ్ళి చూడగా - తాను పడేసిన ఇడ్లీ ఎలా క్రమంగా బురదలోకి క్రిందికి దిగిపోయిందో, అలాగే తన కారు లోయలోకి దిగిపోయింది. అయినా, ఎవరికీ ప్రమాదం జరక్కపోవడమే విచిత్రం! అమ్మ ప్రసాదాన్ని భక్తి శ్రద్ధలతో స్వీకరించి వుంటే, ఈ సంఘటన కూడా నివారింపబడి వుండేదేమో!

అప్పనపల్లిలో శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి ఎందరు యాత్రికులు వచ్చినా, ఏ సమయంలోనైనా లేదనకుండా భోజనం పెడతారని అప్పనపల్లి విశేషాలు చెప్తున్న ఒక భక్తురాలితో అమ్మ తన భిక్షాపాత్రను చూపుతూ, "ఇక్కడ ఇదీ అలాగే భోజనం పెడుతుందే" అన్నారు అమ్మ. అమ్మ ఎప్పుడూ తనను 'ఇది' అనేవారు గానీ, 'నేను' అనేవారు కాదు.

ఒక భక్తునికి 'దినం' అన్నం తింటే జ్వరం వచ్చేది. ఒకసారి ఎవరో 'దినం' అన్నం అమ్మ వద్దకు పంపించారు. అతడు సందేహిస్తుంటే అమ్మ "ఇలాంటి అన్నం తింటే ముందు ముందు మంచి జరుగుతుంది, తిను" అని నవ్వుకుంటూ పెట్టారు. ఈసారి జ్వరం రాలేదు. అన్నం ఎలాటిదైనా అమ్మ చేత్తో పెట్టిన తర్వాత అది అమ్మ ప్రసాదమే!

ఒకసారి ఒక తల్లి పాయసం ప్రసాదం వడ్డిస్తూ వుంటే, అది కొంచెం క్రింద పడింది. అమ్మ వెంటనే మట్టిలో పడిన దాన్ని చేత్తో తీసుకొని నాకేశారు. అది చూచిన భక్తుడు తాను అలా చేయలేకపోయానే అని బాధపడ్డాడు. తర్వాత జీవితంలో ఎప్పుడు గానీ ప్రసాదం క్రిందపడ్డా, మట్టిలో పడ్డా కళ్ళ కద్దుకుని తినేవాడు.

అమ్మగారు కడుపునిండా ప్రసాదాలు పెట్టి తినిపిస్తారు కదా! అని ఇంటి దగ్గర ఏమీ తినకుండా వెళ్లాడొక భక్తుడు. అతనితో వచ్చిన వారిద్దరికీ బాగా కడుపునిండా పెట్టారు గానీ, ఆ భక్తునికి మాత్రం సాయంత్రం వరకు అసలు ఏమీ పెట్టలేదు సరికదా, మంచినీళ్ళు కూడా ఇవ్వలేదు. భగవద్గీత చదవమన్నారు. ఆకలి వల్ల అతడు సరిగ్గా చదవలేకపోతున్నాడు. అమ్మగారేమో "గట్టిగా చదువు బాబూ - లోపలి దానికి ఇనపట్టంలేదు - గట్టిగా చదువు బాబూ" అన్నారు. అక్కడున్న వారు అతను ప్రొద్దుటి నుంచీ ఏమీ తినలేదని చెప్పారు. అప్పుడు కొంచెం ప్రసాదం పెట్టారు. దాంతోనే ఆకలి తీరి ఎంతో శక్తి వచ్చింది. ఆ తర్వాత ఇంకెప్పుడూ అలా అమ్మ పెడతారులే అని భోంచెయ్యకుండా వెళ్ళలేదు.

మరొకసారి ఆ భక్తుడు ఇంటి దగ్గర తిని వచ్చాను ఆకలి లేదంటుంటే, "బాబూ! నీకు అన్నం పెట్టలేననుకున్నావా? ఇంటి దగ్గర తిని వచ్చావా? అలా ఇంకెప్పుడూ తినిరాకు బాబూ!" అన్నారు.

★★★

## జీవకారుణ్యం

సకల సృష్టినీ భగవంతుని రూపంగా దర్శించే అవధూతలు సకల జీవకోటినీ సమాన దృష్టితోనే చూస్తారు. ఒక తల్లి కుక్కకు రొట్టెవేస్తే తన ఆకలి తీరిందనీ, ఒకడొక పిల్లిని దావబాదితే - తన వీపు మీద ఆ దెబ్బలు తగిలిన గుర్తుల్నీ చూపించారు శ్రీ శిరిడీ సాయిబాబా! అమ్మ కూడ అటువంటి కోవకు చెందిన మహాత్మురాలే! అమ్మకు జగత్తు అంతా రామమయమే! సర్వ జీవుల్లోనూ అమ్మ రాముణ్ణే చూసుకునేవారు.

అమ్మ తమ భక్తులకెంత ప్రేమతో తినబెట్టేవారో, తన దగ్గర తిరుగుతుండే కుక్కలకూ, పిల్లులకూ కూడ అలానే తినబెట్టేవారు. తాను తెచ్చిన భిక్ష ప్రతి పూటా కుక్కలకూ, పిల్లులకూ తినబెట్టి, తర్వాతనే తాము స్వీకరించేవారు. వాటి ఆకలిని తన ఆకలిగా భావించేవారు. వాటి కష్టాల్ని తమ కష్టాలుగా స్వీకరించేవారు. సర్వజీవుల పట్లా ఎంతో దయతో వుండేవారు అమ్మ!

ఒక పిల్లి అమ్మ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వుండేది. దానికి ప్రత్యేకంగా అమ్మ మీగడ, పెరుగు పెట్టేవారు. ఆ పిల్లి అమ్మను గీరేది. అయినా అమ్మ ఏమీ అనేవారు కాదు. అమ్మ పెట్టేదాకా అది ఏమీ తినేది కాదు. తర్వాత ఆ పిల్లిని ఎవరో తీసికెళ్ళినా, అది మళ్ళీ తిరిగి వచ్చి మూడు పిల్లి పిల్లల్ని కన్నది. ఆ పిల్లల్నీ తీసుకు వచ్చి, అమ్మ పాదాల మీద పడేసింది.

ఒకసారి ఒక పెద్ద కప్ప అమ్మ గారి ఒడిలో దూకింది. అమ్మగారు దానిని చూసి "రామ్మా రా" అంటూ దానిని నిమురుతూ "ఇదిగో నువ్వు కూడా చూద్దువుగానీ కూర్చో" అన్నారు. అది అలా ఎంతసేపో అమ్మ ఒడిలో వుంది, ఇంకొక ప్రక్కగా ఎగిరిపోయింది.

కొడవళ్ళ మంగమ్మ గారు ఇలా చెప్పారు - 'ఒకరోజు పొలంలో మామిడి చెట్టుక్రింద అమ్మ కూర్చుని వున్నారు. మేమంతా కూడా అక్కడే వున్నాము. మేము

చూస్తుండగానే ఒక పెద్ద త్రాచుపాము చరచరా ప్రాకుతూ వచ్చి అమ్మ తొడపై నుంచి వెనుక వైపుకి దిగి వెళ్లిపోయింది. మేమంతా కంగారు పడ్డాము. తన తొడపై ప్రాకుతున్న త్రాచును చూస్తూ కూడా అమ్మ కదలకుండా కూర్చునే వున్నారు.'

అదే చెట్టు క్రింద వుండగా ఒకరోజు మంగమ్మగారు అమ్మ దర్శనానికి వెళితే అమ్మ ఒంటి నిండా చెట్టు పురుగులు వాలి కుడుతున్నాయి. అమ్మ శరీరం కనబడనంతగా ఆ కీటకాలు కమ్మి వున్నాయి. అయినా అమ్మ ఏ మాత్రమూ చలించలేదు. మంగమ్మగారు వాటిని గుడ్డతో తోలుతుంటే "నెమ్మదిగా తోలు అవి చచ్చిపోకుండా" అన్నారు.

తర్వాత అమ్మ కుటీరంలో వుండే రోజుల్లో ఒకసారి ఒక మండ్రగబ్బ వచ్చి, అమ్మ కాలు కరిచింది. కండ బయటకు వచ్చి, రక్తం కారుతున్నది. అక్కడున్న భక్తులు ఆ మండ్రగబ్బను చంపబోయారు. కాని అమ్మ ఆ భక్తులతో "చంపకండిరా! అమ్మే ఆ రూపంలో వచ్చి తన పని తాను చేసుకు పోయింది." అన్నారు. తనకు పెట్టింది విషాన్నమని తెలిసీ 'ఇది నేను అనుభవించాలని వచ్చింది కాబట్టి దీన్ని స్వీకరిస్తాను' అని గ్రహించిన సిద్ధారూఢుల కోవకు చెందిన వారు మన చివటం అమ్మ.

అమ్మ పడుకొనే చెక్కపలకల క్రింద ఎన్నో బొద్దింకలు, చిమటలూ వుండేవి. అవి కరచి అమ్మ వంటి మీద దద్దుర్లు వస్తే చూసిన భక్తులు "అమ్మా! మీరు కొంచెం లేవండి - ఆ పలకలు దులిపి వేస్తా" అంటే అమ్మ ఒప్పుకునేవారు కాదు. .అలానే ఆ క్రిమికీటకాల మధ్యనే వాటితో పాటే పడుకునేవారు అమ్మ. అమ్మ వేసుకునే చెక్కలు కూడ ఇక్కడో చెక్క, అక్కడో చెక్క వుండి, క్రింద గాడి వుండేటట్లుగా వేసుకుని పడుకునేవారు "ఎందుకమ్మా అలా వేసుకుంటారు?" అంటే, "క్రింద గాడి వుంటే క్రింద పాకేవి అలా వెళ్ళిపోతాయి - వాటికి అడ్డం వుండదు - మనకు ఇక గొడవ వుండదు" అనేవారు.

ఒకసారి చివటంలో ఒక కుక్క ఒంటినిండా గజ్జి కురుపులతో బాధ పడుతున్నది. భక్తులు దాన్ని చీదరించుకుని వెళ్ళగొడుతుంటే, అమ్మ పిండి వుడికించి ఆ కుక్క కురుపులన్నింటికీ రాసి కట్లు కట్టారు. ఆ కురుపులు తగ్గినట్లే

తగ్గి మళ్ళీ వచ్చేవి. అలా ఆ కుక్క 5 సంవత్సరాల పాటు అమ్మ దగ్గరే వుండి, చివరకు అమ్మ సన్నిధిలోనే ప్రాణాలు విడిచింది. అమ్మకు మనిషి గానీ, కుక్క గానీ, మండ్రగబ్బ గానీ, బొద్దింకలు గానీ, క్రిమికీటకాలు గానీ అన్నీ సమానమే. అమ్మ ప్రేమకు అర్హత అనేది ఏమీ లేదు. సర్వ జీవరాసుల్లోనూ బ్రహ్మనే దర్శించే అమ్మకు తేడాలు ఎలా వుంటాయి? సూర్యుని వెలుగులా చంద్రుని వెన్నెలలా అమ్మ ప్రేమ అందరి మీద సమానంగా ప్రసరిస్తూనే వుంటుంది.

ఒకసారి ఒక కుక్క అన్నం కుండలో మూతి పెట్టింది. అన్నం మొత్తం తిన్నది కానీ, తల మాత్రం కుండ లోపలి నుంచి బయటకు రావటం లేదు. అది ఊపిరాడక భయంతో అరుస్తూ, అటూ, ఇటూ పరిగెత్తుతున్నది. ఆ కుండను తీయడం ఎవరి వల్లా కాలేదు. చివరకు అమ్మ ఆ కుక్క దగ్గరకు వెళ్లి అతి నేర్పుగా దాని తలను కుండలోంచి బయటకు విడిపించారు. ఈ బాహ్య ప్రపంచపు మాయలో చిక్కిన మన హృదయాన్ని బయటకు తీయడానికే అమ్మ అవతరించారనిపిస్తుంది.

★★★

## సకల సాధు, దేవతా స్వరూపిణి - అమ్మ

సద్గురువు సకల దేవతా స్వరూపము, సకల సాధు స్వరూపము. నిజానికి భగవంతుడు నామ రూప గుణ రహితుడు. ఆయనకొక నామం లేదు. అన్ని నామాలూ ఆయనవే! ఆయనకొక రూపమంటూ లేదు. అన్ని రూపాలూ ఆయనవే! ఆయన నిర్గుణుడు. సకల చరాచర సృష్టితత్త్వమంతా ఆయనదే! అటువంటి భగవత్తత్త్వమే మనపై కరుణతో అమ్మగా అవతరించింది! భగవద్గీతలో శ్రీకృష్ణుడు, "మానవులు అజ్ఞానం వలన అనేక కోరికలతో ఒక్కడే అయిన పరమాత్మకు వేర్వేరు నామరూపాలు కల్పించుకొని, వేర్వేరు దేవతలను ఆరాధిస్తారు!" అని చెప్పాడు. అంతేగాదు, "జ్ఞానిత్వాత్మైవమేమతం" (భ.గీ.) పరమాత్మయైన తనకూ, జ్ఞానికీ భేదమే లేదని కూడా చెప్పాడు. అందువలన, అమ్మ దగ్గరకు చేరిన తర్వాత, అమ్మను సేవించుకొన్న తర్వాత, ఇక దేవతలతో పనిలేదు. ఎందుకంటే, దేవతలందరూ సాక్షాత్తూ భగవంతుని ప్రతిరూపమైన సద్గురువుకు అధీనులు! అందుకనే అమ్మ, వేర్వేరు దేవతలనారాధించేవారికి, వారి వారి ఇష్టదేవతా రూపంలో దర్శనమిచ్చారు. "అమ్మకు, దేవతలకూ తేడా లేనప్పుడు, దేవతలనే ఆరాధించుకోవచ్చును కదా - అమ్మను సేవించడమెందుకు?" అని కొందరు అడగవచ్చు, దేవతలు కేవలం ఇష్టకార్యములు మాత్రమే ప్రసాదించగలరు - జ్ఞానాన్ని ప్రసాదించలేరు. సద్గురువు మాత్రమే ఇటు కోరిన కోరికలు తీరుస్తూనే, నెమ్మదిగా జ్ఞానాన్ని ప్రసాదిస్తూ, ఒక్కొక్క మెట్టూ ఆత్మపథంలో పైకి తీసుకు వెళ్ళగలరు. నామదేవుడు, రామకృష్ణ పరమహంస వంటివారు ఇష్టదేవతలను ఆరాధించి సగుణ సాక్షాత్కారం పొందినా, ఆ దేవతలు మోక్షం కోసం బ్రహ్మజ్ఞానియైన గురువును ఆశ్రయించమనే చెప్పారు. శ్రీ భరద్వాజ గారు వ్రాసిన "సాయిలీలామృతం" అనే గ్రంథం చదివితే ఈ విషయం మనకు స్పష్టంగా బోధపడగలదు.ఒక గురుపూర్ణిమ నాడు అత్తిలి హనుమంతరావు గారికి అమ్మ దేవిగా స్వప్న దర్శనమిచ్చారు. ఆ స్వప్న వృత్తాంతం వారిలా చెప్పున్నారు : "మిత్రులు విస్సయ్య పంతులు గారూ, నేనూ, అమ్మ

సమాధిని త్రవ్వి అమ్మను బయటపెట్టాం. అమ్మ పాదాలకు నమస్కారం చేసుకుంటుంటే, విచిత్రంగా పాదాలకు బదులు అమ్మ రెండు చేతులూ ముందుకు యిచ్చారు. "బాబూ! నన్ను ఎందుకు బయటపెట్టారు?" అన్నారు. "అమ్మా మిమ్మల్ని చూడాలనే దప్పికతో, మీ ప్రసాదం తినాలనే ఆకలితో ఈ పని చేశాను. నన్ను క్షమించండమ్మా" అని యేడ్చాను. అంతలో అమ్మ రెండు రూపాలుగా విడిపోయారు. ఆ రూపాలు రెండూ ఎంతో అందమైన కన్యలుగా వున్నారు. ఆ అందాన్ని నేను వర్ణించలేను. అవి ఏ దేవి రూపాలో కూడా చెప్పలేను. ఒక రూపం నిలుచొని వుంది - ఒక రూపం నాట్యం చేస్తోంది. నిలుచున్న రూపానికి నేను పాలు, పువ్వులు, విభూది, గంధాలతో అభిషేకం చేస్తున్నాను. అవి అన్నీ విచిత్రంగా తలుచుకోగానే చేతిలోకి వస్తున్నాయి. చివరిగా ఆ పాదాలకు కుంకుమ బొట్టు పెట్టబోతున్నాను - వెంటనే నాకు మెలకువ వచ్చింది." ఆ రోజు శుక్రవారం అమ్మ సమాధి వద్దకు వెళ్ళాను. అనుకోకుండా కలలోని పూజాసామగ్రి అంతా అక్కడకు రావడం అమ్మలీల కాక మరేమిటి? వాటితో అమ్మను అర్చించి, తృప్తిగా ఇంటికి వచ్చాను. "అమ్మను సేవించడం అసలైన ఉపాసన", అన్న శ్రీ స్వామి పూర్ణానందుల వారి మాటలు గుర్తుకు వచ్చాయి.

చిన్నం సీతామహాలక్ష్మిగారు ఒకసారి దేవీపూజ చేసుకుంటున్నారు. ఒక ఆసనం వేసి, బూరెలు, వగైరా పిండి వంటలు అక్కడ వుంచి నివేదన చేశారు. అంతలో అమ్మ వచ్చి ఆ ఆసనం మీద కూర్చుని, 'బూరెలు తింటు న్నానే అమ్మా' అన్నారు. సాక్షాత్తూ ఆ మహాదేవియే అమ్మ!

నిడదవోలు గ్రామస్థులు శ్రీ దట్ల వీరభద్రరావు గారికి కలలో అమ్మ అన్నపూర్ణమ్మ, విశాలాక్షి వలె కన్పించారు. అమ్మ సాక్షాత్తూ పరమేశ్వరి స్వరూపమేనని వారి విశ్వాసం!

పెదవాడపల్లి గ్రామస్థులు శ్రీ వెంకటేశ్వరరావు గారికి అమ్మ హనుమంతుని రూపంలో దర్శనమిచ్చారు. ఈమని సుబ్బారావుగారు తమ అనుభవాన్నిలా చెప్పారు, "అమ్మ ఆరాధనోత్సవాలకు నాలుగు రోజులు ముందుగానే స్వప్న దర్శనమిచ్చారు. అందులో సీతారామ లక్ష్మణులతో కూడి హనుమంతుని

స్థానంలో అమ్మ కూర్చుని వున్నట్లు దర్శనమయింది. నేను ఆంజనేయ స్వామిని పూజిస్తాను. అమ్మ హనుమంతుని స్థానంలో కూర్చుని దర్శనం ఇవ్వడం నాకెంతో ఆనందం కలిగించింది.

అందరు మహాత్ముల రూపంలో వున్నది ఆ భగవంతుడే అయినప్పుడు మహాత్ములు ఒకరి నుండి ఒకరు వేరు ఎలా అవుతారు? అమ్మ, తమకు, ఇతర మహాత్ములకు భేదం లేదని కొందరికి అనుభవం ప్రసాదించారు.

రేలంగి వాస్తవ్యులు శ్రీ శేషేంద్ర తమ అనుభవాన్నిలా చెప్పారు - "నేను నా బాల్యంలో తరచు అమ్మ వద్ద గడిపేవాడిని. అప్పుడు నాకు తినుబండారాలు కొనుక్కోవడానికి చిల్లర పైసలు ఇస్తుండేవారు అమ్మ. అమ్మ సమాధి అనంతరం కూడా అమ్మ సమాధిని ప్రతివారం దర్శించుకొంటాను. ఒకసారి శ్రీ వెంకయ్య స్వామి వారి చరిత్ర చదివాను. అప్పటి నుండి గొలగమూడి వెళ్ళి స్వామి సమాధిని దర్శించుకోవాలనే తపన - కానీ, పరిస్థితులు అనుకూలించక, అక్కడకు వెళ్ళలేక పోయాను. ఒకరాత్రి నాకు స్వప్నంలో పోస్టులో ఒక కవరు వచ్చింది. తెరచి చూస్తే, అందులో శ్రీ వెంకయ్య స్వామి వారి ఫొటోలు, వాటితో పాటు పెద్ద సైజులో అమ్మ ఫొటో కూడా కన్పించింది. నాకు మెలకువ కలిగి, ఆలోచించగా అమ్మ, వెంకయ్యస్వామి వేరు కాదనీ, మహాత్ములందరూ వేరు వేరు రూపాల్లో వున్నా ఒకే గురు తత్వమనీ, అమ్మ సమాధిని సేవించడం, స్వామి సమాధిని సేవించడం ఒకటేనని నాకు తెలియపరచడానికే అమ్మ ఈ స్వప్న దర్శనం ఇచ్చినట్లు తోచింది."

దెందులూరి భాస్కరలక్ష్మి గారి అనుభవం ఇలా వుంది - "నేను "సాయి లీలామృతము" పారాయణ చేయాలని సంకల్పించి, బాబా స్వప్న దర్శనం ఇస్తే బాగుండును అనుకొని సాయిని స్మరిస్తూ నిద్రించాను. తెల్లవారే ముందు నాకో స్వప్నం! స్వప్నంలో నేను బాబా మందిరానికి వెళ్ళాను. ఆ మందిరంలో చిన్న కుటీరం - అందులో చిన్న గది. దాని మధ్యలో తెల్లని పాలరాతి పలక, దానిపై అవధూత చివటం అమ్మ కూర్చుని వున్నారు. అమ్మ చుట్టూ నిలబడి కొందరు యువతులు అమ్మకు అభిషేకం చేస్తూ వున్నారు. నేను అమ్మకు నమస్కరించాను. ఎదురుగా చివటం అమ్మను చూస్తున్నా, నేను బాబా అన్న భావంతోనే నమస్కరించాను. అమ్మ నన్ను దగ్గరకు పిలిచి, నా చేతిలో ఊధీ వేసారు. అమ్మ, బాబా

వేరు కాదని నాకు అర్థం అయింది.

అమ్మ తమ యొక్క నిజస్థితిని చాలా వరకు గుప్తంగా వుంచేవారు. అమ్మ తామే జగన్మాత అయిన 'దేవి' అయ్యుండి కూడా, ఒకసారి మట్టి ముద్దలు చేసి, పసుపు - కుంకుమలతో బొట్లు పెట్టి, "దేవీపూజ చేసుకోండి" అని ఆదేశించారు. అప్పటి నుంచీ ప్రతిసారీ, దేవీ నవరాత్రులకు మట్టితో దేవీమూర్తిని చేసి, రామాలయంలో పెట్టి, తొమ్మిది రోజులూ పూజలు, భజనలు చేసి, పదవ రోజు ఊరేగింపు చేసేవారు. గోవింద నామాలు చెప్పు కుంటూ వెళ్ళి, ఆ మూర్తిని గోస్తనీ నదిలో నిమజ్జనం చేసేవారు.

కానీ, అమ్మ తమ నిజస్థితిని బహిర్గతం చేసిన ఒక్క సంఘటన మాత్రం తెలియవచ్చింది. ఒకసారి చివటంలోని పార్వతీదేవి గుడిలో విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ప్రతిష్ఠ అనంతరం అన్న సంతర్పణ జరుగుతున్నది. అమ్మగారు లక్ష్మి, రంగమ్మ, సూరమ్మ మొదలైన వారితో కలిసి చిన్నపాప వెంకట లక్ష్మి భుజం మీద చెయ్యి వేసి నడుస్తూ సింహద్వారంలో నుండి ఆలయంలో ప్రవేశించారు. అక్కడ వున్న పెద్దలందరూ "అమ్మగారొచ్చారు, అమ్మగారొచ్చారు" అని కంగారుగా లేచి నిలబడ్డారు. అమ్మగారు అందరి మధ్య నుండి నడుచుకుంటూ వెళ్ళి అన్నరాశి దగ్గర ఆగారు. అమ్మ తమ భిక్షా పాత్రలోని భిక్ష అందులో కలిపారు. తరువాత అన్నరాశి నుండి అన్నం తీసుకొని, ఉచ్ఛిష్టం చేసి, అన్నరాశిపై చల్లారు. తరువాత 'భిక్ష తీసుకుందా' అని సైగచేసి, లక్ష్మి, సూరమ్మ, రంగమ్మ, సిద్ధాపురం బాబు మొదలైన వారందరితో కలిసి భోజనం చేశారు.

పార్వతీ దేవికై నివేదించబడిన అన్నాన్ని తాము ఉచ్ఛిష్టం చేసి, అందరికీ పంచమన్నారంటే, అమ్మ తామే జగన్మాతయైన పార్వతీదేవి అని చెప్పకనే చెప్పినట్లు కాదా? అమ్మ బహిరంగంగా తానే "దేవి" అని నిరూపణగా చేసిన లీల ఇది ఒక్కటే!

అదే శివాలయం ప్రాంగణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం కూడా నిర్మించారు. ఈ నిర్మాణం కూడా చిత్రంగా జరిగింది. ఒకసారి కొందరు భక్తులు అప్పనపల్లి వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్ళారు. అమ్మ అక్క నుంచి ఏమీ

ప్రసాదం తీసుకు రావద్దని చెప్పారు. "బాబు వచ్చేస్తాడె - పిల్లలు కష్టపడతారె" అన్నారు. అయినా వినకుండా వాళ్ల ప్రసాదం తెచ్చారు. "ఇదేంటే తేవద్దన్నాను - ఎందుకు తెచ్చారు మీరు? బాబాను కష్టపెట్టేస్తున్నారు" అన్నారు. అంతలో ఊరి వారికే సంకల్పం కలిగి వెంకటేశ్వరస్వామి గుడి ప్రారంభించారు. చివరకు అమ్మ దేహాన్ని సమాధిలో ఉంచిన రోజునే (10-6-81 శుద్ధ నవమి) గుడిలో విగ్రహప్రతిష్ఠ జరిగింది.

విజయవాడ వాస్తవ్యులు శ్రీమతి జయలక్ష్మిగారు శిరిడి సాయిబాబా భక్తులు, పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్‌గారి శిష్యురాలు. వీరికి తమ గురుదేవుల యిన పూజ్యశ్రీ మాస్టర్‌గారి ప్రథమ దర్శనం చివటంలో అమ్మ సన్నిధిలో జరిగింది. ఈ వృత్తాంతాన్ని జయలక్ష్మిగారు ఇలా చెప్పుతున్నారు. "అప్పట్లో తణుకులో నివసించేవాళ్లం. 1979లో శ్రావణ శుక్రవారం నాడు మొట్టమొదటగా అమ్మ దగ్గరకు వెళ్లాను. వెళ్లొచ్చాక తెల్లవారు ఝామున అమ్మ కలలో కన్పించి, లలితా స్తోత్రం చదువుకోమని చెప్పారు. 1971లో ప్రతి గురువారం వరుసగా 11 వారాలు అమ్మ దగ్గరకు వెళ్ళేదాన్ని అమ్మ ఉచ్ఛిష్టం పెట్టేవారు. 7,8 వారాలు అయ్యేదాకా "అ ఏమిటో ఈ ఎంగిలి పెట్టడం ఏమిటో, తినటం ఏమిటో అనుకున్నాను. అంతే! మరుసటి గురువారం వెళ్లినప్పుడు అమ్మ ప్రసాదం పెట్టలేదు. 11వ గురువారం ముందు రోజు అంటే బుధవారం నాడు అమ్మ సమక్షంలో పూజ్యశ్రీ మాస్టర్ గారి దర్శనం అయ్యింది. మరునాడు గురువారం రోజున పూజ్యశ్రీ మాస్టర్‌గారు తణుకు వచ్చినప్పుడు మా ప్రార్థన మేరకు మా ఇంటికి ప్రప్రథమంగా విచ్చేశారు. 'అమ్మే విఘ్నేశ్వరుడు - విఘ్నేశ్వరుడే అమ్మ' అని ఒక మహాత్ములు అన్నదానికి ఇదే నిదర్శనం. అమ్మ ఆశీస్సులు, అనుగ్రహంతో నాకు గురువు లభించారు. ఇప్పటికి కూడా నేను ఏ కార్యక్రమం ప్రారంభించినా మొదట విఘ్నేశ్వర పూజగా చివటం అమ్మకే పూజ చేసుకుంటాను.

★★★

## భక్తుల అనుభవాలు

మహాత్ములు అర్హత కలిగి అడిగిన వారికి, భిక్షుగానికి భిక్ష వేసినంత తేలిగ్గా, అత్యుత్తమమైన అధ్యాత్మిక అనుభవాలు ప్రసాదిస్తుంటారు. శ్రీ తాజుద్దీన్ బాబా వారు తమ తలమీది టోపీ తీసి ప్రక్కన బోర్లించగానే ఒక భక్తునికి 'హాల్' సిద్ధించింది.[1] అమ్మ అడగకుండానే అర్హులైన కొందరు భక్తులకు అతీతమైన అధ్యాత్మిక అనుభూతులను ప్రసాదించేవారు. ఒకసారి ఒక భక్తుడు మధ్యాహ్నం పూట అమ్మ వద్ద వున్నారు. అమ్మ అతడిని కొంచెం సేపు పడుకోమని చెప్పారు. "నాకు మధ్యాహ్నం నిద్ర అలవాటు లేదమ్మా" అన్నా సరే, అతడిని "కొంచెం ఒత్తిగిలు బాబూ" అని పడుకోబెట్టారు. తర్వాత చంటి పిల్లవాని ప్రక్కలో తల్లి పడుకొన్నట్లుగా అమ్మ వెళ్ళి ఆ భక్తుని ప్రక్కన పడుకొన్నారు. అమ్మ శరీర స్పర్శ తగిలీ తగలగానే, ఆ భక్తుడు బాహ్యస్మృతి కోల్పోయాడు. అలా ఎంతసేపు గడిచిందో తెలియదు. అతనికి మెలకువ వచ్చేసరికి అమ్మగారు టీ చల్లార్చుకుంటూ వచ్చి, "టీ తాగు బాబూ" అని ఇచ్చారట ఏమీ తెలియనట్లే! అప్పటినుంచి ఆ భక్తునికి ధ్యానంలో చాలా అభివృద్ధి కనిపించిందనీ, అధ్యాత్మికంగా ఒక పై స్థితికి వెళ్ళినట్లు అన్పిస్తుందనీ అతను చెప్పాడు.

అమ్మ ఒక పిల్లవానిని పండు అని పిలిచేవారు. 9వ ఏట పాండురంగ దర్శనం అయిన దగ్గర్నుంచీ ఒక్కగ్లాసు పాలు మాత్రమే త్రాగి వుండేవాడు. ఆ కుర్ర వాడు ఆహారం లేక చిక్కిపోతుంటే, 11 ఏళ్లప్పుడు అమ్మ దగ్గరకు తీసుకు వచ్చారు. అమ్మ పిల్లవాడిని తన దగ్గరుంచుకొని రోజూ ఒక పూట నాలుగైదు ముద్దలు ప్రసాదం తినిపించేవారు ఎంతో ప్రేమతో. దానితో కొంత శారీరక పెరుగుదల, ఆరోగ్యం కలిగాయి. "బాబుని వదలకండే! వదిలితే దొరకడు" అనేవారు అమ్మ. ఆ పిల్లవాడు 28 ఏళ్ల వయస్సు వచ్చే వరకు ఇంట్లో వుండి, తర్వాత

1. పూజ్యశ్రీ మాష్టరుగారు వ్రాసిన హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర - 75వ పేజీలో చూడవచ్చు.



అవధూత శ్రీ చివటం అమ్మ

శ్రీశైలం అడవుల్లోకి తపస్సుకు వెళ్ళిపోయాడు. అమ్మ ఆ పిల్లవాడిని 'జ్ఞానదేవ' అని ముద్దుగా పిలిచేవారు. అమ్మ ఆ ముముక్షువుకు అదృశ్యంగా ఏమి బోధించారో, ఏ ఆధ్యాత్మిక శిక్షణనిచ్చారో మరి!

అమ్మ ఎందరో భక్తులను ఆధ్యాత్మికంగా ఉద్ధరించారు. అంతే కాకుండా వారికవసరమైన ఐహిక విషయాల్లో కూడా అమ్మ తామే స్వయంగా నడిపించేవారు. ఇలా ఐహికంగా ఆధ్యాత్మికంగా ఉద్ధరింపబడిన అనేమంది భక్తుల్లో మనకు తెలిసిన వారు ఒకరు కట్టా సత్యంగారు. అమ్మతో వారి అనుబంధాన్నీ, అనుభవాన్నీ వారి మాటల్లోనే విందాం.

"1971లో నేను అమ్మను మొట్టమొదటి సారిగా దర్శించాను. దానికి కొన్ని రోజులు ముందు ఒక రాత్రి ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో నేను ఒక నదిలో కొట్టుకుపోతున్నాను. 'అమ్మా! అమ్మా!' అని అరుస్తున్నాను. అప్పుడొక చిన్నపాప నా చేయి పట్టుకొని ఒక కొండ మీదకు తీసుకు వెళ్ళి, 'ఇదుగో మీ అమ్మ' అని చూపించింది. కానీ, నాకు మోకాళ్ళ నుండి క్రింద వరకు అమ్మ పాదాలు మాత్రమే కన్పించాయి. ఆ పాదాలు పట్టుకొని నమస్కారం చేసుకొన్నాను. తర్వాత కొన్ని రోజులకు నేను చివటం వెళ్ళడం, అమ్మను దర్శించడం జరిగింది. నేను వెళ్ళే సరికి అమ్మ ఒక్కకాలు మీదే నిలబడి, ఇంకోకాలు ముడుచుకొని అలా గోడకు ఆనుకొని నిలబడి వున్నారు. నేను సాష్టాంగ నమస్కారం చేసుకొని, ఆ పాదాల కేసి చూశాను - సరిగ్గా నాకు కలలో కన్పించిన పాదాలే అవి!

అప్పటి నుండి తరచు అమ్మ దగ్గరకు వెళ్ళేవాడిని. వెళ్తే ఏదో ఒకటి కడుపునిండా తినబెట్టేవారు. తర్వాత భగవద్గీత కానీ, రామాయణం గానీ ఏదో ఒక పుస్తకం చదివించేవారు. అమ్మ పుస్తకం మధ్యలో చేయి పెట్టి ఎక్కడో ఒక పేజీ తెరిచి ఇచ్చేవారు. సరిగ్గా ఆ ఘట్టం మన మనస్సులోని ప్రశ్నలకు సమాధానం అయ్యేది.

నాకు ధ్యానం చేసుకోవాలని ఆకాంక్ష! ఒకరోజు అమ్మను అడుగుదామా, వద్దా అనుకొంటుండగా అమ్మగారు లోపలకు పిలిచి, "ధ్యానం చేసుకుంటావా బాబా" అన్నారు. అవునన్నాను. అప్పుడు అమ్మ సీతారామ పట్టాభిషేకం ఫోటో,

అనుకోమంటారు?' అని అడిగితే, 'రామ రామ'అనుకో బాబు అని చెప్పి, ఎవరికీ చెప్పవద్దన్నారు. "ఎందుకు చెప్పకూడదమ్మా?" అంటే అమ్మ "ఏమీ లేదు బాబూ! "ఓసీ! ఉపదేశమంటే ఇంతేనా?" అని చులకన చేస్తారు" అన్నారు. అప్పటి నుండి ఊరు బయట పనసచెట్టు క్రింద ఫోటో పెట్టుకొని ధ్యానం చేసుకొంటుండే వాడిని. కొన్నాళ్ల తర్వాత ఒకరోజు నాకు అనుమానం వచ్చింది - అమ్మ రామ రామ అనుకోమన్నారా, శ్రీరామ అనుకోమన్నారా, శ్రీరామ జయరామ అనుకోమన్నారా అని, ఆ విషయం అమ్మనడిగితే, "ఎందుకు బాబా అవన్నీ దూరం - రామ రామ దగ్గర బాబూ మనకు" అన్నారు. "సమస్త దేవతలు, ఋషులు, నారదుడు జపించే మంత్రము ఇదే" అన్నారు అమ్మ.

నాకు ధ్యానంలో ఉండగా తాటి చెట్టు ప్రమాణం గల ఒక నల్లటి ఆకారం అస్పష్టంగా కన్పించేది. నాకు భయమేసి, అమ్మను అడిగితే, అమ్మ నవ్వి, "కన్పిస్తోందా? కన్పిస్తోందా?" అని "వాల్మీకికి కూడా అలానే కన్పించేది. తర్వాత క్రొత్త ఋషులు వచ్చి దానిని తీసేశారు. అది నీ పాపం. నేను తీసేస్తాను" అంటూ నా నుదుటి మీద చేయి పెట్టారు. అప్పటి నుంచీ మళ్లీ అలా కన్పించలేదు. ఒకసారి అమ్మను కలిసినప్పుడు "ధ్యానం ఒక్కటే మనకు - ఇక ఏవీ రావు" అన్నారు అమ్మ.

అమ్మ ఒకసారి నాతో ఇలా అన్నారు - "బాబూ! 'ఇది నేను కాదు - ఇది నేను కాదు - అనుకొంటూ పోతే, చివరికి మిగిలిందే నేను. ఆ 'నేనే' భగవంతుడు అంటారు. ఇది అసలు ఎప్పటిమాట! ఎంతపై మాట! రామా! రామా!"

అమ్మ నన్ను బ్రహ్మచర్యంలో ఉండమనీ, అలా వుంటే ధ్యానంలో చాలా పై మెట్టుకు వెళ్లవచ్చనీ, చాలాసార్లు చెప్తూండేవారు. అప్పటి నుండి నాకు అది ఒక సమస్యగా తయారయింది. ఒకసారి అమ్మగారి కాళ్లకు నూని రాసి, మర్దన చేస్తున్నాను. అదురుపాటుగా ఇలా అన్నారు అమ్మ - "ఏముందీ శరీరంలో, ఇదుగో చూస్తున్నావు కదా! నత్త లోపల గుజ్జు అంతా అయిపోతే, మిగిలింది ఏముంటుంది? ఒత్తి గుల్లే కదా! అది ఎందుకైనా పనికి వస్తదా?" అన్నారు. నేను మాట్లాడకుండా తలవంచుకొన్నాను.

కట్టా సుబ్బారావుగారు వ్రాసిన భగవద్గీత ఎక్కువగా చదవమనేవారు. బ్రహ్మచర్యం గురించి వ్యాఖ్యానిస్తూ ఆయన సోక్రటీసు - వారి శిష్యులకు జరిగిన ప్రసంగం ఒకటి దానిలో వ్రాశారు. వెళ్ళినప్పుడల్లా ఎక్కువగా ఆ సంభాషణ నాతో చదివించేవారు. అందులో ఇలా వుంది.

శిష్యులు : అయ్యా! సంసారంలో మేము ఎంతకాలానికి కలిస్తే మంచిది?

సోక్రటీసు : మూడు సంవత్సరాలకొకసారి కలిస్తే మంచిది.

శిష్యులు : అయ్యా! అలా మానవమాత్రులమైన మాకు సాధ్యమా?

సోక్రటీసు : అలా అయితే సంవత్సరానికి ఒకసారి కలవచ్చు.

శిష్యులు : కొంచెం క్రిందకి దిగాలి.

సోక్రటీసు : అయితే ఆరు మాసాలకు ఒకసారి.

శిష్యులు : ఇంకా కొంచెం క్రిందకి దిగండి.

సోక్రటీసు : అయితే నెలకు ఒకసారి.

శిష్యులు : మరి కొంచెం క్రిందకి దిగాలి.

సోక్రటీసు : అయితే, నీ సమాధి ఒకటి కట్టుకొని, నీ ఇష్టం వచ్చినన్ని సార్లు!
ఇది చదివిన వెంటనే 'చూశావా! గురువుగారు ఏమన్నారో శిష్యులతో? ఆయనకు ప్రాణం విసిగిపోయింది'అన్నారు అమ్మ గారు.

నాకు మొదట చదవడం అంత సరిగా వచ్చేది కాదు. సంస్కృత శ్లోకాలు నోరు తిరిగేవి కావు. అది చూసి అమ్మగారు కొద్దిగా కొబ్బరి నీళ్లుగానీ, ప్రసాదం గానీ, మంచినీరు గానీ అమ్మ ఎంగిలి చేసి నాకు పెట్టేవారు. కొంత కాలానికి నాకు చదవడం బాగా అభ్యాసం అయింది.

అమ్మగారి దగ్గరకు వెళ్లినప్పుడల్లా కడుపునిండా అన్నం పెట్టేవారు. తినలేమన్నా ఒప్పుకొనేవారు కాదు. కడుపునొప్పి అని చెప్పినా వినకుండా "మనకెక్కడిది కడుపునొప్పి బాబు తినండి", అనేవారు అమ్మ.





తన బిడ్డలు అన్నం తినకపోతే విలవిలలాడి పోయేవారు అమ్మ! ఒకసారి

నేను మా పాపకు జబ్బు చేసినప్పుడు రాత్రి పూట అన్నం తిననని మొక్కుకున్నాను. ఒకరోజు సాయంత్రం అమ్మ దగ్గరకు వెళ్లినప్పుడు అమ్మ కొప్పడి అన్నం తినిపించారు. "అవేం మొక్కులు? అవేం ఉపవాసాలు? ఎవరికైనా నీ కంటే పేదవానికి పది రూపాయలు ఇస్తానని మొక్కుకో! లేకపోతే, సత్యన్నారాయణ బాబు కొండకొస్తాననీ, పది రూపాయలు ఇస్తాననీ మొక్కుకో!" అన్నారు అమ్మ.

ఒకసారి మా ఇల్లు పడిపోయింది. అది లేవదీయడానికి కూడా డబ్బులు లేవు. అమ్మ దగ్గరకెళ్తే, అమ్మ 10/- రూపాయలు, కొబ్బరికాయ ఇచ్చి, ఆ కొబ్బరి కాయకొట్టి, పది రూపాయలు బ్రాహ్మణులకిచ్చి పూజ చేయించుకోమని చెప్పారు.. అలానే పడిపోయిన ఇల్లు తీయకుండానే ఈశాన్యం మూల, ఆకులు లాగివేసి, అక్కడ పూజ చేయించాను. అమ్మ ఆశీర్వచన బలం వలన ఊరిలోని వారు బాగా సహాయం చేశారు - ఇల్లు పూర్తయింది.

ఒకసారి అమ్మతో "అమ్మా! ఎవరో ఒకరు వచ్చి ఏదో ఒకటి ఇస్తున్నారు. పుచ్చుకోవడానికి నాకు మనస్సు అంగీకరించుట లేదు" అన్నాను. అప్పుడమ్మ "ఫర్వాలేదు - కొద్ది కొద్దిగా పుచ్చుకో. రాముడి అనుగ్రహము వలన నీకు ఇవ్వబడుతున్నది. ఆయన అనుగ్రహం లేకుండా నీకు ఎవ్వరూ మంచినీరు కూడా ఇవ్వరు" అన్నారు అమ్మ.

ఒకసారి అమ్మగారు "బాబూ! మీ ఇంటికి ఎప్పుడైనా, ఎవరైనా వస్తే, అన్నం పెట్టు. అన్నం లేకపోతే గంజైనా సరే, పోసిపెట్టు - లేకపోతే మంచి నీరైనా సరే ఇచ్చి పంపించు" అన్నారు. ఆ మర్నాడు మా ఇంటికి ఎవరో ఒకతను వచ్చి, "బాబూ! మూడు రోజుల్నుంచి అన్నం లేదు - మా ప్రాంతమంతా ఉప్పెన వచ్చి కొట్టుకుపోయింది" అంటున్నాడు. అతని ప్రాణాలు కళ్లల్లోనే వున్నాయి. మా ఇంట్లో అన్నం వుంది గానీ, కూర ఏమీ లేదు - ఎవరింటికైనా వెళ్లి రమ్మని మా రాఘవను పంపిస్తుంటే, అతను 'వద్దు బాబూ - కూరా వద్దు ఏమీ వద్దు - ఇంత గంజి పోసుకొని పెట్టుకురండి - చాలు!" అన్నాడు. అలాగే పెట్టాను. అతను భోజనం చేస్తుంటే అమ్మ క్రితం రోజు చెప్పిన మాటే గుర్తుకు వచ్చింది. అతనిని అమ్మగారే పంపారు అనుకొన్నాను.

అమ్మగారు కొంతమంది వస్తే, అసలు దర్శనం కూడా ఇచ్చేవారు కాదు. ఒకసారి అమ్మ దగ్గర నేను భగవద్గీత చదువుతూ కూర్చున్నాను. కొంత సేపటికి ఎవరో క్రొత్తవారు - చాలా ఆభరణాలు ధరించి వున్నారు - కాళ్ళ కడుక్కుని వచ్చి కూర్చున్నారు. "అమ్మా! ఎవరో భక్తులు మిమ్మల్ని చూడాలని వచ్చారు' అన్నాను. అమ్మగారు చేతి సైగ చేశారు నన్ను చదవమని. నేను చదువుతున్నాను. మూడు గంటలై పోయింది. వారు మరలా నన్ను అడిగారు - "అమ్మ మాట్లాడరా?" అని. నేను "మాట్లాడరు" అన్నాను. "ఒకసారి కనిపిస్తే బాగుండును" అన్నారు వారు. ఆ మాట విని అమ్మగారు "వారిని వెళ్లమను బాబూ" అన్నారు. వారు వెళ్లిపోయాక గానీ, అమ్మ బయటకు రాలేదు.

ఒకసారి అమ్మ కుటీరం లోపల తలుపు వేసుకొని పడుకొని వున్నారు. నేను బయట అరుగు మీద పడుకున్నాను. కాసేపటికి నాకు చాలా దాహం వేసింది. 'ఎలాగా? అమ్మగార్ని లేపకూడదు, ఎవరింటికైనా వెల్దామా' అనుకొంటు న్నాను. ఇంతలో అమ్మగారు తలుపు తీసి, గ్లాసుతో నీరు నాకిచ్చి, "బాబూ! మంచి నీళ్ళ త్రాగు" అన్నారు. నేను ఎంతో ఆశ్చర్యపోయాను. మన మనస్సులో తలంపులన్నీ అమ్మకు తెలిసేవి.

ఒకరోజు రాత్రి అమ్మ కలలో కనిపించి చివటం రమ్మని పిలిచారు. తెల్లవారింది. నన్ను చివటం తీసుకు వెళ్లడానికి ఎవ్వరూ లేరు. అప్పుడు నేను ఒక్కడినే నడుచుకొంటూ చివటం వెళ్లాను. అమ్మగారికి నమస్కారం చేసుకొని కూర్చున్నాను. అప్పుడు అమ్మ "బాబూ! నిన్ను ఎవరు తీసుకు వచ్చారు?" అన్నారు. "ఎవరూ తీసుకు రాలేదమ్మా - నేనే నడిచి వచ్చాను" అన్నాను. "నీ చేతులు ఏవీ అన్నారు అమ్మ. కర్రతో నడవడం వలన నా చేతులు కందిపోయాయి. చేతులు పొక్కినవి కూడా. అవి చూసి అమ్మ కంటనీరు పెట్టుకొన్నారు. "బాబూ! ఎప్పుడూ ఇలా నడిచి రాకు" అన్నారు అమ్మ. అమ్మ కరుణకు, ప్రేమకు అవధులు లేవు.

ఒక విజయదశమి రోజు మా రాఘవ, నేను, మా పాప అమ్మ దగ్గరికి వెళ్లాము. అప్పుడు అమ్మ నాకు ఒక పంచె, మా రాఘవకు ఒక చీర, జాకెట్టు, మా పాపకు ఒక గౌను పెట్టి పంపించారు. అమ్మ చూపిన ప్రేమ అంతా ఇంతా కాదు.

వారు. అమ్మగారే స్వయంగా వండేవారు. ఈలోపు ఎవరైనా వస్తే, వాళ్లకు పని అప్పగించి, నా దగ్గర కూచుని భగవద్గీత చదవమనేవారు. అమ్మ అందరినీ ఎంతో ప్రేమగా చేసేవారు. కానీ, ఎవరికి వారికే నన్నే ఎక్కువ ప్రేమగా చూస్తున్నారను కొనేవారు. నా మటకు నాకే, నేనంటే అమ్మకు ఎంత ప్రేమ! అనిపించేది.

ఒకసారి అమ్మగారు పాత కుటీరం దగ్గర ఉండగా, మళయాళ స్వాముల వారి రజతోత్సవ సంచిక చూస్తున్నాను. అమ్మగారు నా దగ్గర కూర్చుని "ఇలా ఇవ్వు బాబు!" అని పుస్తకం తీసుకొన్నారు. మధ్యలో ఒక ఫోటో వద్ద ఆగి చూపించి "ఈమె ఎవరో తెలుసా?" అన్నారు. "నేను ఎరగ నమ్మా!" అన్నాను. అప్పుడమ్మగారు "కురుమద్దాల అనే ఊరు వుంది. అక్కడ మర్రిచెట్టు వుంది. అక్కడ పెద్ద స్థితిలో ఒక అమ్మగారుండేవారు. నీవు ఒకసారి వెళ్లి ఆ చెట్టు దగ్గర ఒక రాత్రి, ఒక పగలు ధ్యానం చేసుకొని రా బాబు" అన్నారు. కానీ, నాకెందుకో మనస్సు అంగీకరించలేదు. "అమ్మగారు అలాగే చెబుతారు. అమ్మగారి కంటే గొప్పవారు ఎవరూ లేరు" అని నాకు అనిపించింది. వెళ్లలేదు. కానీ ఒక నెల రోజుల తర్వాత అకస్మాత్తుగా ప్రేరణ కలిగి, బయల్దేరి వెళ్లాను.

కురుమద్దాలలో మాల పిచ్చమ్మ గారి గుడి వుంది. దానికి సమీపంలో ఒక పెద్ద మర్రిచెట్టు వుంది. దానిలో ఒక తొర్ర వుంది. పిచ్చమ్మగారు చాలా కాలం ఆ మర్రి చెట్టు తొర్రలో కూర్చుని తపస్సు చేశారట. ఆ తొర్రలో అమ్మగారు వున్నట్లే భావిస్తూ, ఎదురుగ్గా ధ్యానానికి కూర్చున్నాను. ఆ పగలంతా ధ్యానం చేశాను. రాత్రి కూడా పూర్తిగా ధ్యానంలోనే వున్నాను. నాకు నిద్ర లేదు - ఆకలి లేదు. తెల్లవారి సూర్యోదయం అయి కొంచెం ఎండతగులుతున్నట్లు అన్పిస్తున్నది. ఇంతలో మర్రి ఆకులపై ఏదో ప్రాకుతున్నట్లు శబ్దం వచ్చింది. కళ్లు విప్పి చూస్తే పాము! ఆ పాము చుట్ట చుట్టుకుని పడగవిప్పి నా నొసలుకి జానెడు దూరంలో నా కళ్ల ఎత్తులోనే ఇలా చూస్తూ వుంది. నేను భయపడ్డాను. ఇక ఇది కరిచేస్తుంది. నేను చచ్చిపోతాను - నా జీవితం ఇక్కడితో అయిపోయింది అనుకున్నాను. అప్పుడు రెండు చేతులు కలిపి అమ్మగారిని తలుచుకొని 'అమ్మా!' అని దణ్ణం పెట్టాను. అంతే! అది తన పడగను ఇలా వెనక్కు తీసుకొని, రింగులా చుట్టుకొని, ఇలా





చక్రంలాగా దొరుకుంటూ, ప్రక్కనున్న చేలలోకి వెళిపోయింది.

తర్వాత పిచ్చమ్మ గారి సమాధిని దర్శించి, అక్కడి వారితో ఇలా చివటం అమ్మ పంపించారు అని చెప్పి, ఆ మర్రి చెట్టు తొర్రలోని మట్టి కొంచెం పట్టుకు వెళ్లాను అని అడిగాను. ఆయన పట్టుకొని వెళ్లమన్నారు, అప్పుడు ఆ మట్టి మూట గట్టుకొని చివటం అమ్మగారి దగ్గరకు వచ్చాను. జరిగినదంతా చెప్పాను. ఇలా పెద్ద పాము కనబడింది. నాకు చాలా భయం వేసిందమ్మా అని చెప్పాను. అమ్మగారు నవ్వుకున్నారు. నవ్వుకొని "భయం వేసిందా బాబా! నన్ను లాగా ఎందుకు చూడలేవు నువ్వు?" అన్నారు. అమ్మ గారు తమ కుటీరంలోని మట్టి కూడా కొంచెం ఇచ్చి, రెండూ కలిపి అరుగువేసుకొని ధ్యానం చేసుకోమని చెప్పారు. అలాగే చేశాను.

రాత్రిళ్లు భోజనాలు అయ్యాక అమ్మగారి కాళ్లకు నూనె రాసి మర్దన చేసేవారము. ఈ సేవ రోజూ ఎవరో ఒకరు చేసేవారు. బాగా పరిచయం వున్న వాళ్లతో అమ్మగారు అలా చేయించుకొనేవారు. ఈ పాదసేవ ఎక్కువగా లక్ష్మిగారే చేసేవారు. ఒకనాటి రాత్రి అమ్మగారి కాళ్లు నా కాళ్ల మీద పెట్టి నూనె రాసి మర్దన చేసేవాడిని. అప్పుడు అమ్మగారు చంటి పిల్లలాగా వుండేవారు. చంటిపిల్ల అనే భావనే వుండేది. మనం కూడా చంటిపిల్లల్లా అయిపోయేవాళ్లం. ఆమె మన ముందు తిరుగుతున్నప్పుడు చంటి పిల్లలా అన్పిస్తారు. మనం చంటిపిల్లలం అనే భావమే కలిగేది. వేరే భావమే వచ్చేది కాదు.

ఒకసారి అమ్మగారు పాత కుటీరంలో వుండగా నేను అమ్మ ప్రక్కగా కూర్చుని వున్నాను. అమ్మగారు ఒక కాలు చాచి, నూనె ఇచ్చారు. మర్దన చేయ మంటున్నారు కాబోలు అని, ఆ నూనె తీసుకొని రాయడం ప్రారంభించాను. అప్పుడు ఉదయం 11 గం॥ అవుతుంది. మధ్యాహ్నం రెండు గంటలైనా అమ్మ అలా మర్దన చేయించుకొంటూనే వున్నారు. 'ఇక చాలు' అంటారేమోనని నేను చూస్తున్నాను. కాని, ఎంతసేపటికి 'చాలు' అని అనడం లేదు అమ్మ. నాకు శరీరం అంతా చెమటలు పట్టేసి, స్నానం చేసినట్లుగా ఒళ్లంతా తడిచిపోయింది. ఇక చాలు అంటారేమోనని చూస్తున్నాను. అలా కొంతసేపయ్యాక, నా అవస్థ చూసి, నవ్వుకొని, "ఇక చాలులే బాబు" అన్నారు. నేను చేతులు కడుక్కోవడానికి





వెళ్తుంటే అమ్మ వారించి, ఆ చేతులు తలకు ఒంటికి రాసుకోమని చెప్పారు.

తర్వాత కాస్సేపు విశ్రాంతి తీసుకోమన్నారు. నేను నిద్ర లేచేసరికి వేడి వేడిగా అట్లు వేసుకొని, టీ పట్టుకొని ఊదుకొంటూ తెచ్చి తినమన్నారు.

నాకు అమ్మ ఏదైనా ఒక గిన్నె ఇస్తే బాగుండును, అన్నం అందులో తినాలి అని మనస్సులో వుండేది. అమ్మను అడుగుదామనుకొన్నాను - కానీ, అడగలేదు. ఒకరోజు అమ్మ "అన్నం దేంట్లో తింటున్నావు?" అన్నారు. "మామూలు గిన్నెలోనే" అన్నాను. "నేను పాత్ర ఇస్తాను. తీసికెళ్ళి అందులో తిను" అన్నారు. ఒక మట్టి పాత్ర ఇచ్చారు. అప్పటి నుంచి అందులోనే భోజనం చేస్తున్నాను. "ధ్యానం చేసేవారు ఇతరులు తినే గిన్నెల్లో తినకూడదు" అనేవారు అమ్మ.

దువ్వ కంసాల ఒకరు అమ్మగారి మీద ఒక శతకం వ్రాశారు. ఆ ప్రతి ఇప్పుడు శాంతమ్మగారి వద్ద నున్నది.

అమ్మగారు ఎల్లప్పుడూ ఎక్కువగా రాత్రిపూట ధ్యానం చేసుకోమని చెప్పేవారు. నాకు రాత్రులు భయం వేసేది. "రాత్రలు నాకు భయంగా వుంటుంది అమ్మా" అన్నాను. అప్పుడు అమ్మ "ఫరవాలేదు - నేను ఎల్లప్పుడూ నీ వెంట ఉన్నానని అనుకో - అనుకొని ధ్యానం చేసుకో" అన్నారు. "అదే మనది - ఇదంతా ఏమీలేదు - ఎంత ధ్యానం చేస్తే అంత మంచిది" అన్నారు.

అమ్మగారు నిర్యాణం చెందిన తర్వాత కూడా నాతోనే ఉన్నారన్న అనుభవం ప్రసాదించారు. నేను రోజూ గిన్నెలో అన్నం పెట్టి కృష్ణుడి ఫోటో వద్ద నివేదన పెట్టేవాడిని. కానీ, కృష్ణుడి ఫోటోలో అమ్మగారి దర్శనమయ్యేది. అమ్మగారు ఆ అన్నం చేయిపెట్టి తీసుకొంటున్నట్లుగా చాలాసార్లు కనిపించింది. ఇలా 40 రోజులు జరిగింది.

ఒక వైశాఖ పౌర్ణమికి గోస్తనీ నది ఒడ్డున వున్న పరుచూరి వెంకట్రామయ్య గారి సమాధి వద్దకు అమ్మ వెళ్లారు. అక్కడ పూజా కార్య క్రమాలు, భోజనాలు జరిగాయి. తర్వాత అమ్మను ఒక రిక్షాలో కూర్చో బెట్టుకొని, బ్రహ్మంగారు, నాగయ్య, నేనూ, చిట్టి రాజు గారు మొదలైన వారమంతా "హరే రామ, హరే రామ" భజన చేసుకొంటూ అమ్మగార్ని కుటీరానికి తీసుక వచ్చాము.





ఒకసారి అమ్మగారి దగ్గర గీత చదువుతూంటే అక్కడ కూర్చున్నవారు

కొందరు కబుర్లు చెప్పుకొంటున్నారు. "దేవుడి దగ్గర కూడ ఈ కబుర్లెందుకు? అలా కూర్చోండి అన్నారు అమ్మగారు. అయినా వారు మానలేదు. వాళ్లు వెళ్లిపోయాక, పెద్దవాళ్లు పాపంతో కూడిన అల్లరి చేస్తారు - పిల్లలు ఏం అల్లరి చేస్తారు? పాపం వారికి ఒక అరటి పండు ముక్క చేతిలో పెడితే, వెళ్లిపోతారు' అన్నారు అమ్మ. ఇతరుల గురించి అవి, ఇవి మాట్లాడుకోవడం వృథా కాలక్షేపమే కాదు, పాపం అని అమ్మ బోధిస్తున్నారు.

ఒకసారి అమ్మగారు వారి గురువుగారి ఫొటో తెచ్చి పెట్టి, నన్ను పూజ చేయమన్నారు. అమ్మగారుండగా ఇంకా ఈ ఫొటోలకు పూజ చేయమంటున్నారేమిటో అనుకొంటున్నాను. ఇంతలో ఇలా అన్నారు - "అన్నింటిలోను రాముణ్ని చూడాలి బాబు" అన్నారు. "మీ కంటె ఇంకెవరమ్మా ఎక్కువ?" అన్నాను. "అందరి కంటే రాముడెక్కువ" అన్నారు.

ఒకసారి అమ్మ దగ్గర నేను, ఇంకా కొంతమంది భక్తులు కూచుని వున్నారు. అందులో ఒకామె "సత్యం! అమ్మగారు నీకు చెప్పినట్లు మాకు ఏమీ చెప్పటం లేదు" అన్నది. అప్పుడు అమ్మగారు "మీరు వడ్డీ వ్యాపారాలు చేసి, గట్టిగా మూటలు కట్టండే! - మీకు నేను చెబుతూ వుంటాను"అన్నారు.

మా బాబుకు అమ్మగారు అన్నప్రాశన చేసి రామకృష్ణ అని పేరు పెట్టారు. అన్ని వస్తువులు అక్కడ పెట్టి, వాటిని తీయమని బాబుని విడిచి పెట్టారు. వాడు అన్నింటిని గెంటి వేసి, "హనుమాన్ చాలీసా" తీశాడు. అమ్మగారు నవ్వుతూ "నీవు భక్తుడవు - నీవు భక్తుడవే" అన్నారు.

ఒకసారి అమ్మ నాకు, మా కుటుంబ సభ్యులందరికీ బట్టలు పంపించారు. అమ్మ దగ్గర కెళ్లి "నాకు బట్టలెందుకమ్మా పెట్టారు?" అన్నాను. 'ఎప్పుడూ నీకు ఎవరో ఒకరు బట్టలు పెడతారు బాబు, అందుకని ముందు నేను పెట్టాను' అన్నారు అమ్మ. ఇప్పటి వరకు కూడ నేనుగా బట్టలు కొనుక్కొంది లేదు - అమ్మే జరిపిస్తున్నారు."

ఒకసారి ఒక ఆశ్రమం వారు నాకు పదివేల రూపాయలు ఇస్తామనీ,





వచ్చి వారి ఆశ్రమంలో వుండమనీ అడిగారు. నేను ఎటూ తేల్చుకోలేక అమ్మ

గారిని అడిగాను. అప్పుడు నేనూ, బ్రహ్మం అమ్మగారి కాళ్లకు నూనె రాస్తూ వున్నాము. అమ్మగారు కాసేపు వుండి "బాబూ! నీకు వెళదామని ఉందా?" అన్నారు. బ్రహ్మంగారు "వెళితేనే బాగుంటుందమ్మా! పది వేలంటే మాటలా?" అన్నారు. "ఏమోనమ్మా! నాకు ఏం తెలియడం లేదు. మిమ్మల్ని అడుగుతున్నాను' ' అన్నాను నేను. అప్పుడమ్మ "వద్దు బాబూ! ఆశ్రమాల సంగతి నాకు బాగా తెలుసు. పదివేలు ఇచ్చిన తర్వాత ఇలా అంటారు - వాళ్లు వచ్చారు. కాస్సేపు వాళ్ల దగ్గర చదువు - వీరు వచ్చారు కాసేపు వీరి దగ్గర కూర్చో - ఇక్కడ లెగు - అక్కడ కూచో - అంటూ నీ మీద పెత్తనం చేస్తారు. వాళ్ల అధీనంలో ఉండిపోవాలి. అమ్మా మాయాదేవీ! పిల్లవాడి దగ్గరకు రాకమ్మా! రాకమ్మా! కొంచెం ఏదో రామా! రామా అనుకుంటున్నాడు - అనుకోనీ అమ్మా! వాణ్ని పాడు చేయకమ్మా - మాయా! మాయా!" అంటూ "బాబూ పోతన గారిని చూశావా? వాళ్లు ఎంత భ్రాంతులు పెట్టినా, అమ్మను కూడా అమ్మమని అడిగినా, మాయను దగ్గరకు రానిచ్చారా? సరస్వతీ దేవి ఏడ్చిందట! "అమ్మా ఏడవకు - నిన్ను అమ్ముతాననుకొన్నావా?" అన్నాడట ఆయన. "వద్దు బాబూ! ఆ మాయల్లో పడకు" అన్నారు. "ఏం అలా చేస్తావా?" అన్నారు. "నేను వెళ్లనమ్మా - ఆ డబ్బూ వద్దు - ఏమీ వద్దు" అన్నాను నేను.

ఆ తర్వాత కొంతకాలానికి మా అబ్బాయి స్వర్గస్థుడయ్యాడు. తర్వాత అమ్మగారి దగ్గరకు వెళ్లాను. నన్ను చూసి అమ్మగారు ఒక కొబ్బరికాయ ఇచ్చి కొట్టమన్నారు. నేను కొట్టాను. తర్వాత అమ్మ ఇలా అన్నారు. "అభి మన్యుడి కథ తెలుసా నీకు? నాకు తెలియదమ్మా చెప్పండి" అన్నాను. "అభిమన్యుడు చచ్చి పోయిన తర్వాత అర్జునుడు ఏడుస్తుంటే, కృష్ణుడు చూచి, నేను అభిమన్యుడి దగ్గరకు తీసుకొని వెళతానురా! అని ఆ లోకానికి తీసుకొని వెళ్లాడట. అక్కడ అభిమన్యుడు పిల్లలతో ఆడుకొంటున్నాడట. అప్పుడు అర్జునుడు చూసి గబగబా పరిగెత్తుకెళ్లి అభిమన్యుడి చెయ్యి పట్టుకొని 'బాబూ! నేను మీ తండ్రిని - అర్జునుడిని - నన్ను గుర్తుపట్టలేదా?' అంటూ ఏడ్చాడట. "నువ్వు నాకు ఏ జన్మలో తండ్రివి? నాకు చాలా జన్మలు గడిచినవి. తండ్రి ఎవరు? కొడుకు

ఏమయ్యా? నీవు ఏమేమి నాకు తెలియదు" అన్నాడు అభిమన్యుడు. అప్పుడు అర్జునుడు విచారం అంతాపోయి, ఇదంతా ఒట్టి భ్రమే అనుకొని వెనక్కి తిరిగి వచ్చాడట. అంతే బాబూ! ఏం బాబూ, బాబు పోయాడని విచారంగా ఉన్నావా?' అన్నారు అమ్మ. "లేదమ్మా! మీ అనుగ్రహం వల్ల నాకు ఏ దుఃఖము లేదమ్మా" అన్నాను. "గతసూనగతాసూంశ్చ నాను శోచంతి పండితాః" అన్న వాక్యాన్ని ఆచరించగలిగే వివేకాన్ని కలిగించటమే అమ్మ మహిమ!

ఒకసారి భోజనాలు అయిన తర్వాత కొబ్బరి నూనె తెమ్మని ఒక పాపకు రూ. 5/- ఇచ్చి, ఎవరింటికో పంపారు. ఆ పాప వెళ్ళి వచ్చి, "అమ్మా! రూ. 5-50 పైసలట - ఇంకొక అర్ధరూపాయి ఇవ్వండి" అన్నది. ఇంకొక అర్ధరూపాయి ఇవ్వండి" అన్నది. ఇంకొక ఇల్లు ఏదో చెప్పి "అక్కడకు వెళ్లు - అక్కడ అయిదు రూపాయలే" అన్నది ఒకామె. అప్పుడు ఆ పాప ఆమె చెప్పిన ఇంటికి వెళ్లి తిరిగి వచ్చి "అమ్మా! అక్కడ లేదట!" అన్నది. ముందు చెప్పిన ఇంటికి వెళ్లి పట్టుక రామ్మా అని అమ్మ రూ. 5-50 పైసలు ఇచ్చినారు. ఆ పాప వెళ్లి మరలా తిరిగి వచ్చి, "అమ్మా! ఆరు రూపాయలైతే పోస్తారట" అన్నది. అమ్మగారు రూ.6/- ఇచ్చి పంపారు. ఆ పాప మరలా వెంటనే తిరిగి వచ్చి, "అమ్మా! పోయనంటున్నారమ్మా! లేదట" అన్నది. అమ్మగారు "రామ! రామ!" అనుకొని ఇలా అన్నారు. "ఈ డబ్బులన్నీ పోగుచేసి హాస్పటల్‌లో పోసి వస్తారు" అన్నారు.

తెనాలి వాస్తవ్యులు బదరీనాథ్‌గారు చిన్నతనం నుంచీ అమ్మ సన్నిధిలోనే పెరిగారని చెప్పవచ్చు. అమ్మ దగ్గర వీరికి చాలా చనువు. అమ్మ గురించీ, అమ్మతో వారికి గల అనుభవాలనూ వారిలా చెప్తున్నారు.

"నేనెప్పుడూ అమ్మకు సాష్టాంగ నమస్కారం చేసుకొనే వాడిని. ఒకసారి అమ్మ చుట్టూ చాలా మంది జనం వుండటం వలన సాష్టాంగ నమస్కారము పెట్టుకోవడానికి కుదరలేదు. అమ్మ అవకాశం ఇవ్వలేదని నొచ్చుకొన్నాను. మరలా ఇంకోసారి వెళ్ళినప్పుడు కూడా అలానే జరిగింది. సాష్టాంగ నమస్కారం చేసుకోవడానికి వీలుకాలేదు. అమ్మ నాకా అవకాశం ఇవ్వలేదని అమ్మ మీద చాలా కోపం వచ్చింది. అమ్మకు చెప్పకుండా వచ్చేశాను. ఆ రోజు రాత్రి కలలో





అమ్మగారి కుటీరం దగ్గర చాలా అలంకరణ చేసి వుంది. చాలా మంది భక్తులు

వున్నారు. అమ్మ ఇలా అన్నారు "ఇంకా చాలా మంది వచ్చేస్తారు బాబా - అలాంటివి పట్టించుకోకూడదు."

నేను ధ్యానం చేసుకొనేటప్పుడు నాకిష్టమైన ప్రకారం ఏదో ఒక దిక్కుకు తిరిగి కూర్చునే వాడిని. కానీ, ధ్యానం చేసేటప్పుడు తూర్పు లేదా ఉత్తర ముఖంగా కూర్చుని చేయాలని ఎవరో చెప్పారు. అప్పుడు ఆ సందిగ్ధ స్థితిలో అమ్మగారు కలలో కన్పించి "ధ్యానం ఎటువైపు తిరిగి కూర్చుని చేసినా, ఏ చోట చేసినా ఫర్వాలేదు. మనసు నిలిచే చోటు ఏదైతే, అదే ధ్యానం చేసే చోటు" అని చెప్పారు.

ఈ ఊరే చిత్రమైనది. ప్రతి ఊళ్లో అప్పువున్న వాళ్లు ఎక్కువ. కానీ, ఈ ఊళ్లో ఏ అప్పులూ లేనివాళ్లు ఎక్కువ వుంటారు. (ఎక్కడ మహాత్ములు వుంటారో ఆ ప్రాంతం సుభిక్షంగా వుంటుందని ప్రతీతి!) ప్రతివారు తమకు పండిన పంటలో ఎంతో కొంత భాగం అమ్మకు సమర్పించుకుంటారు. ఈ ప్రాంతంలో సాధకులు ఎక్కువ మంది కనిపిస్తారు.

అమ్మ ఎప్పుడూ శ్రీ రాముడి గురించి చెప్పేవారు. సద్గ్రంథాలు చదివించే వారు. అందరికీ ధ్యానం చేసుకోమని చెప్పేవారు. అక్షరాస్యులేమిటి, నిరక్షరాస్యులేమిటి, ఇంట్లో పనులు చేసుకునే అతి సాధారణమైన ఆడవారి దగ్గర నుంచీ, పొలాల్లో కాయకష్టం చేసేవారి దాకా కూడా ప్రతి రోజూ ఉదయాన్నే మూడు, నాలుగు గంటలు అవలీలగా ధ్యానంలో కూర్చునేవారు చాలా మంది వున్నారు. దాదాపు ప్రతి ఇంటికీ ఒకరు ధ్యానం చేసేవారు కన్పిస్తారంటే అది అమ్మ బోధ వల్లనే!

అమ్మకు తాము బయటకు వ్యక్తం కావడము ఇతరులు తమ గురించి వ్యక్తం చేయటము ససేమిరా ఇష్టం వుండేది కాదు. అమ్మ దేనినీ లీలలాగా ఒక అద్భుతం లాగా జరుగనిచ్చేవారు కాదు. ఏదైనా అద్భుతం లాగా జరుగుతుందని అనిపించినప్పుడు, ఆ విషయాన్ని నిగ్రహించి, మూడు నాలుగు రోజుల్లో జరిగేటట్లు చేసి, అది సహజంగా జరిగినట్లు తోచేలాగా చేసేవారు. అమ్మ వద్ద ఏదైనా కోరిక కోరి నప్పుడు 'అవుతుంది' అని కూడా ఎప్పుడూ అనేవారు కాదు. "రాముడు





మేలు చేసాడులే బాబా" అనేవారు. ప్రతి దానిని తన పరంగాకాక, శ్రీరాముని

పరంగా చెప్పేవారు."

అసలైన మహాత్ములు ఎప్పుడూ తమ శక్తిని నిగూఢంగా వుంచుతారు. జనం వేలం వెర్రిగా తమ చుట్టూ మూగడం వారికి ఇష్టం వుండదు. విభూతి, కుంకుమ సృష్టించడంలాంటి, చిల్లర మహిమలెప్పుడూ చేయరు. ఎంతగా దాచిపెట్టాలని ప్రయత్నించినా సూర్యుని తేజస్సు, కస్తూరి సువాసన ఎలా దాగి వుండలేవో అలానే మహాత్ముల మహిమ కూడ అప్పుడప్పుడు వెల్లడి అవుతూ వుంటుంది. వారి లీలలు ప్రయత్న పూర్వకంగా చూపించేవి గాక, సహజాతి సహజంగా వాటంతటవే జరుగుతుంటాయి. వారు సర్వసిద్ధులై వుండి కూడా సాధకుల వలె వ్యవహరిస్తూ వుంటారు. భక్తుల మీది కరుణతో వారిని ఆపదలలో నుంచి కాపాడినప్పటికీ అది తాము చేయలేదనీ, భగవంతుడే చేసాడనీ అంటారు. శ్రీ శిరిడీ సాయిబాబా కూడా సర్వానికీ కర్త భగవంతుడే అనీ "తాము "అల్లా" యొక్క "సేవకులు మాత్రమేననీ" అనే వారు. వారు దేనికీ కర్తృత్వం వహించరు. కాకపోతే సన్నిహిత భక్తులతో మాత్రం, వారి భక్తి శ్రద్ధలను ఇనుమడింపచేయడానికి గానూ తమ నిజస్వరూప మేమిటో సూచన ప్రాయంగా ఒకటి రెండు మాటల్లో తెలియబరుస్తూ వుంటారు.

అమ్మ దగ్గర సన్నిహితంగా వుండే లక్ష్మిగారు ఎప్పుడన్నా "ఇంటికి వెళ్లి దేవుడి దగ్గర దీపం వెలిగించి దండం పెట్టుకొని వస్తానమ్మా!" అంటే "దీనికెట్టు కున్నావు కదే!" అనేవారట! అలానే ఒకసారి "వెంకయ్య స్వామిని చూడలేదు" అంటే, "దీన్నే చూస్తున్నారు కదే! దీన్ని చూస్తున్నారు కదే!" అన్నారట!

ఈ దేహమే తామన్న భ్రాంతి ఆవగింజంతం కూడా లేదు కాబట్టే అమ్మ ఎప్పుడు తన గురించి ప్రస్తావించినా "నేను" అనకుండా "ఇది" అనే వారు. అంటే ఆ దేహాన్ని, దేహంతో జరిగే కార్యకలాపాల్ని సాక్షీభూతంగా అనుక్షణం చూస్తూ వుండేవారన్న మాట! అందుచేతనే అమ్మ పొరపాటున కూడా 'నేను' అనే మాట వాడే వారు కాదు.

చివటం అమ్మ సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన లక్ష్మక్క అమ్మ





గురించి ఇలా చెప్పారు. "అమ్మ మౌనంలో చూపే కరుణ మాటల కంటె వేయి

రెట్లు బలమైనది". అమ్మ లక్ష్మిగారిని వివాహం చేసుకోవద్దనీ, ఆధ్యాత్మిక సాధనలో గడపమనీ ఆదేశించారు. అమ్మ ఆజ్ఞ మేరకు ఆమె వివాహం చేసుకోకుండగా, ఈ నాటికీ అమ్మ సమాధిని సేవిస్తూ, అమ్మ దర్శనానికి వచ్చే భక్తులను ప్రేమతో ఆదరిస్తూ, అమ్మ స్మరణలో తమ జీవితాన్ని సార్థకం చేసుకొంటున్నారు. అమ్మ గురించి ఏమైనా చెప్పమని అడిగిన నాతో తమ జ్ఞాపకాలను ఇలా చెప్పారు -

"అమ్మను వదిలిపెట్టి వుండేవాళ్లము కాదు. అసలు వదిలి పెట్టి వుండబుద్ధి అయ్యేది కాదు. అమ్మ దగ్గర కూర్చుంటే ఏదో చెప్పలేని ఆనందంగా వుండేది. ఆమెనే చూడాలని, ఆమె దగ్గరే వుండాలనీ అన్పించేది. అమ్మ ఎదురుగా కూర్చుని పుస్తకం చదువుతూ కూడా మాటి మాటికీ అమ్మను చూసుకొనే వాళ్లం! అప్పుడు అమ్మ "అదేమిటే అమ్మా, అక్కడ చదవకుండా ఇక్కడ చూస్తావు?" అనేవారు.

ఇప్పటికీ కూడా అమ్మలేరు అనే స్ఫురణ వుండదు. అమ్మ వున్నప్పుడు మాకు ఎలా వుండేదో ఇప్పుడు కూడా అలాగే వుంటుంది. ఏ సమయానికి అమ్మకు ఏ సేవ చేసేవాళ్లమో, ఇప్పుడు కూడా అమ్మ వున్నారనే భావంతో అలాగే చేస్తున్నాము. అమ్మ ఎప్పుడూ ఇక్కడే తిరుగుతున్నట్లు అనిపిస్తుంటుంది.

మహాత్ములు, సాధువులు వచ్చినా, మామూలు మనుషులు వచ్చినా అమ్మ అందరినీ ఒకేలాగా చూసేవారు. ఎవరినీ ప్రత్యేకంగా చూసేవారు కాదు. మామూలు మనుషులకు చేసినట్లే మర్యాదలు చేసేవారు.

అమ్మ గజ్జి పట్టిన కుక్కలకు అరిసెలు వండించి తినిపించేవారు. వేప నూనె తెప్పించి రాసేవారు. ఒకసారి ఒక కుక్క చనిపోయింది. అప్పుడు అమ్మ దాని మృత దేహాన్ని ఊరు బయటకు తీసుకవెళ్లి, అక్కడ భూస్థాపితం చేసి, అగరు వత్తులు వెలిగించి, కొబ్బరికాయ కొట్టి తిరిగి వచ్చారు.

అమ్మ ఎప్పుడూ "నేను" అని గానీ, "నాది" అని గానీ అనేవారు కాదు. తన దేహాన్ని సూచించేటప్పుడు "ఇది" అని అనేవారు. "ఇక్కడి వస్తువు ఏమైం దమ్మా?" అంటే "నేను తీశాను" అనకుండా "ఇదే తీసిందే" అని అనేవారు.





"నేను తిన్నాను" అనకుండా "ఇదే తిన్నదే" అనేవారు. అమ్మ ఎవరితోనూ ఎక్కువగా

మాట్లాడేవారు కాదు. ఒకటి రెండు మాటలలోనే సమాధానం చెప్పేవారు. అరుదుగా ఒక చిన్న వాక్యంలో సమాధానం చెప్పేవారు.

అమ్మ ఎప్పుడూ పకపక నవ్వేవారు కాదు. పళ్ళు బయటకు కనబడేవి కాదు. అలా పళ్ళు బయటకు కనబడకుండా ముసిముసిగా నవ్వేవారు.

ఏదైనా తాను చేస్తున్నట్లు అమ్మకు వ్యక్తం కావటం ఇష్టం వుండేది కాదు. అలా వ్యక్తం కానిచ్చేవారు కాదు.

చివరి రోజులలో "అమ్మా! మీరు వెళ్లిపోతే మాకు ఎలాగమ్మా? అంటే, అమ్మ "భగవద్గీత ఉంది కదే!" అన్నారు.

"అమ్మ భగవద్గీతను మించిపోయింది" అంటారు ఒక మహాత్ములు. "అమ్మ సన్నిధి కాశి - అమ్మనెప్పుడూ విడిచిపెట్టకు. నువ్వింక ఎవరి దగ్గరకు వెళ్లనవసరం లేదు" అని "భారతదేశంలో ఉన్న గొప్ప మహాత్ములలో ఉన్న ఒకరు ఆ సంగతి ఎప్పుడు మరచిపోవద్దు!" అని చెప్పారు.

★★★





## అధ్యాయం - 2

## మహాత్ములతో అమ్మ

"జ్ఞానిని జ్ఞానియే గుర్తు పట్టగలడు" అంటారు రమణ మహర్షి. పూర్ణ జ్ఞాన స్వరూపులైన అమ్మ గురించి, ఇతర మహాత్ములు ఏమన్నారో అన్నదే మనకు కొలబద్ద. ఎందుకంటే శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారు అన్నట్లు మనం అజ్ఞులం కనుక, మన నిర్ణయాలు కూడ లోప భూయిష్టముగానే ఉంటాయి. కాబట్టి అమ్మతో ఇతర మహాత్ములు ఎలా వ్యవహరించేవారో, అమ్మ గురించి వారేమన్నారో తెలుసుకోవటం అవసరం. అంతే కాదు, మహాత్ములందరు ఒకరితో ఒకరు ఏకత్వభావాన్ని కలిగి ఉంటారు. శిరిడీలో సాయిబాబాకు ఒక రూపాయి దక్షిణ ఇవ్వలేదే అని బాధ పడుతున్న కార్తిక్‌తో "నా రూపాయి నాకివ్వు" అని అడిగి నాశిక్‌లో నరసింగ్ మహరాజ్ స్వీకరించారు. అలాగే, సాయి ముస్లిమ్ అన్న సంకోచంతో వారికి నమస్కరించక, ఉపాసనీ బాబా వద్దకు వచ్చి నమస్కరించబోతే ఆయన కాళ్ళు వెనక్కు తీసుకున్నారు. మహాత్ములు ఒకరి భక్తులను ఇంకొకరు ఎంతో ప్రేమతో ఆదరిస్తారు. ఒకసారి సాయి బాబా వద్దకు గురుసిద్ధారూఢుల శిష్యులు వస్తే, "ఈ రోజు ఒక మహాత్ముని దర్బారు నుండి ఒకడిక్కడకు వచ్చారు" అంటూ బాబా అందరకూ పండ్లు, మిఠాయిలు కొని పంచిపెట్టారు. అలానే బాబా తమ శిష్యులను ఇతర మహాత్ముల దర్శనానికి పంపేవారు. వీరందరూ ఏక కుటుంబముగా వ్యవహరించేవారు. అక్కల్కోట స్వామి, సాయిబాబా, తాజుద్దీన్‌బాబా, గజానన్ మహరాజ్, ధునీవాలాదాదాగార్లు - వీరిలో ముఖ్యులు. శ్రీ చివటం అమ్మ కూడా తమ సమకాలీన మహాత్ములతో ఏక కుటుంబీకులుగా వ్యవహరించేవారు. వీరందరూ శరీరాలు వేరైనా, వారి కార్యకలాపాలు వేరైనా అంతర్యంలో ఏకత్వం కలిగి వుండేవారు.



అవధూత శ్రీ చివటం అమ్మ

## అమ్మ - మాస్టర్ గారు

శ్రీ భరద్వాజ మాస్టర్‌గారు 1963లో బాబా వద్ద దివ్యానుభూతిని పొందిన తర్వాత, బాబాను సశరీరులుగా చూడలేకపోయాననే అన్న బాధ పడేవారు. కనీసం ఇప్పుడు జీవించి వున్న పూర్ణ పురుషుల దర్శన ఆశీస్సులైనా ప్రసాదించమని బాబాను ప్రార్థించారు. అప్పటి నుంచి వారికి అనేక మంది మహాత్ముల దర్శన, ఆశీస్సులు లభించాయి. అట్టి వారిలో శ్రీ చివటం అమ్మ ఒకరు.

కానీ, నిశితంగా గమనిస్తే, మాస్టర్‌గారు మనకు మార్గదర్శకులుగా వుండటం కోసమే, సాధకుని వలె వ్యవహరించే వారని అర్థమౌతుంది. నిజమైన సత్పురుషుడు సిద్ధుడై వుండి కూడా సాధకుడైనట్లే వ్యవహరించాలని శాస్త్రం. వారు తమ అంతిమ శ్వాస వరకూ బాబా యొక్క సచ్ఛిష్యులుగానే వ్యవహరించారు. శిష్యుని కుండవలసిన నమ్రత, నిరహంకారము వారిలో స్పష్టంగా గోచరించేవి. కానీ, నిజానికి వారి స్థితి ఎవరికీ అంతు పట్టనిది.

చివటం అమ్మ సాయిబాబాను "పెద్దబాబు" అనీ, మాస్టర్‌గారిని "చినబాబు" అనీ అనేవారు. 'సాయి బాబాకా బేటా' అన్నారు, శ్రీ గుణవతి మహరాజ్. శ్రీ గోపాల స్వామి, 'భరద్వాజ్ భగవాన్‌కీ సమాన్ హై' అన్నారు. "శ్రీ సాయిని ప్రతి ఉచ్ఛ్వాస, నిశ్వాసలలో నింపుకున్న ధన్యజీవి" అన్నారు శ్రీ పూర్ణానంద స్వామి. "పెద్దవారు - పెద్దవారు - చాలా పెద్దవారు" అన్నారు శ్రీ నాంపల్లి బాబా గారు. "ఋషి, ఋషి" అన్నారు పరాడ్‌సింగా అనసూయ మాత. శ్రీ రాఖాడీ బాబా. "నీవు ఎక్కడ నమస్కరిస్తే అక్కడ సాయినాథుని పాదాలే వుంటాయి" అన్నారు.

మాస్టర్‌గారి నిర్యాణానంతరం రామారావు అనే శిష్యుడు విజయవాడలోని ఒక అవధూతను కలిసి, మాస్టర్‌గారి గురించి ప్రశ్నించగా, ఆయన సైగలతో "మూడు ముఖాలు కలిగిన దత్త మూర్తే శ్రీ మాస్టర్" అని చెప్పారు.

అంతేగాక సం॥ 1969లోనే శ్రీ పాకల పాటి గురువు గారికి స్వప్నంలో





శంఖు-చక్ర ధారియైన విష్ణుమూర్తిగా కన్పించారు. ఇంకా ఎందరో భక్తులకు కల్గిన,

కల్గుతున్న ఎన్నెన్నో అనుభవాలు కూడా వారు గొప్ప మహాత్ములని ఋజువు చేస్తున్నాయి. అంతేగాక, వారి రచనలు చదివినా, వారి బోధలు విన్నా, వారు ఆచరించిన అతి నిరాడంబరమైన, ధర్మ బద్ధమైన జీవిత విధానాన్ని గమనించినా, మనకు గురుతత్వమే వారి రూపంలో అవతరించిన దన్పిస్తుంది. కాబట్టి వారు సాక్షాత్తూ దత్తాత్రేయ  స్వరూపులు. అట్టి మహనీయులైన మాస్టర్‌గారు అమ్మను మొట్టమొదటిసారిగా దర్శించిన కమనీయ ఘట్టం ఎలా ఉందో చూద్దాం!

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్‌గారు 1973 సెప్టెంబర్‌లో  ఏలూరుకి స్పాట్ వాల్యుయేషన్‌కు వెళ్ళారు. అక్కడ చివటం అమ్మ గురించి మొట్ట మొదటి సారిగా తెలుసుకొని, ఒక ఆదివారం నాడు అమ్మ దర్శనానికై బయలుదేరారు. ఇద్దరు ముగ్గురు మిత్రులు కూడా అమ్మ దర్శనం చేసుకోవడానికి ఉత్సాహం చూపడంతో వారిని కూడా వెంటబెట్టుకొని, తణుకు చేరి, అక్కడ నుంచి కాలి నడకన చివటం బయలుదేరారు. చివటం ఊరి పొలిమేరకు చేరేసరికి, అమ్మ రోడ్డు మీద ఎదురుగా వస్తూ వీరికి కన్పించారు. దిగంబరియైన ఆమెను అమ్మగా గుర్తించిన మాస్టర్‌గారు నమస్కరించు కోవడానికి అమ్మను సమీపిస్తుండగా, అమ్మయే స్వయంగా, ఆ రోడ్డు మీద సాష్టాంగపడి మాస్టర్ గారికి నమస్కారం చేశారు. అమ్మ లేవగానే మాస్టర్‌గారు అమ్మ చేతికి పూవులు, పండ్లు సమర్పించుకొని సాష్టాంగ నమస్కారం చేసుకున్నారు. ఈ సంఘటన గూర్చి అడిగిన వారితో మాస్టర్ గారన్నారు - "అందరి లోనూ ఆ పరమాత్మను దర్శించే అవధూతలు ఎందుకలా చేస్తారో చెప్పడం కష్టం. ఇందులో మన గొప్పదనం వుందనుకోవడం అవివేకం" అన్నారు.

మాస్టర్‌గారు మళ్ళీ 1980 నవంబరులో అమ్మ దర్శనార్థం వెళ్ళారు. ఈ సారి వారు అమ్మ వద్ద మూడు రోజులున్నారు. మాస్టర్‌గారి రాక గురించి తెలుసు కున్న అమ్మ చాలా సంబరపడి పోయారు. ఆనాటి సంఘటనలను గూర్చి ఆ గ్రామస్థులిలా చెప్పారు : " మాస్టర్‌గారు వస్తున్నారన్న విషయం విన్న అమ్మ ఆనందానికి అవధులు లేవు. "బాబు వస్తున్నాడే! బాబు వస్తున్నారు" అంటూ ఎంతో హడావుడి చేశారు. కుటీరానికీ, రామాలయానికీ సున్నాలు వేయించారు. కుటీరాన్ని శుభ్రంగా అలికించి ముగ్గులు పెట్టించారు. మాస్టర్‌గారు వచ్చే సమయానికి పెద్ద హండాలలో స్నానానికని నీళ్ళు కాగించి వుంచారు. పిండి





వంటలతో భోజనం సిద్ధం చేయించారు. అమ్మ సేవ చేసే కుమారి భాస్కరి

ఇలా చెప్పారు : "అమ్మకు మాస్టర్‌గారంటే ఎంత ఇష్టమో! మాస్టర్‌గారు వస్తున్నారంటే ఊరంతా ఆనందంతో మునిగిపోయింది. ఎవరి నోట విన్నా "మాస్టర్ గారు వస్తున్నారు, మాస్టర్‌గారు వస్తున్నారనే" మాటలే! ఊరంతా పెద్ద పండుగ జరుపుకుంటున్నంత ఉత్సాహంగా వున్నారు."

మాస్టర్‌గారు వచ్చి నమస్కరించుకున్నాక, అమ్మ వారికి ప్రసాదం పెట్టారు. అన్నం కలిపి ముద్దలు నోట్లో పెట్టి తినిపించారు. తాము కొంత తింటూ, మాస్టర్‌గారి నోట్లో పెడుతున్న దృశ్యం చూసి తీరవలసిందే! ఎన్నాళ్ళకో తన చెంతకు వచ్చిన కొడుకుపై చూపే ఆప్యాయత, ప్రేమ, వాత్సల్యాలు అమ్మ చర్యలో కొట్ట వచ్చినట్లు కనిపించాయి.

మాస్టర్‌గారు మరుసటి ఉదయం అమ్మకు పూజ చేయాలని సంకల్పించారు. రామాలయంలో పూజకు ఏర్పాట్లు జరిగాయి. మాస్టర్‌గారు అమ్మకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ చేశారు. నామావళి చెబుతూ అమ్మకు పుష్పాలతో పూజ చేస్తుంటే, అమ్మ సాయిబాబా ఫొటోను తన ఒడిలో ఉంచుకొని, ఆ పుష్పాలను బాబాకు సమర్పిస్తున్నారు. దిగంబరావధూత, దత్త స్వరూపిణి అయిన అమ్మకు సాయి మాస్టర్ చేసే దివ్య పూజను చూసి తీరవలసిందే! హేమాద్పంతు సాయిబాబా గురించి చెప్పినట్లు, ఆ దృశ్యం కన్నులారా చూసి తరించాల్సిందేగానీ, వర్ణించడం సాధ్యంకాదు. ఒక దత్త మూర్తికి, మరొక దత్తమూర్తి చేసిన ఆ దివ్యపూజ చరిత్రలోనే అపూర్వ ఘట్టం! రామాలయమంతా ఒక దివ్యమైన ఆధ్యాత్మిక శక్తితో నిండిపోయింది. అక్కడ కూర్చున్న భక్తులందరూ ఆనంద పారవశ్యంలో ఓలలాడారు. పూజ పూర్తయిన తర్వాత అమ్మకు మాస్టర్‌గారు సాష్టాంగ నమస్కారం చేశారు. అమ్మ మాస్టర్ గారికి తీర్థప్రసాదాలిచ్చారు. ఆ తర్వాత ఒక్కొక్కరే వచ్చి అమ్మకు, మాస్టర్‌గారికి నమస్కరించుకొని, అమ్మ చేతితో తీర్థ ప్రసాదాలనందుకొన్నారు. ఆ సాయంత్రం రామాలయంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు సత్సంగం జరిపారు. సత్సంగం జరిగినంతసేపూ అమ్మ మౌనంగా కూర్చుని వింటున్నారు. మాస్టర్ గారు అక్కడి వారి నుద్దేశించి ఇలా ప్రసంగించారు.

పూర్ణజ్ఞాని అయిన అమ్మ సన్నిధిలో వున్న వారికి బోధించవలసినది ఏమున్నది? అమ్మ సన్నిధిలో వున్న మీరెంతో అదృష్టవంతులు. మీరు చేసు కున్న





పూర్వపుణ్యం వలన ఇంతటి భాగ్యం లభించింది. ఈ అమూల్య మైన అవకాశాన్ని

సద్వినియోగ పరుచుకోవాలి. భౌతికంగా మహాత్ముని దర్శనం లభించినా, ఆయన కూడా చూడడానికి మానవకారం కలవాడవడం వల్ల, భక్తులు ఆయనను కేవలం సామాన్య మానవమాత్రుడుగా భ్రమించే ప్రమాద మున్నది. అట్టి చనువే కృష్ణుడి పరమాత్మ తత్వాన్ని అర్జునుడు పదే పదే విస్మరించేలా చేసింది. ఆ కారణంగానే సాయితో చనువుననుభవించిన శ్యామా కూడా సాయి సశరీరులై వుండగా హృదయ పూర్వకంగా వారి నెన్నడూ పూజించలేకపోయాననీ, సాయి గొప్పతనాన్ని పూర్తిగా గుర్తించలేకపోయాననీ, సాయి నిర్యాణానంతరం వాపోయారు.

అమ్మ వంటి జ్ఞానులు మన మధ్య జీవించడం ఎంతో అరుదు. వారు సాక్షాత్తూ దత్తాత్రేయ స్వరూపులు. అమ్మ వాచా ఏమీ బోధించరు. ఆమె పరిపూర్ణ జ్ఞాని కనుక, ఎవరికీ బోధించడమనేది వుండదు. అమ్మ మౌనమే నిరంతర బోధ. అమ్మ అప్పుడప్పుడూ మామూలుగా చెప్పిన మాటలే గొప్ప ఉపదేశాలు. వాటిని ఆచరించడానికి ప్రయత్నించండి. అమ్మ రూపాన్నే చూస్తూ, ఆ రూపంలోని దివ్యత్వాన్ని, చింతన చేస్తూ, ఆమె ఆచరణ ద్వారా మనకందించే బోధను గ్రహించాలి. సమయాన్ని వృధా చేయకండి. "తల్లికి తగ్గ బిడ్డలు కండి-మీ (ఆధ్యాత్మిక) భాండాగారాలను నింపుకోండి" అన్నారు బాబా. అలాగే మనం కూడా అమ్మకు తగిన బిడ్డలు కావాలి. అమ్మ తాను ఆచరించి చూపిన జీవన విధానాన్ని మనం అనుసరించాలి. నన్నేకాదు - మీరెప్పుడూ, ఎవరినీ, ఏమీ అడగనవసరం లేదు.

మూడవ రోజు సాయంత్రం తణుకులో పూజ్యశ్రీ మాస్టర్‌గారి ఉపన్యాసం ఏర్పాటు చేశారు. అప్పుడు అమ్మ చివటంలోని భక్తులందరినీ, ఆ ఉపన్యాసం వినమని పంపించారు. ఆ రాత్రి మాస్టర్‌గారు అమ్మ వద్ద సెలవు తీసుకున్నారు. అమ్మ మాస్టరుగారికి ప్రసాదం ఇచ్చి, బయటకు వచ్చి మరీ సాగనంపారు.

మాస్టర్‌గారు వీలున్నప్పుడల్లా, చివటం వెళ్ళి అమ్మ దర్శనం చేస్తూండే వారు. తమ వద్దకు వచ్చిన వారికి అమ్మ యొక్క మహోన్నత స్థితిని గూర్చి చెబుతూ, అమ్మను దర్శించుకోమని చెప్తుండేవారు. మాస్టర్‌గారి వద్ద నుండి వచ్చిన ప్రతివారినీ అమ్మ ప్రత్యేక రీతిన అనుగ్రహించేవారు. వారిని ఎంతో ఆదరించి, వారికై భిక్ష తెప్పించి, తానే స్వయంగా కలిపి ముద్దలు పెట్టి, వారికి కడుపునిండా తినిపించే వారు. అమ్మ ఆదరణను పొందినవారు అమ్మ వద్ద నుంచి వచ్చిన చాలా రోజుల





వరకూ ఆనంద పారవశ్యంలో మునిగి పోయేవారు. అమ్మ మాస్టర్‌గారికీ, సత్సంగ

సభ్యులకూ తరచూ ప్రసాదాలు పంపేవారు.

ఒక భక్తుడు అమ్మకు మాస్టర్‌గారు వ్రాసిన శ్రీ సాయి లీలామృతము చూపించారు. అమ్మ దానిని చదివించుకుని విన్నారు. అప్పటి నుండి అమ్మ భగవద్గీతతో పాటు, శ్రీ సాయి లీలామృతాన్ని చదివించేవారు. అమ్మకు సాయిబాబా అంటే ఎంతో ఇష్టం. వారి భక్తులెంతో మంది చేత అమ్మ సాయిలీలామృత పారాయణ చేయించారు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారు విద్యానగర్‌లో నిర్మిస్తున్న శ్రీ శిరిడీ సాయిబాబ మందిరానికి అమ్మ తమ ఆశీస్సుల నివ్వడమే గాక, రూ. 116-00 విరాళంగా పంపారు. అంతేగాక, ఆ మందిర కుంభాభిషేకానికి తమ భక్తులను పంపించారు. పెద్దబాబు (సాయిబాబా)కు వేయమని రెండు రూపాయలిచ్చి పంపారు. విద్యానగర్‌లో కుంభాభిషేకం జరుగుతున్న సమయంలో చివటంలో అమ్మ శ్రీ సాయిబాబాకు పూజ చేయించారు. మాస్టర్ గారినీ, వారి కార్యక్రమాలనూ అమ్మ ఎంతగా ఆదరించేవారో తెలుసుకోవడానికి శ్రీ విస్సయ్య పంతులుగారు మాస్టర్‌గారికి వ్రాసిన ఈక్రింది ఉత్తరమే ఒక ఉదాహరణ.

తణుకు,

17-3-81

పూజ్యశ్రీ మాస్టర్‌గారి పాదపద్మములకు తణుకు నుండి విస్సయ్య పంతులు నమస్కరించి వ్రాయునది. శ్రీ శిరిడీ సాయినాథునికీ, మీకును మీ కుటుంబ సభ్యులందరికీ నమస్కారములు. నిన్నటి దినమున (16-3-81) సాయంత్రం మా కుటుంబ సభ్యులు అందరము శ్రీశ్రీశ్రీ అమ్మగారి వద్దకు వెళ్ళితిమి. అమ్మగారి దర్శనానంతరము మా కుటుంబ సభ్యులు అందరమూ మనిషిమనిషి చొప్పున మీ కుటుంబ సభ్యుల, శిష్యుల - అందరి నమస్కారములు శ్రీశ్రీశ్రీ అమ్మగారికి అందజేసితిమి. అమ్మగారి ఆనందమునకు (ఆ సమయమున) అవధులు లేవు. అక్కడికి వచ్చిన సత్సంగ సభ్యులు అందరితో శ్రీశ్రీశ్రీ అమ్మగారు "చూడండే, చూడండి. భరద్వాజ బాబు నాకు నమస్కారములు చెప్పారట" అని పకపక ఆనందముతో పరవశించిపోయిరి. తరువాత నేను తీసిన ఫొటోలు శ్రీశ్రీ అమ్మగార్కి





యిచ్చాను. అమ్మ ఆ ఫొటోలో, బాబాగారి ఫొటోను, మందిరం ఫొటో ను చూచి

కళ్ళకద్దుకొనిరి. ఇక్కడి సత్సంగ సభ్యులకందరికీ ఆ ఫోటోలు చూపించి, "చూడండర్రా! మనం అక్కడికి వెళ్ళకపోయినా బాబు ఫోటోలు వచ్చాయి. అమ్మో! బాబు ఇంత పెద్ద మందిరం కట్టించాడా? చాలా బాగుంది," అని నుడివిరి. తరువాత మా కుటుంబసభ్యులు ఒక్కొక్కరము తమరు ఇచ్చిన రూపాయి నాణెములను అమ్మ చేతికిచ్చితిమి. అప్పుడు అప్పుడు అమ్మ "అమ్మో! చూడం డర్రా, బాబు పెద్ద వాళ్ళ దగ్గర్నుంచి చిన్న బాబు దాకా మనిషికి మూడు రూపాయలు యిచ్చారు. అమ్మా! మీరు అందరూ ఈ రూపాయలు పూజలో వుంచుకోండి. ఖర్చుపెట్టకండి" అని అనుజ్ఞ యిచ్చిరి. తరువాత అక్కడ 12వ తేదీన జరిగిన ఉత్సవ విషయములు అన్నియు ఒక్కొక్క విషయం శ్రీ అమ్మగారికి చెప్పగా అమ్మ అమితానందంతో ఉప్పొంగి పోయారు. (నిజం చెప్పాలంటే చంటి పిల్లలకు మనం వాళ్ళకిష్టమైన వస్తువులు చూపించితే వాళ్ళు ఏరీతిగా చంకలు ఎగురవైచి ఆనందంతో పరవశించి పోతారో ఆ రీతిగా అమ్మగారు చంకలు ఎగురవైచిన రీతి చూచిన మాకు ఒడలు గగుర్పొడిచినది) "బాబు చాలా కష్టపడ్డా రయ్యా! మన సుధీంద్ర బాబు, భరద్వాజ బాబు ఒక్కటేనమ్మా" అని పల్కిరి. తర్వాత మేము ఒక్కొక్కరము దత్తసాయి ఫొటోను, మీ ఫొటోను శ్రీ అమ్మగార్కి యివ్వగా ఆ ఫొటోలను కళ్ళకు అదుముకొని అక్కడ వున్న సత్సంగ సభ్యులు అందరికీ ఆ ఫొటోలు చూడమని అమ్మ పల్కి, దత్తసాయి ఫొటోలోని సాయిబాబాను అమ్మ చాలా మెచ్చుకొనిరి. "అయ్యో! ఇటువంటి ఫొటోలు యిక్కడున్న వాళ్ళకు కూడా తేకపోయారా; తీసుకు రావల్సిందండి", అని పల్కిరి. తర్వాత మీరు మా అందరకు యిచ్చిన ప్రసాదాలలో మా చెల్లెలికిచ్చిన పొట్లం తీసుకొని చించి అందులోని ఊదిని, ప్రసాదమును అందరికీ పంచమనిరి. తరువాత అక్కడ చేరిన భక్తులందరిచేత, "హరేరామ హరేరామ రామరామ హరే హరే" అను నామజపం 5 ని॥లు చేయించి, హారతి యిప్పించి, ప్రసాదమును అమ్మగారు స్వయంగా యిచ్చిరి.

మాస్టర్ గారండీ! ముఖ్యమైన విషయం ఏమిటంటే 12వ తేదీన (ప్రారంభోత్సవంనాడు) మా భాస్కరం అక్కను అమ్మ తన దగ్గరే వుంచుకుని బాబా పూజ జరిపించుతూ అక్కడకు చేరిన సత్సంగ సభ్యులతో 12వ తేదీన విద్యా నగర్‌లో 7-8 గం॥ల మధ్య బాబా పటం ఊరేగించుతున్నట్లుగా యిక్కడ చివటంలో అమ్మ చెప్పారట. తరువాత మీరు పీటల మీద కూర్చున్నట్లుగా, శిఖరమునకు పసిడి కుండలు





పెడ్తున్నట్లుగా, ఫలానా టైమ్‌కి అన్నసమారాధన జరుగుతున్నట్లుగా చెప్పారట. మేము

ఇంటికి వచ్చిన తర్వాత మాతో యోచించగా, సరిగా మేము చెప్పిన టైమింగ్స్, అమ్మ చెప్పిన టైమింగ్స్, ఒకే రీతిగ ఉండటం చాలా ఆశ్చర్యాన్ని కల్గించింది. దీనిని బట్టి ఆలోచించగా శ్రీశ్రీ అమ్మగారు విద్యానగర్ వచ్చే వుంటారని మా కుటుంబ సభ్యులు అందరము అనుకున్నాము. ఆ జగజ్జననికి తెలియనిదే లేదని వ్యక్తమవు తున్నది.

ఇట్లా జరిగిన తర్వాత, మీకు ఈ సంగతులన్నీ వెంటనే లెటర్ వ్రాయాలని పించింది. ఎందుచేతనంటే మరల అమ్మ పల్కిన పలుకులు నాకు జ్ఞాపకముండక పోవచ్చునను ఉద్దేశ్యముతో ఈ లెటరు వెంటనే వ్రాస్తున్నాను. అక్షరదోషములు దయతో మన్నించ ప్రార్థన.

చిత్తగించవలెను.

ఇట్లు,

మీ శిష్యుడు,

విస్సయ్యపంతులు

17-3-81

పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఒకసారి కుటుంబసమేతంగా అమ్మను దర్శించారు. అమ్మకు పూజ్య మాస్టరుగారి దంపతులు, మాస్టర్‌గారి పుత్రిక చి॥ వేదవతి పూజ చేసుకున్నారు. మాస్టర్‌గారిని, వారి శ్రీమతి గారిని, వారి పాపనూ ఎంతో ప్రేమ, వాత్సల్యాలతో ఆదరించారు. పాప కిష్టమైన వంటకాలు దగ్గరుండి వండించి పెట్టారు. మాస్టర్‌గారి శ్రీమతి గారిక్కూడా తమ స్వహస్తాలతో అన్నం తినిపించారు.

అమ్మ తమ భక్తులతో మాస్టర్‌గారి గురించి ఎంతో గొప్పగా చెప్తుండే వారు. ఒకసారి మాస్టర్‌గారి గురించి తమ భక్తులతో చెప్తూ అమ్మ "ఆ బాబుకి ఎంత జీతం వస్తే, అంతా పైసా! పెట్టు-పెట్టు! ఉరుకులూ-ఉరుకులూ" అన్నారట. అంటే మాస్టర్‌గారికి వచ్చే జీతమంతా దానధర్మాలకూ, సాయి సేవలో దేశమంతా తిరగడానికే సరిపోతుంది అని! నిజానికి మాస్టర్‌గారు ఒక్క పైసా కూడా రేపటికని దాచుకోలేదు. ఎంతమంది విద్యార్థులకూ, అర్థార్థులకూ రెండోకంటికి తెలియ కుండా దానం చేసేవారో! ఈ గుప్త దానాలన్నీ అమ్మకు తెలియడమే ఆశ్చర్యం!





అంతేగాదు, మాస్టర్‌గారికి పుత్రుడు జన్మించబోతున్నాడని కూడా అమ్మ

ముందుగానే చెప్పారు. విద్యానగరం కుంభాభిషేకానికి వెళ్ళి వచ్చిన లక్ష్మిగారు అమ్మతో మాస్టర్‌గారి శ్రీమతి గర్భవతి అన్న సమాచారం అందిస్తూ, "అమ్మా! సాధువులకు పిల్లలేంటమ్మా?" అన్నారట! అప్పుడమ్మ, "వ్యాసుడికి శుకుడుట్టిన ట్టేనే, వ్యాసుడికి శుకుడుట్టినట్టేనే" అన్నారట. ఆ విధంగా మాస్టర్ గారి బాబు చి॥ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ జననాన్ని అమ్మ ముందుగానే వెల్లడి చేశారు. అంతేగాక, అమ్మగారికి 5 నెలలో చలిమిడి, పటిక బెల్లం, చీర పంపించారు.

విద్యానగర్ సాయిమందిర కుంభాభిషేకం సందర్భంగా ప్రచురించ బడిన 'సద్గురు దర్శనము' అనే సంచికను అమ్మకు చదివి వినిపిస్తుంటే అమ్మ "బాబు ఎంత తిరిగాడే, ఎంత కష్టపడ్డాడే, ఎన్ని విషయాలు సేకరించాడే" అన్నారు. ఆ సంచికలో ప్రచురించబడిన అమ్మ గురించిన వ్యాసం చదువుతుంటే, అమ్మ అక్కడ నుంచి లేచి బయట అరుగు మీద కూర్చుని, "ఒసే, ఎర్రమంగీ! ఇవన్నీ నువ్ మోశావటే!" అన్నారు. నిజానికి, ఆ వ్యాసం లోని సంగతులన్నీ మంగమ్మ గారి ద్వారానే తెలిశాయి! మాస్టర్‌గారు చివటం వెళ్ళినప్పుడల్లా, అమ్మ సన్నిహిత భక్తులతో అమ్మదిన చర్యను, సంభాషణ లనూ, అమ్మతో వారికి గల అనుభ వాలనూ ఎప్పటికప్పుడు వ్రాసి వుంచమని చెప్పేవారు.

అమ్మ ఎవరు తమ చరిత్రను వ్రాస్తామని అడిగినా వద్దనేవారు. ఒక సారి కట్టా సత్యంగారు అమ్మను ఇలా అడిగారు - "మా ఊరిలోని వారొకరు స్వామి శివానంద మొదలైన వారి చరిత్రలు వ్రాశారు. మీ చరిత్ర కూడా వ్రాయాలంటున్నారు. మీరు చెబితే వ్రాస్తారట. నన్ను అడగమన్నారు." దానికి అమ్మ "నాకు చరిత్ర ఏముందని? - వారంతా మహాత్ములు - నాకు ఏమి తెలుసని! ఏమి చేశానని? అయినా వెనుక జరిగిన చరిత్రంతా మరలా గుర్తుకు తెచ్చుకొని చెప్పడం, ఎప్పుడో కక్కిన కూడు మరలా తిన్నట్లే - వారలా అడుగుతూ వుంటారు. నాకు తెలియదని ఊరుకో - నాకు చరిత్రావద్దు ఏమీ వద్దు" అన్నారట.

అటువంటి అమ్మ పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్‌గారికి మాత్రం తమ చరిత్రను వెల్లడించడానికి అనుజ్ఞ ఇచ్చారు. అసలు మాస్టర్‌గారు అమ్మను దర్శించడంలోను అంతర్యమే అదేనేమో! ఎవరికి తెలుసు!

★★★





అవధూత శ్రీ చివటం అమ్మ

## అమ్మ - ఇతర మహాత్ములు

శ్రీ మళయాళ స్వామి వారు ఒక ఉపన్యాసంలో అమ్మ గురించి ప్రస్తావిస్తూ, "అమ్మ పూర్ణావధూత" అని చెప్పారు.

చిపటంలో మళయాళ స్వామి ఆశ్రమం వుంది. అందులో శ్రీ బాల బ్రహ్మానంద స్వామి అనే స్వాముల వారున్నారు. అమ్మ, బాలబ్రహ్మానందస్వామి, గురుబంధువులు. అమ్మ వారి యెడల ఎంతో గౌరవం చూపేవారు. ఆ స్వామి అమ్మ గురించి ప్రస్తావిస్తూ, "అమ్మ అంటే ఏమనుకున్నారు? అమ్మ పరమహంస! అమ్మకు సాటి ఎవరూ లేరు" అన్నారు. అమ్మ వారిని "తమ్ముడూ" అని సంబోధించేవారు. ఆ స్వామి తర్వాత పక్షవాతం వచ్చి బాధపడుతున్నప్పుడు అమ్మే స్వయంగా వారి మలమూత్రాదులు కడిగి సేవ చేసేవారు.

బ్రహ్మానందస్వామి ఒకసారి కట్టా సత్యం గారితో, "నీవు అమ్మను వదలకు, అమ్మ సామాన్యమైనది కాదు. అమ్మ సంగతి అమ్మ సమాధి అయిన తర్వాత గాని మీ అందరకు తెలియదు. అమ్మను మాత్రం వదలకు" అన్నారు.

అమ్మగారి గురువు శ్రీ సాధూరాం బాబాజీ. ఒకసారి సాధూరాం బాబాజీ అమ్మకు తలంటి స్నానం చేయిస్తూ, "అమ్మ నాకంటే పై మెట్టులో వుంది" అన్నారు. అమ్మ సాధూరాం బాబాజీ నిర్వహించే గురుపూజలకు వెళ్ళేవారు. ఇలా 3 సం॥లు వెళ్ళి తర్వాత మానేశారు. సాధూరాం బాబాజీ వారి గురువు కొత్తలంక యోగిగారు. అమ్మ కొత్తలంక యోగి గారిని కూడా దర్శించారు. వారి సన్నిధిలో అమ్మ మౌనంగా కూర్చున్నారట.

ఒకసారి అమ్మ మరికొందరితో కలిసి, ముమ్మిడివరం బాలయోగి గారి దర్శనానికి వెళ్ళారు. శ్రీ బాలయోగిగారు అతి చిన్న వయస్సులోనే ఒక భూగృహంలో తపస్సుకు వెళ్ళిపోయారు. వారు, ఆహారం ఏమీ తీసుకునేవారు కాదు. ఒక్క శివ రాత్రి రోజు మాత్రం భూగృహం నుంచి బయటకువచ్చి, అందరికీ దర్శనమిచ్చేవారు.





అమ్మ దర్శించే నాటికి బాలయోగిగారు తపస్సులో కూర్చొని సుమారు 2 లేక 3 సం॥లు అయిందట. అమ్మ వారి తొడపై తన శిరస్సు నుంచి సమాధి స్థితిలో

చాలా సేపు గడిపారు. వారేమీ మాట్లాడుకోలేదు.

అమ్మ, మావుదూరి బుచ్చమ్మగారు, మాల పిచ్చమ్మగారు ఒకరితో ఒకరు ఎంతో ప్రేమతో వ్యవహరించేవారు. వీరు ముగ్గురు కలిసి శ్రీ కనకయ్య గారింట్లో ఒకరోజు భిక్ష చేశారు. అక్కడ అమ్మ ఏమీ తినకపోతే, "ఏమీ తినలేదేమే" అంటూ పిచ్చమ్మగారు అమ్మ నోట్లో ముద్దలు పెట్టి తినిపించారట. పిచ్చమ్మగారు అమ్మ ఒడిలో పడుకునేవారు.

ఒకసారి రేపల్లి చిన్నమ్మగారు, పెద్దమ్మగారు, కురుమద్దాల మాల పిచ్చెమ్మ గారు మామిడూరు వచ్చారు. ఆ సమయానికి చివటం అమ్మ కూడా అక్కడకు చేరుకున్నారు. చిన్నమ్మ తెల్లటి వస్త్రాలు, పెద్దమ్మ గోనెగుడ్డలు కట్టుకొని ఉన్నారు. అమ్మ అప్పటికే దిగంబరంగా వుండేవారు. అప్పుడు అక్కడ జరిగిన సమారాధనలో మూడు రోజులు వారంతా పాల్గొన్నారు.

మావుదూరి బుచ్చమ్మగారి మఠానికి అమ్మ తరచూ వెళ్తుండేవారు. అలానే బుచ్చమ్మ గారు కూడా తరచూ అమ్మ దగ్గరకు వస్తుండేవారు. అమ్మ బుచ్చమ్మ గారికి ముద్దలు కలిపి తినిపించేవారు.

చివటం అమ్మగారు మౌనంగా వుండేవారు. మావుదూరి బుచ్చమ్మగారు కోపదారిగా వుండేవారు. తిట్టేవారు - కొట్టేవారు కూడా. ఒక్కోసారి ఉన్మత్తుల వలె ప్రవర్తించేవారు. ఒకసారి అమ్మ ప్రసాదం పెడుతుంటే, 'నీ ప్రసాదం నీవే వుంచుకో' అంటూ అమ్మగారి మీదకు విసిరేశారు. "ఏమే అచ్చమ్మా! నీవు బ్రతికి వుండగా నీ దగ్గరకు వస్తే నీ దగ్గరకు వస్తే నీ చెప్పుతో కొట్టు" అంటూ రిక్షా ఎక్కి కూర్చు అన్నారు.

బుచ్చమ్మగారు ఒక్కోసారి అమ్మను వేళాకోళం చేస్తుండేవారు. అమ్మ భక్తులతో - "మీ అమ్మగారికే చిప్పట్టుకొని ఇల్లు ఇల్లు తిరగటం ఇష్టం. నాకు శుభ్రంగా ఇక్కడికే వస్తున్నాయి" అనేవారు.

ఒకసారి రామాలయంలో పుస్తకాలన్నీ చిందర వందరగా పారేసి, అవి





నర్దబోయిన కట్టా సత్యాన్ని కాలుతో తన్నారు. చివరకు వెళ్ళిపోబోతూ, కట్టా

సత్యాన్ని పిలిచి, "నిన్ను కొట్టినందుకు ఏమీ అనుకోకురా" అని కంట తడిపెట్టి, "అమ్మను విడువవద్దు" అని హెచ్చరించారు. బుచ్చమ్మ గారిని చూస్తుంటే బాబా దగ్గర ఉండే నానావల్లీ గుర్తుకు వస్తారు. బుచ్చమ్మగారు ఎంత తిట్టినా, వేళాకోళం చేసినా, వస్తువులు గిరాటు వేసినా అమ్మ మాత్రం శాంతంగా, మౌనంగా ఉండేవారు. చివటం అమ్మగారి కొడుకు సూరన్న గారికి బుచ్చమ్మగారే దగ్గరుండి పెళ్ళి జరిపించారట.

ఒకసారి అనంత ఏకాదశికి అమ్మ మావుడూరు వెళ్ళారు. అక్కడ చివటం అమ్మ, మాల పిచ్చెమ్మ గారు, బుచ్చెమ్మగారు కలిసి అన్నదానము చేశారు. ఆ ఊర్లో జమిందారు గారు కూడా అదే సమయంలో  భారీ ఎత్తున అన్నదానం చేయడానికి ఏర్పాటు చేశారు. కానీ, చిత్రంగా, అమ్మవాళ్ళు చేసిన సంతర్పణకే జనం ఎక్కువ మంది రాసాగారు. అపుడా జమిందారు గారు ఆశ్చర్యపోయి వచ్చి, అమ్మగార్ల దర్శనం చేసుకున్నారు. అమ్మ గురించి బుచ్చెమ్మగారు, "నాకింకా పచ్చి వుంది. అమ్మలో పచ్చిలేదు" అనేవారు.

అమ్మ నిర్యాణానంతరం అమ్మ లేరని బాధపడుతున్న పెరవలి కరణం గారి కుటుంబ సభ్యులను బుచ్చమ్మగారు ఎంతగానో ఆదరించారు. వీరు బుచ్చమ్మగారి దర్శనానికి వెళ్ళారు. ఎవరినీ దగ్గరకు రానీయకుండా తరిమేసే బుచ్చమ్మ గారు హైమ వాళ్ళు (కరణం గారి అమ్మాయి) వస్తూనే, 'రాండే, రాండే' అని ఆదరించారు. ఎప్పుడూ దిగంబరంగా సంచరించని బుచ్చమ్మగారు హైమకు మచిలీపట్నంలో చిలకలపూడి గుడి వద్ద దిగంబరంగా దర్శనమిచ్చి, ప్రేమతో కౌగిలించుకొని, తాను - అమ్మ వేరు కాదన్నట్లుగా ఆదరించారు. తర్వాత వీరి ఇంటికి కూడా వచ్చి 2,3 రోజులున్నారు.

మహాత్ములు ఒకరి శిష్యులను మరొకరి ఆశీర్వచనం కోసం పంపడం పరిపాటి. అమ్మ శ్రీ కట్టా సత్యం గారిని కురుమద్దాలలో మాలపిచ్చమ్మ గారు తపస్సు చేసిన మర్రి చెట్టు క్రింద ఒక రాత్రి, ఒక పగలు ధ్యానం చేసుకోమని పంపించారు.





ఒకసారి శ్రీ విద్యానంద స్వాముల వారు అమ్మ దర్శనానికి వచ్చారు.

రామాలయంలో అమ్మ దగ్గర కూర్చున్నారు. “అమ్మగారి స్థితి సామాన్యమైన స్థితి కాదు; మీ పూర్వపుణ్యం వలన అమ్మగారు మీ మధ్యన వుంటున్నారు” అన్నారు. స్వాముల వారిని చూడగానే వారి కాళ్ళకు సాష్టాంగ నమస్కారం చేసారు అమ్మగారు. కొంతసేపు భగవద్గీత ఉపన్యాసం చెప్పి వారు వెళ్ళిపోయారు.

ఒకసారి హఠయోగి అప్పారావు గారు అమ్మ దర్శనానికి వచ్చారు. ఈయన సాధూరాం బాబాజీ గారి శిష్యులు. ఈయన నీటి మీద పడుకోవడం లాంటి యోగప్రక్రియలు చేసేవారు. అమ్మ ఆయన కాళ్ళు పట్టుకొని నమస్కారం చేసుకున్నారు. అప్పుడు, “నా కాళ్ళు పట్టుకోకు, నీవు పండి పోయావు. నాకింకా పచ్చి వుంది” అన్నారు.

కొత్తలంక యోగి గారి శిష్యులు వాడపల్లి బాబుగారు. వీరు అమ్మను దర్శించడానికి వచ్చినప్పుడు అమ్మ ఒక గోతిలో సమాధి స్థితిలో వున్నారట. తర్వాత అమ్మ మెల్లగా మామూలు స్థితిలోకి వచ్చి వారిని పలుకరించారట.

అలంపురం బాబుగారు మొదటిసారి అమ్మ దర్శనార్థం వచ్చినప్పుడాయన అమ్మతో ఇలా అన్నారట - “ఏడు మల్లెపూవుల బరువుంటావనుకున్నాను; ఇంత బరువున్నావేమిటి?” అని! అమ్మ శరీరం ఒక్కొక్కసారి చాలా బరువుగానూ, ఒక్కొక్కసారి చాలా తేలికగానూ వుండేది. మరొకసారి అమ్మ సిద్ధాపురం వెళ్ళినప్పుడు కొల్లేరులో నావ ఎక్కడానికి నడిచి వెళ్ళవలసి వచ్చింది. అప్పుడు అమ్మను ఎత్తుకొని తీసుకు వెళదామని నలుగురు పైకి ఎత్తారట. కానీ, అమ్మ మల్లెపూవంత తేలిగ్గా వున్నారట.

మరొకసారి అలంపురం బాబుగారు అమ్మ దర్శనార్థం వచ్చినప్పుడు, అమ్మ భిక్షాపాత్రలో మట్టి కలిపి గోడకు మెత్తుతున్నారు. ఆయన అది చూసి, ‘అమ్మ అవధూత కదా - గోడకు మట్టి మెత్తుకోవడం వంటి పనులీమెకెందుకు?’ అని మనస్సులో అనుకొన్నారట. వెంటనే అమ్మ ఆ పని ఆపేసి వెళ్ళిపోయారు. అప్పుడాయనకు పాత్రలో మట్టిని తానే గోడకు మెత్తాలనిపించి, ఆ పని ముగించారట.





అమ్మ దీపావళి ముందు రోజు నాగయోగి గారికి శ్రీ విస్సయ్య పంతులు,

ఇచ్చి పంపారు. ఆ సాంప్రదాయాన్ని కొనసాగించాలనే ఉద్దేశ్యంతో, అమ్మ సమాధి చెందాక 14-11-82న విస్సయ్య పంతులుగారూ, వారి చెల్లి పట్టుపంచెలు తీసుకొని వెళ్ళారు. ఎవ్వరినీ లోపలకు రానీయకుండా తలుపులు వేసుకొని లోపల వుండే వారు నాగయోగి. వీరు అమ్మను స్మరించినంతనే తలుపులు తెరుచుకున్నాయి. ఎవరినీ తనను తాకనీయని నాగయోగి, వీరు తలస్నానం చేయిస్తామంటే అంగీ కరించారు. వీరు స్నానం చేయించడంతోనే ఒళ్ళు తుడవనీయకుండా గబుక్కున లేచి వెళ్ళి, స్వయంగా పట్టు పంచె చుట్టబెట్టుకొని వెళ్లి కూర్చున్నారు. వీరు తీసుకు వెళ్లిన ప్రసాదం ఎంతో ఇష్టంగా చేతినిండా తీసుకొని తిన్నారు.

అమ్మ సాధువులకు స్వయంగా సేవ చేసేవారు. ఒకసారి ఒక సాధువు గారు వచ్చారు. ఆయన భోజనం చెయ్యరు. ఉప్పుడు పిండి (ఉప్మా వంటిది) తింటారు. అమ్మ వారి కోసం స్వయంగా పిండి విసిరి, ఉప్పుడు పిండి తయారు చేసి పెట్టారు.

ఒకసారి పిఠాపురం బాబుగారు చివటం వచ్చారు. సెలవు తీసుకొని వెళ్ళిన వెంటనే మళ్ళీ ఆయనకు అమ్మను చూడాలనిపించింది తిరిగి వచ్చారు. ఆయన వెళ్ళాక అమ్మ భక్తులతో, "వెళ్ళిన వెంటనే మళ్ళీ వచ్చాడే! ఇక మళ్ళా రాడేమోనే" అన్నారట. అలాగే అమ్మ వుండగా మళ్ళీ రాలేదు. అమ్మ సమాధి అయిన తర్వాతనే వచ్చారు.

పరుచూరి వెంకట్రామయ్యగారు గొప్ప పౌరాణికులు. శ్రీ వెంకట్రామయ్య గారు, శ్రీ కరుటూరి నారాయణ మూర్తిగారే చివటంలోని రామాలయం కట్టించారు. అమ్మ నివాసమైన ఆ ఆలయంలోకి ఎందరో మహాత్ములు విచ్చేశారు. ఒకసారి పరుచూరి వెంకట్రామయ్యగారు శాస్త్ర ప్రవచనం చేస్తుంటే, కరుటూరి నారాయ ణమ్మ గారిని తోడు తీసుకొని అమ్మ కూడా వెళ్లారు. అక్కడ వారి ప్రవచనం వినడానికి కొందరు సాధువులు వచ్చారు. అమ్మ వారందరికీ కరుటూరి నారాయ ణమ్మ గారింట్లో భోజనం ఏర్పాట్లు గావించారు.





వెంకట్రామయ్యగారు, అమ్మల మధ్య శాస్త్ర చర్చ క్షుణ్ణంగా జరిగేది. శాస్త్ర చర్చ చేసేటప్పుడు మాత్రం అమ్మ మాటాడేవారు. ఇతర సమయాల్లో వారితో

అమ్మ ఏమీ మాట్లాడేవారు కాదట.

పరుచూరి వెంకట్రామయ్యగారు, అమ్మ ఒకే ఆకులో అన్నం తినే వారు. ఆకులో అన్నం రెండు భాగాలుగా చేసి ఒకవైపు అమ్మ, రెండో వైపు ఆయన తినేవారు. అన్నం తినేటప్పుడు - ఒకరివైపు మరొకరు తమ భాగంలోని అన్నం రెండవ వారి వైపుకు నెట్టుకుంటూ తినేవారు. వెంకట్రామయ్య గారింట్లో ఆబ్దీకాల నాడు అమ్మ భిక్షా పాత్రతో వచ్చి, బ్రాహ్మణుల పంక్తిలో కూర్చుని భిక్ష స్వీకరించేవారు.

పరుచూరి వెంకట్రామయ్యగారు తాము దేహత్యాగం చేసేముందు, తమ శిష్యురాళ్ళను అమ్మకు అప్పజెప్పారు. వారు అమ్మతో, "అమ్మా! ఈ ముండలను విడిచి పోతున్నానే! వాళ్లను ఏం చేస్తావో!" అన్నారు. అమ్మ మౌనంగా అంగీకరించారు.

తత్త్వవేత్త శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారు రాజమండ్రి వచ్చినప్పుడు అమ్మ తన భక్తులను ఆ సభలకు వెళ్ళమని ప్రోత్సహించారు. అంతేకాక, మంగమ్మ గారితో కలిసి అమ్మ కూడా ఆ సభలకు వెళ్లారు. గాంధీగారు రాజమండ్రి వచ్చి నప్పుడు కొందరు, అక్కడకు వెళదామా అమ్మా!" అంటే, 'ఎందుకులే వద్దు' అన్నారు అమ్మ.

శ్రీ లక్ష్మణయతీంద్రులు అమ్మను దర్శించినట్లుగా తెలియరాదు - కానీ, అమ్మ సమాధిని ఒకసారి దర్శించారట!

"దేశంలో కెల్లా దిగంబరత్వం ఆధారంగా చేసుకొని వున్న ఏకైక అవధూత అమ్మ. అమ్మ నివాసం ఆలయమే. భాష యాస కావచ్చు. భావంలో అలాంటి మనిషిలేదు. అమ్మ సేవకుండే విలువ అనంతమైనది" అన్నారు ఒక గొప్ప మహాత్ములు.

★★★





అధ్యాయం - 3

## అమ్మ బోధ

"అమ్మ మౌనమే నిజమైన బాధ - నిరంతరమైన బోధ"

"గురోస్తు మౌన వ్యాఖ్యానం, శిష్యాస్తుచ్ఛిన్న సంశయః"

పరబ్రహ్మను గూర్చిన నిజమైన వ్యాఖ్యానం మౌనమేననీ, అట్టి గురువు యొక్క మౌనమే శిష్యుల సంశయాలను విచ్ఛిన్నం చేయగలదనీ, దక్షిణామూర్తి స్తోత్రం చెప్తుంది. అమ్మ కూడా అంతే! అమ్మ ఎప్పుడూ మౌనంగానే వుండేవారు. అవసరమైన కొన్ని మాటలు మాత్రం మాట్లాడేవారు. అయినప్పటికీ అమ్మ కూడా సాయిబాబా వలె సందర్భానుసారంగా భక్తుల సాధనకు అవసరమైన సూచనలను అందించేవారు. అమ్మ నోటి నుండి వెలువడిన చిన్న చిన్న సామాన్య వాక్యాలే మహోన్నత సత్యాలు - విశ్వద్రష్టలైన వేద ఋషులు చెప్పిన వేద మంత్రాలు.

అమ్మ రామాలయంలో కూర్చుని వుండగా ఒకరోజు సూరమ్మగారు, "మాకు ఏమీ తెలియదమ్మా -- మీరు మాకు ఏమీ చెప్పరు. మాకు ఇంక తెలిసేదెలా?' అని అమ్మను అడిగితే, "చెబితే తెలిసేది కాదే - చేస్తే తెలుస్తుంది. గురువు అనేవారు దారి చూపిస్తారు. ఆ దారిన నడిచి గమ్యం చేరవలసింది నువ్వే" అన్నారు అమ్మ. 'గురువు మీద కేవలం భక్తి వుంటే చాలదు. గురువు చెప్పినట్లు చెయ్యాలి. ఎలాగంటే, ఒక గొప్ప వైద్యుని మీద నీకు గౌరవం వున్నంత మాత్రాన నీ జబ్బు తగ్గిపోదు - అతడిచ్చిన ఔషధం సేవించాలి - పథ్యం చెయ్యాలి - అలాగే ఇదీనూ' అంటారు పూజ్యశ్రీ మాస్టర్‌గారు. "ఆధ్యాత్మ విద్య ఎంతో కష్టము. శక్తినంతా వినియోగించి కృషి చేస్తే గానీ ఫలితం వుండదు.

దున్నపోతు నెక్కి నానేఘాట్ దాటటం కంటె కూడ కష్టం" అని శ్రీ శిరిడీ సాయిబాబా ఠాకూర్‌తో అంటారు.

అమ్మ ఒకరోజు లక్ష్మిగారిని పిలిచి, అక్కడ ఉన్న కొబ్బరికాయ కొట్టి





తీసుకు రమ్మన్నారు. ఆ కొబ్బరి చెక్కలు చూపిస్తూ, "ఈ కొబ్బరిలా హృదయం స్వచ్ఛంగా వుండాలే - ఏ సంకల్పాలూ లేకుండా" అన్నారు అమ్మ. మరి

హృదయమలా స్వచ్ఛంగా వుండాలంటే ఏం చేయాలి?

"దుక్కి దున్నాలే - దున్నకపోతే విత్తనమెలా వేస్తావు?" అన్నారు అమ్మ ఒక భక్తురాలితో. "నాకు అర్థం కాలేదమ్మా" అంటే, "ఆత్మజ్ఞానం అనే విత్తనం మొలకెత్తాలంటే, సాధన అనే దుక్కి దున్నాలి" అని చెప్పారు. అలానే మరొకప్పుడు అమ్మ "పాదు పెట్టందే, కాయెట్టా వత్తదే!" అన్నారు. సాధన చేస్తే కాని ముక్తి కలగదని అమ్మ భావం. కేవలం మహాత్ముల సన్నిధిలో వుండటం వలన మాత్రమే ఆత్మజ్ఞానం కలుగదు. శ్రీ సిద్ధారూఢ స్వామి అంటారు - "మహాత్ముల సన్నిధిలో వుండటం వలన మాత్రమే ముక్తి లభించేటట్లయితే, అందరికన్నా ముందు మహాత్ములు కట్టుకున్న లంగోటాకు ముక్తి లభించాలి" అని.

సాధన పట్టు వీడకుండా చేయాలంటే మొదట మన లక్ష్యం మీద ఎనలేని ప్రీతి వుండాలి! ఆధ్యాత్మికత అంటే ఏమిటో - మనం దేనికోసమై పరితపిస్తున్నామో - స్పష్టమైన అవగాహన వుండాలి. పూజ్యశ్రీ మాస్టర్‌గారు 'సాయిలీలామృతము' లో ఇలా చెప్తారు : "ఉన్నదానితో అసంతృప్తి, లేని దేనికోసమో తపన - ఇదే మానవ జీవిత సారం. ఇలా దేనికోసమూ తపించ వలసిన అవసరం లేని స్థితి ఆత్మజ్ఞానం వల్లగానీ రాదు. ఈ సంగతి దృఢంగా తెలియడమే వివేకం - దాని పర్యవసానమే వైరాగ్యం. ఇట్టి తపనకు, అశాంతికీ కారణం తనలోనే వుంది వుండాలని తెలుసుకున్నాక, దాన్ని తొలగించు కోవాలన్న నిశ్చయమే ముముక్షత్వం. అందుకు మార్గం తెలుసుకో జూడడమే జిజ్ఞాసం. అందుకోసం జ్ఞానుల నాశ్రయించడం - సద్గురు సమాశ్రయం. వారి నుండి నేర్చిన సత్యాన్ని తనలో దర్శించే యత్నమే సాధన. ఆత్మవిచారణ. తాను ఏ ఆత్మజ్ఞానం కోసం తపిస్తున్నాడో, అదే సద్గురుని రూపంలో తారసిల్లే సరికి ఆయన యందు మనస్సు లగ్నమై పోతుంది. శరీరం ఆయన సేవకే అంకితమై పోతుంది - అదే గురుభక్తి. దానివలన కలుగుతుంది. దేనినీ కోరనవసరం లేని శాంతి, తృప్తి సిద్ధిస్తాయి."

ఆత్మజ్ఞానానికి నిరంతర ధ్యానమవసరం. నిరంతరం "రామా, రామా" అనుకోమని చెప్పేవారమ్మ. "రామా రామా" అందామంటే మనస్సు నిలకడగా





ఉండటం లేదు. ఏవో సంకల్పాలు వచ్చేస్తున్నాయి - ఎలాగమ్మా?" అని రంగమ్మ గారు అమ్మను అడిగితే, "నువ్వు రామా! రామా! అంటూ కూర్చో - మనస్సు

తిరిగి తిరిగి వేరే దారి లేక అదే నిలుస్తుంది" అన్నారు అమ్మ.

భాస్కరి అనే అమ్మాయి ఒకసారి అమ్మను ధ్యానం ఎలా చేయాలని అడిగితే అమ్మ ఇలా చెప్పారు - "మొదట ఓంకారం చేసి, ఆ తరువాత మనస్సులో 'రామ రామ' అనుకుంటూ మౌనంగా కూర్చోవాలి. ధ్యానం నుంచి లేచేటప్పుడు కూడా ఓంకారం చేయాలి. అప్పుడు చీపురు పెట్టి వాకిట్లో తుడిస్తే ఎంత శుభ్రంగా వుంటుందో అలా వుంటుంది. ఓంకారం చేసేటప్పుడు మనసులోని అజ్ఞానం తొలగిపోతుంది." మరొకరితో అమ్మ ఇలా చెప్పారు - ధ్యానం బంగారు ముద్ద వంటిది. ధ్యానానికి మించినది ఏదీ లేదు". "కాళ్ళు కడుక్కోకపోయినా ఫర్వాలేదే - రామ రామ అనుకోండే" అనేవారు అమ్మ. భగవంతునికి కావలసినది అంతశ్శుద్ధి గానీ, బాహ్యశుద్ధి కాదు. ఒకసారి విస్సయ్య పంతులు గారి చిన్న చెల్లి అమ్మతో, "అమ్మా! కుటీరం బయట అలికి ముగ్గుపెట్టనా?" అని అడిగితే, "వద్దమ్మా! వద్దు! మీరు లోపల అలుక్కోండే - లోపల అలుక్కోండే" అని చిన్నగా గొణుగుతున్నట్లుగా అన్నారమ్మ.

దేవుడు ఎక్కడ వున్నాడు? ఎట్లా వుంటాడు? - అని అడిగిన భక్తునితో విసనకర్రతో విసిరి, "బాబూ! గాలి బయట వున్నదా? విసన కర్రలో వున్నదా?" అన్నారు అమ్మ. భగవంతుడు పాలలోని వెన్నవలె సర్వవ్యాప్తంగా వుంటారు గానీ, చిలికితే తప్ప వెన్న విడివడి కన్పించనట్లే, భగవంతుని తెలుసుకొనే ప్రయత్నం చేయనిదే ఎట్లా కన్పిస్తాడు? ఒకరితో అంటారు అమ్మ : "భగవంతుడు దూరంగా ఎక్కడో లేడురా! మన నోట్లోనే వున్నాడు. 'రామ రామ' అనుకోరా! అని. "నేను మీ కంఠనాళం కంటే దగ్గరగానే వున్నాను" అని భగవంతుడు చెప్పినట్లు ఖురాన్ చెబుతుంది. 'నేను' అంటే ఎవరో జాగ్రత్తగా గమనించమని చెప్తారు రమణమహర్షి. అన్నిటిలోనూ - అంతటిలోనూ విశ్వమంతా వ్యాపించి వున్న చైతన్యమే 'నేను' అనే ఎరుకగా మనలోనూ వున్నదని గుర్తించి, ఆ గుర్తింపును అనుక్షణం నిలుపుకోవడానికి ప్రయత్నించడమే సాధనంతా.

కానీ, మనలో చాలామందికి ఆధ్యాత్మిక లక్ష్యం మీద సరైన విశ్వాసం,





దాన్ని సాధించాలనే పట్టుదలా వుండవు. అటువంటి వారికి భగవంతుడెట్లా కన్పిస్తారు? అని అడిగితే అమ్మ - "నాలుగు రూపాయలు సంపాదించాలని ఎలా

ఆతృత పడతామో అంతకన్నా ఎక్కువ ఆతృతపడాలి" అన్నారు. రామకృష్ణ పరమహంస కూడా 'దేవుడెట్లా కన్పిస్తాడు' అని అడిగిన భక్తునితో, "నీటిలో మునిగి పోతున్నప్పుడు ప్రాణ భీతితో బయటపడాలని ఎట్లా కొట్టుకుంటావో అట్లా భగవంతుడి కోసం గిలగిలలాడితే కన్పిస్తాడు" అంటారు. "సాధనంటే చేటలో జొన్నలు పోసి, అకు కూరలు కొనడం కాదే - భగవంతుని తెలుసు కోవాలన్న ఆత్మమథనం జరగాలి" అన్నారు మాల పిచ్చెమ్మగారు. "కోటికి పడగెత్తాలను కొన్నవాడు అనుక్షణమూ తన ప్రతి ఆలోచనా, ఇంకా ఇంకా డబ్బు సంపాదించడం కోసమే ఎలా వినియోగిస్తాడో ఆధ్యాత్మిక మార్గంలో కూడా అలాగే ప్రతి అడుగూ, ప్రతి ఆలోచనా మన లక్ష్యం వైపుగా వుండాలి" అంటారు మాస్టర్‌గారు.

అమ్మ వృథా కాలక్షేపం సహించేవారు కాదు. ఒక భక్తురాలు సంజయ్ గాంధీ మరణించిన వార్తలున్న పేపర్ చదువుతుంటే, "ఎందుకే ఆ పేపరు? గీత చదువరాదా? అన్నారమ్మ. మనలో కూడా చాలామంది చదువుకున్నవారు, వార్తాపత్రికలు చదవడం - రాజకీయాలు చర్చించడంలో తమ విరామ సమయాన్నంతా గడిపేస్తుంటారు. దాని వలన మనకు ఒరిగేదేమీ వుండదు. అంతేగాక, మనస్సు ఎల్లప్పుడూ బాహ్య విషయాలపైనే వుంటుందే, అదే అభ్యాసమై పోయి, అంతర్ముఖం కావడం చాలా కష్టమౌతుంది.

"ఇంద్రియాలంటే ఏమిటి?" అని అడిగిన భక్తునితో అమ్మ, "ఇంద్రియాలు ఏనుగు. మనస్సు గుర్రం. ఇంద్రియాలనరికట్టాలి" అన్నారు. సుశిక్షితుడైన రౌతుకే గుర్రం మాట వింటుంది. మనలాంటి వారు ఎక్కితే క్రింద పడేస్తుంది. మనస్సు కూడా అంతే! చిత్రమైన ఈ మనస్సును జాగ్రత్తగా గమనిస్తూ, నేర్పుగా మన మాట వినేటట్లు మచ్చిక చేసుకోవాలి. గుర్రానికి అటు ఇటు చూడకుండా కళ్ళ మీద గంతలు వేస్తారు. మన మనస్సనే గుర్రానికి కూడా మార్గం తప్ప, మరేమీ చూడకుండా గంతలు వేసి నడిపించాలి. ఈ గుర్రపు స్వారీయే సాధనంతా!

అయితే ఏ లక్ష్యాన్ని సాధించాలన్నా ఓర్పు కావాలి. శ్రీ శిరిడి సాయి బాబా వారి గురువు, బాబా తల బోడి చేయించి, రెండు పైసలు దక్షిణ అడిగారట





- ఒకటి నిష్ఠ, రెండవది సబూరీ (ఓరిమి) 'సంతోషంగా ఆ రెండూ సమర్పించాను'

- అంటారు బాబా! అలానే ఒకసారి సుందరకాండ చదువు తున్న లక్ష్మిగారితో అమ్మ, "ఓర్పు ఉండాలి. ఓర్పు ఉండబట్టే ఆంజనేయుడు కార్యం జయించుకొచ్చాడు. లేకపోతే, రామునికీ మాట వచ్చేదే - సుగ్రీవునికీ మాట వచ్చేదే - ఓర్పే దేముడు" అన్నారు.

ఒకరోజు రాత్రి అమ్మ కాళ్లకు నూనె రాస్తూ లక్ష్మిగారు, "సీతాదేవి ఎంత తెలివిగలదో" అన్నారు. అప్పుడమ్మ, "సీతాదేవి భూలోకమాత. అమ్మ రాముని కోసమే అలా వచ్చింది" అన్నారు. "ఆంజనేయులు కూడ తెలివిగలవాడేనండి" అని లక్ష్మి గారు హాస్యంగా అంటే అమ్మ, "బంటు అంటే అలా ఉండాలి - ఆంజనేయులు లాగా. సేవ అంటే అలా చేయాలి" అన్నారు అమ్మ.

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా..." అన్న గీతా శ్లోకానికి అసలైన అర్థం చెబుతూ నానాచందోర్కర్‌తో బాబా అంటారు : "మీకు బుద్ధి పుట్టినప్పుడు మాత్రమే చేసేది కాదు సేవంటే. గురుసేవ కోసమే తన శరీరం వున్నదనీ, దానిపై తన కెట్టి అధికారమూ లేదనీ తలచి చేసినదే సేవ. అట్టివాడే శిష్యుడు" అని. అలాంటి శిష్యుడైన దీపకుని కథ శ్రీ గురుచరిత్రలో చదువుతాం. అటువంటి సచ్ఛిష్యునికి సకల దేవతలూ, శ్రీ మహా విష్ణువు కూడా అధీనంలో వుంటారు. అమ్మ చెప్పిన ప్రతి చిన్నమాట వెనుకా, ఎంతటి లోతు గల ఆధ్యాత్మిక రహస్యాలున్నాయో తరచి చూచుకొన్నప్పుడే మనం అమ్మను అర్థం చేసుకొన్నట్లు!

"ఉపదేక్ష్యన్తితేనజ్ఞానం జ్ఞానినస్తత్త్వ దర్శినః" అనే వాక్యానికి శ్రీ సాయి నాథుడు చెప్పిన అర్థం ఇంతవరకు ఏ భాష్యకారుడూ చెప్పలేదు అంటారు మాష్టర్‌గారు. ఉపదేక్ష్యన్తితే అజ్ఞానం అంటూ బాబా ఇలా వివరిస్తారు : జ్ఞానమంటే అజ్ఞానాన్ని తొలగించడమే. జ్ఞానం అనుభవంతో మాత్రమే కల్గుతుంది గానీ, మాటలకు, ఊహలకు అందదు. కనుక దానిని వాచా బోధించడం సాధ్యం కాదు. పాత్రకు పట్టిన మసిని మట్టితో రుద్ది పోగొట్టినట్లు, గురువు తన బోధ అనే సాత్వికమైన అజ్ఞానంతో శిష్యుని అజ్ఞానాన్ని తొలగిస్తాడు. అందుకే అమ్మ వాచా ఏమీ బోధించే వారు కాదు. "మాటలే మాయ" అన్నారు అమ్మ. అవసరమైనప్పుడు మాత్రం





ఎదుటి వారి కర్థమయ్యే సామాన్య భాషలో, ముక్తసరిగా మూడు ముక్కలు - చిన్నగా లోగొంతుతో చెప్పేవారు. అయినప్పటికీ, వారి వాక్కుకున్న శక్తి వలన,

వినేవారి సంశయం తీరి, అమ్మ చెప్పదలచుకున్నది చిత్రంగా అనుభవమయ్యేది.

అమ్మ వాక్కు వేదవాక్కే! 'తత్త్వమసి' అనే వేద వాక్యానికి అమ్మ చెప్పిన అర్థం ఎంత హృద్యంగా వుందో - 'తాను మసి అవ్వడమేనే - తత్త్వమసి'అంటే అన్నారు అమ్మ. 'తాను' మసి అవ్వడమంటే - నేను వేరు - జగత్తు వేరు అనే అన్యత్వ భావాన్ని కాల్చివేయమని - అన్యత్వ భావం పోతే సర్వగతంగా వున్న చైతన్యమేదైతే వుందో అదే మనలోనూ అనుభవ మవుతుంది. అందుకనే అమ్మ అంటారు - "అహం బ్రహ్మాస్మి" అంటే అర్థమే మని అడిగిన భక్తునితో, "అహం చస్తే బ్రహ్మమే" అని! నిజానికి ప్రతివాడూ బ్రహ్మ స్వరూపే - కానీ అజ్ఞానం వలన తాను పరిమితుడైన వ్యక్తిగానూ, ప్రకృతి నుండి భిన్నుడుగానూ అనుభవం పొందుతున్నాడు. తాను పరిమితుడ నైన వ్యక్తిని అనే అహంకారాన్ని నిర్మూలించి నప్పుడు, మిగిలేది అంతా బ్రహ్మమే! నేను వేరు అనే భావాన్ని పోగొట్టుకోవడానికి బదులు కొందరు నేనే బ్రహ్మాన్ని అనే భావంతో 'అహం బ్రహ్మాస్మి" అని నామజపం చేస్తుంటారు. అమ్మ అటువంటి పొరపాటుకు తావే లేకుండా స్పష్టంగా, సులువుగా వివరిం చారు. తాను పరిమితుడను అన్న భావాన్ని పోగొట్టుకోవడానికి సంకేతమే ఏసుక్రీస్తుకు శిలువ వెయ్యడం - అని గ్నాస్టిక్స్ అనే సాంప్రదాయం వారు చెప్తారు. అమ్మ కూడ, "ఏసూ, రాముడూ వేరు కాదే" అంటారు.

అంతటి అవగాహన వున్న అమ్మకు వీరి కులం వారు, ఆ మతం వారు అనే భావం అసలు వుంటుందా? ఏ కులం వారైనా, ఏ మతం వారైనా, తన దగ్గరకు వచ్చినా - తప్పుకు తిరిగినా నమస్కరించినా - ద్వేషించినా, వారి పట్ల అమ్మ వైఖరిలో మార్పు వుండేది కాదు. పేదవాడైన కుమ్మరిదాసు అమ్మ దగ్గరకు తరచు వస్తుండేవాడు. అతడు తర్వాత క్రైస్తవ మతం స్వీకరించి అమ్మ వద్దకు రావడం మానేశాడు. ఆ విషయం భక్తులు అమ్మతో చెప్తే, అమ్మ అన్నారు, "పాపం, ఏం జేస్తాడే? మనమంతా తవ్వెడు బియ్యం ఇవ్వక పోతే" అన్నారు. తల్లి తన బిడ్డ ఎక్కడైనా కడుపునిండా తిని క్షేమంగా వుండ టమే కదా కోరుకునేది! అంతేకాదు - మన సమాజంలోని అసమానతల వలనా, అస్పృశ్యత వంటి





దురాచారాల వల్లనే ఎంతో మంది మతం మార్చు కోవడం జరిగిందన్న సత్యాన్ని అమ్మ చెప్పకనే చెప్పారు. మహాత్ముల బోధలను మనస్ఫూర్తిగా పాటిస్తే, సంఘంలో

హెచ్చు తగ్గులూ, కక్షలు కార్పణ్యాలూ లేకుండా దేశం సుఖశాంతులతో అలరారుతుంది. ఒకసారి గొయ్యమ్మ అనే హరిజన స్త్రీని పిలిచి అమ్మ తమ భిక్షాపాత్రలోనే ఆమెకు అన్నం కలిపి పెట్టారు. అక్కడి వారు, "అదేమిటి? మీ భిక్షాపాత్రలోనే పెట్టారు?" అంటే - "ఇది అలాగే పెడుతుందే - అంతే" అన్నారు.

"రాముడూ, కృష్ణుడూ అన్ని నామాల ముద్ద అయిన దానినే విభూతి అన్నారు" అని అమ్మ ఒక భక్తురాలితో చెప్పారు. నామ రూపాత్మకమైన జగత్తంతా, ఏ చైతన్యంతో చేయబడి వుందో, ఆ చైతన్య స్థితే విభుని (భగవంతుని) యొక్క అసలైన స్థితి - అదే విభూతి. అన్నింటినీ దహించి వేయగా మిగిలేది బూడిదయే కదా! కనుక విభూతిని పరమాత్మ స్థితికి సంకేతంగా తీసుకున్నారు. భగవంతుని ఏ నామంతోనైనా స్మరించవచ్చనీ, అన్ని నామాలూ ఆయనవేననీ విష్ణు సహస్రనామ స్తోత్రం చెప్తుంది. అను క్షణమూ ఈ భావాన్ని గుర్తుపెట్టుకోవడానికే విభూతిని భక్తితో ముఖాన ధరించేది.

అయితే జన సంసర్గం వలన అంతా ఒకటే అనే భావం చెదిరి, అన్యత్వ భావం బలపడుతుంది. అందుకే అమ్మ "మనం అస్తమానమూ జనంలో వుండకూడదు. ఏవో గొడవలు వస్తాయి. జనం లోంచి తప్పించుకు తిరగాలే" అన్నారు. రోడ్డుపై పోతున్న వారిని ఆసక్తిగా చూస్తున్న భక్తురాలితో అమ్మ "అలా చూడకే! "మన నీడ పడేంత మేర తప్ప దృష్టి పైకి పోనీయకూడదు" అని బోధించారు.

"కన్ను పెద్ద గుమ్మం - నోరు దొడ్డి గుమ్మం" - "కన్ను మూసుకోవే! కన్ను ఎన్ని తంటాలు తెచ్చి పెడతదే!" అన్నారు అమ్మ. 'కన్ను పెద్ద గుమ్మం' అంటే అన్ని ఇంద్రియాలలోకీ ప్రధానమైనది కన్ను - కంటితో చూచిన దాని ప్రభావం మనస్సు మీద చాలా గాఢంగా వుంటుంది. భిన్న భిన్న రూపాలనూ, వ్యక్తులనూ, సన్నివేశాలకూ ఆసక్తితో చూడటం వలన తదనుగుణమైన మనో భావాలు కలుగుతాయి. అంతటా నిండి వున్నది ఒకే చైతన్యమనే స్ఫురణ మరుపుకు వస్తుంది. అందుకే అమ్మ "కళ్ళు మూసుకోవే! రామా! రామా! అనుకోవే" అంటారు.





భాగవతంలోని అవధూత 24 మంది గురువు నుంచి బోధను గ్రహించి

నట్లుగా, అమ్మ ప్రకృతి నుంచి నిరంతరం బోధను గ్రహిస్తూ, భక్తుల క్కూడా అలా గ్రహించాలని నేర్పేవారు. ఒకసారి చెఱకును తెగి వుంటే వాళ్ళు లారీలో తీసుకెలుతున్నారు. ఆ చెఱకులాగా మనమూ తెగి వుండాలే ఎప్పుడు వెళ్ళడానికైనా మనం కూడా తెగిన చెఱకు లాగా సిద్ధంగా వుండాలి" అన్నారు అమ్మ.

ఒక భక్తురాలితో అమ్మ "సంవత్సరాది అంటే పాత బుద్ధులు వదిలి క్రొత్త మొదలు పెట్టటమే" అన్నారు. మన బట్టలు మాసిపోతే, మళ్ళీ మళ్ళీ ఉతికి, ఇస్త్రీ చేసి ధరిస్తాం - మన శరీరానికి రోజు రోజూ స్నానం చేయించి, శుభ్ర పరుస్తాం! బాహ్యమైన వీటికే ఇంత శ్రద్ధ అవసరమైనప్పుడు, మనలోని మన మనోగత భవాలను ఎప్పటికప్పుడు ఉతికి శుభ్రపరచుకోవాల్సిన అవసరం లేదా? సంవత్సరాది రోజున మనం ఎంత వరకు ఈ ప్రయత్నం చేస్తున్నాం అని ఒకసారి పునరావలోకనం చేసుకోవాలి. వదిలిపెట్టాల్సిన ఆలోచనలను వదిలిపెట్టి, లక్ష్యసిద్ధి కవసరమైన మంచి ఆలోచనలు మొదలు పెట్టాలి!

"కోపం వస్తే నీళ్ళమీద గీత లాగా వుండాలి. ఎక్కువసేపు వుండ కూడదు. సాధువులకు కోపం వస్తే ఎక్కువ సేపుండదే" అనేవారు అమ్మ. దానిక్కారణం ఏమిటని మాస్టర్‌గారిని అడిగితే, "మహాత్ములకు అహంకార ముండదు. లోక కళ్యాణానికై కర్తవ్యాన్ని నిర్వహించేందుకవసరమైనంత వరకే అహంకారముం టుంది" అన్నారు.

ఒకసారి ఒక భక్తురాలు అమ్మతో, "ఇక్కడికి వస్తం, పోడం తప్ప మాకు ఏముంది?" అంటే, "వత్తమైనా వచ్చిందిలే?" అన్నారమ్మ.

ఆత్మజ్ఞానాన్ని పొందడానికి అవసరమైనదంతా బోధించి, అందుకు సాధన తప్ప వేరే మార్గం లేదని చెప్పి, సాధన ఎలా చేసుకోవాలో, అందులోని మెళకువ లేవో అన్నీ అమ్మ తమదైన సులభశైలిలో చెప్పేసి, మిగిలినవన్నీ తమ ఆచరణ ద్వారా బోధించారు. కానీ, రకరకాల సంస్కారాలతో జన్మించిన మనకు, వాటిని ఆచరించడం అంత తేలికైన విషయం కాదు. అలా అని, నిరాశ చెందవలసిన పని లేదు. మహాత్ముల దర్శనమూ, వారి ఆశీస్సులే కొంత కర్మక్షయాన్ని గావిస్తాయి.





శ్రీ సిద్ధారూఢుల వద్దకు ఒక బిచ్చగత్తె వచ్చి, భిక్ష అర్థిస్తే, వారు, "ఈమె మహాత్ము లను హింసించి చంపింది. ఈమెను దూరంగా తరిమెయ్యండి" అని చెప్పి వెళ్ల

గొట్టారు. ఆమె ఆ విధంగా ఆరు జన్మలు గడపాల్సి వుందనీ, తమను చూచిన మాత్రానికే ఒక జన్మ పరిహరించ బడిందనీ, అక్కడి వారితో చెప్పారు. అందుకే అమ్మ అంటారు ఒక భక్తురాలితో - "వచ్చావు కదమ్మా! గుమ్మం ఎక్కావు కదా - అదే చాలు". అమ్మ ఒకసారి లక్ష్మిగారితో, "ఇంకా కర్మ అంటావేమిటే - ఇక్కడకు వచ్చాక కూడా కర్మ ఎక్కడుంది?" అన్నారు. మహాత్ముల సన్నిధి కర్మక్షయం గావిస్తుంది. అందుకే మహాత్ములను, "జంగమ తీర్థాలు" అన్నారు - అంటే నడిచే తీర్థక్షేత్రాలన్న మాట! ఒక మహాత్ములు కూడ లక్ష్మిగారితో, "అమ్మ సన్నిధి కాశీ - అమ్మ నెప్పుడూ విడిచి పెట్టకు. నువ్వింక ఎవరి దగ్గరకూ వెళ్లనవసరం లేదు" అన్నారు.

అమ్మ భక్తులతో, "చచ్చేదాకా వస్తూండండి" అన్నారు. అంటే అమ్మ వున్నంత వరకూ అని కాదు. మనం చచ్చేంత వరకూ వస్తూనే వుండాలని అమ్మ భావం. కారణం - "మహాత్ముల శరీర త్యాగానంతరం కూడ వారితో మనకు గల సంబంధం కొనసాగుతూనే వుంటుంది" అంటారు శ్రీ రమణ మహర్షి.

ఒక భక్తుడు అమ్మను, "మళయాళ స్వామికి జన్మ వుందిట కదా! మీరూ మా కోసం జన్మఎత్తుతారా?" అని అడిగితే "ఇది ఇక రాదు - ఇది ఇక జన్మకు రాదు - జన్మలేదు" అన్నారు. జరామరణ చక్రం నుంచి ఎప్పుడో బయటపడిపోయిన జీవన్ముక్తురాలు అమ్మ! అటువంటి వారు జీవించి వుండేది. లోక కళ్యాణార్థమే!

ఒకసారి అమ్మ "మనలో ఇద్దరు దొంగలున్నారు. ఒకటి నిద్ర, రెండవది తిండి. పొద్దుండగా తిండి కోసం తిరుగుతారు. రాత్రి అంతా నిద్ర. ఇలాగే కాలం గడిచిపోతుంది. ఇంకెప్పుడు దైవాన్ని చూచేది?" అన్నారు. ఇలానే శ్రీ సాయిబాబా కూడా మనల్ని హెచ్చరిస్తారు - 'మనమేమవుతాము? మట్టి మట్టిలోనూ, గాలి గాలిలోనూ కలిసిపోతాయి. ఈ అవకాశం ఇకరాదు' అనీ, "మనం ఎందుకొచ్చాం? పిడక లేరుకోవడానికా?" అనీనూ! దాదాపు మనందరి జీవితాలూ తిండి - నిద్రలలోనే గడిచిపోతున్నాయి - మనం జీవించేది మరణం కోసం మాత్రమే!





వికల మనస్కుడైన వచ్చిన ఒక భక్తునికి అమ్మ గీత ఇచ్చి చదవ మన్నారు. అతడు కర్మయోగమనే అధ్యాయం చదువుతుండగా అమ్మ అతని ప్రక్కనే కూర్చుని

"సారమైనదదే బాబూ - యోగం లేని జీవితమంతా తప్పే" అన్నారు. ఒక లక్ష్యపరంగా జీవితాన్నంతా మలచుకోవడమే యోగం - యోగం లేని జీవితం చుక్కాని లేని నావలాంటిది. ముముక్షువైన వాడు తన ప్రతి భావాన్నీ, ఆలోచననూ, వాక్కునూ, పనినీ - భగవంతుని తెలుసుకోవడమనే లక్ష్యం వైపుకే మరల్చుకోవాలి. "సాధన జీవితంలో ఒక భాగం గాక, జీవితమే సాధనలో ఒక భాగమై పోవాలి" అంటారు మాస్టర్‌గారు.

ఒక భక్తుడు ఒక పుస్తకం చదువుతుండగా, అందులో ఒక వాక్యం ఇలా వున్నది - 'అన్నిటినీ మృత్యువు తినేస్తోంది. మృత్యువును తినేది ఏది?' అని. ఈ వాక్యాన్ని మళ్ళీ చదవమని అమ్మ "అన్నింటినీ మృత్యువు తినేస్తోంది నిజమే. మరి మృత్యువును తినేది రామ నామమే" అన్నారు.

ఒక భక్తునికి అమ్మ మట్టిపాత్ర యిచ్చి, దానిలో రోజూ అన్నం తినమని చెప్పారు. మట్టిపాత్రలో ఎందుకన్నం తినడం అంటే, అమ్మ 'మనం తినేది మట్టి అనీ, ఎదుటి వారికి పెట్టేదే మనకు మిగులుతుందనీ గుర్తుంచుకోవడానికి' అన్నారు. అంటే ఏదైనా ఇతరులకు మనం పెట్టేదే మనకు పుణ్య రూపంలో వచ్చే జన్మకు మిగులుతుందన్నమాట. అమ్మ తన వద్దకు వచ్చే స్త్రీతో తరచూ దానం చేయమని చెప్తుండేవారు. "ప్రొద్దున్నే పొయ్యే, లెయ్యే అనకండే! రామ! రామ! అంటూ చేయి చాచండే! (దానం చేయండే)" అనేవారు.

అమ్మ భక్తురాలైన శాంతమ్మగారు తనకు మనశ్శాంతి కరువైందని అమ్మతో చెప్పారు. అమ్మ "యుద్ధాన్ని జయించాలి" అని చెప్పి, మావుడూరి బుచ్చమ్మగారి దగ్గరుండమని పంపారు.

అమ్మ కట్టా సత్యంగారితో ఒకసారి, "మానావమానాలు లేకుండా వుండాలి- అదే అపరిగ్రహ వ్రతమంటే" అన్నారు. సాధారణంగా ఎవరి నుంచీ ఏ వస్తువునూ తీసుకోక పోవడం అపరిగ్రహమనుకొంటారు. దానికన్నా ముఖ్యమైనది మరొకటుంది. తిట్టినా, పొగిడినా చలించక సమభావంతో ఉండగల్గడం! అదెలా సాధ్యం?





అంటే పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్‌గారంటారు - "ఒకడు నిన్ను తిట్టాడనుకో, అవమానించాడనుకో - అది నీ పట్ల వాడికున్న వాడి భావమే! లేదా - ఒకడు

నిన్ను పొగిడాడనుకో, గౌరవించాడనుకో - అదీ నీ పట్ల వాడికున్న వాడి భావమే! రెండూ వాడి భావాలే గానీ, 'నువ్వు' కాదు గదా! కానప్పుడు తిడితే బాధగానీ, పొగిడితే సంతోషంగానీ ఎందుకు?" మానావమానాలు లేకుండటమంటే అదే!

తరచూ సినిమాలు చూసే అలవాటుండేది మంగమ్మగారికి. తన భక్తులు సినిమాలు, తమాషాలూ చూస్తూ కాలాన్ని వృథా చేయడాన్ని నిరసించేవారు అమ్మ. చాలామంది ఆ అలవాటు మానుకున్నారు. కానీ, మంగమ్మ గారికి ఏదైనా మంచి సినిమా వస్తే, మనసు ఆగేది కాదు. ఒకరోజు అమ్మ మంగమ్మగారిని పిలిచి, "మంగి, ఈ రోజు నుంచీ నీకు సినిమాకు వెళ్ళాలని అనిపించినప్పుడల్లా, ఆ డబ్బులు తెచ్చి ఇక్కడ పెట్టి వెళ్ళవే" అన్నారు. అమ్మ మాటల్లోని తీవ్రత కంటే, అమ్మ సంకల్పంలోని తీవ్రత యొక్క ఫలితమో ఏమో, మంగమ్మగారికి సినిమా చూడాలనే కోరిక అంతటితో అంతరించి పోయింది. క్షేత్రయ్య సినిమాకి వెళ్తానని అడిగితే, ఎర్రమంగమ్మనేమో, "ఆ రెండు రూపాయలూ ఇక్కడ రాముల వారికి వేసి వెళ్ళు" అన్నారు. లక్ష్మిగారినేమో, "నువ్వు నిరాకారం చూశావు గనకా-సాకారం మానడానికి? పోయే!" అన్నారు.

ఒకసారి కస్తూరిగారు సినిమాలు చూడకూడదనుకుని 8 మాసాల పాటు మానేశారు. తర్వాత స్నేహితులతో కలిసి మళ్ళీ సినిమాల కెళ్ళడం ప్రారంభించారు. రాగానే అమ్మ ఆమెతో, "చూస్తే అన్నీ చూసి! లేకపోతే మొత్తానికీ మానేసెయ్! ఏదన్నా అనుకున్నాక ఆపకూడదు" అన్నారు.

అమ్మ భిక్షాపాత్రలో కొంచెం అన్నం ఉంచి, ధ్యానం చేసుకొనే గదిలో వుంచేవారు. 'అది ఎందుకమ్మా?' అంటే, 'బాబు (దైవం) అనేక రూపాల్లో తింటాడే' అన్నారు.

లక్ష్మిగారు ఎక్కడయినా ఆధ్యాత్మిక ఉపన్యాసం విని వచ్చి సంతోషిస్తుంటే, "అది పొరుగింటి కూర లాంటిదే" అనేవారు. "వినడం కూర అంత వినాలి - ధ్యానం అన్నమంత చేయాలి" అని చెప్పేవారమ్మ. విన్నది ఆచరించకపోతే





వ్యర్థం! లక్ష్మిగారు ఒక సాధుపుంగవుని గూర్చి చెబుతూ, 'వారు చాలా మంచివారు' అంటే 'ఎవరో మంచి వాళ్ళయితే మనకేమొస్తుందే-మనం మంచి వాళ్ళ కావాలి'

అన్నారు అమ్మ. "తిరిగితే తిప్పలు కూర్చుంటే కుప్పలు. ఎక్కడికీ తిరగకే" అనీ, "అక్కడికీ ఇక్కడికీ అని పరిగెత్తడం ఎందుకు? అంతా ఇక్కడే వుంది" అనీ చెప్పారమ్మ! "ఇక్కడున్న ఆనందం పెద్ద తిరుపతిలో లేదు-అక్కడున్న మేళతాళాలు ఇక్కడ లేవు" అని అమ్మ ఒకరితో అన్నారు.

అమ్మ నోటి నుంచి వెలువడిన ప్రతి వాక్యం - ఒక వేద మంత్రం. ఎందుకంటే అది సాక్షాత్తూ పరబ్రహ్మస్వరూపురాలైన అవధూత యొక్క అను భవం నుండి వెలువడినది కాబట్టి! వాటిని శ్రవణం చేయడమే కాదు - మననం (బాగా ఆలోచించి) చేసి, ఆచరించడానికి కనీస ప్రయత్నమైనా చేయాలి. ఇదే ఉపనిషత్తులూ, భగవద్గీతా చెప్పేది.

అమ్మ జీవిత విధానమే ముముక్షువులకు ఆదర్శ ప్రాయం. వారి జీవితమే ఒక ఉపదేశం, బోధ! అమ్మ బోధకు పరాకాష్ఠ వంటి ఒక ఉదాహరణ-

అమ్మ అప్పుడప్పుడూ అశుద్ధం తీసుకుని తినేవారట! పాకుడు పట్టి కంపుకొడుతున్న మురుగునీరు దోసిలితో తీసుకుని త్రాగేవారట! ఈ సృష్టిలోని సకల చరాచర, జడ జీవ వస్తు సముదాయమంతా బ్రహ్మమయమనీ, అన్నిటిలో, అంతటిలో నిండివున్నది బ్రహ్మమేననీ అమ్మ ఏనాడూ వాచా బోధించలేదు - అన్నాన్నీ, అశుద్ధాన్నీ సమభావంతో భుజించగల అమ్మ ఆచరణయే ఆమె బోధకు పరాకాష్ఠ!

★★★





అధ్యాయం - 4

## అమ్మ మహాసమాధి

జన్మించిన ప్రతి జీవీ మరణించవలసిందే. కానీ, "మహాత్ములు మరణిం చరు - సమాధి అవుతారు" అనీ, "మహాత్ములు శరీర త్యాగం చేసి నప్పటికీ నిత్య సత్యులే" అనీ అంటారు. కారణం వారు శరీరమున్నప్పుడు కూడా దేహ పరిమితులుగా వుండరు. శరీర త్యాగం చేసిన తర్వాత కూడా, దేహంతో ప్రత్యక్ష దర్శనం ప్రసాదిస్తూనే వుంటారు. తమ అవతార కార్యాన్ని కొనసాగిస్తూనే వుంటారు. "నా మట్టి మాట్లాడుతుంది, నా సమాధి సమాధానం చెబుతుంది" అనీ సాయిబాబా అన్నారు. శరీరమే తామని భ్రమించే పామరులకు జనన మరణాలుంటాయి గానీ, మృత్యువుపై విజయం సాధించిన మహాత్ములకు కాదు. అమ్మ కృాదా అంతే! కానీ, శరీరంతో వుండగా వారిని దర్శించి, సేవించిన భక్తులకు-మును పటిలా అమ్మ నిరంతరం కనిపించడం, మాట్లాడటం వుండదు గనుక, అది బాధాకరమైన విషయమే. కేవలం మనకోసమైనా వారు మరికొన్ని రోజులు జీవించి వుండకూడదా!' అనిపించడం సహజం. కానీ, వారు ప్రకృతి ధర్మాలను అతిక్రమిం చరు. అయితే, 'మనం మళ్ళీ మళ్ళీ కలుస్తుంటా' అని బాబా చెప్పినట్లు, వారు అవసరాన్ని బట్టి, మళ్లీ మళ్ళీ మనకోసం, ఏదో ఒక రూపంలో అవతరిస్తూనే వుంటారు.

దాదాపు 60 సం॥పాటు చివటంలోనూ, పరిసర గ్రామాల్లోనూ సంచరించి తమ అవతార కార్యాన్ని నిర్వహించిన అమ్మ శరీర త్యాగం చేసే సమయం ఆసన్నమైంది. ఆమె తాము సమాధి చెందబోతున్నామని ముందు గానే, చూచాయగా, తమ చెంతనున్న వారికి తెలియజేస్తూ వచ్చారు.

సమాధికి కొన్నాళ్ళ ముందు ఒక భక్తురాలితో అమ్మ 'ఇక నువ్వు రాకే' అన్నారట. తర్వాత మూడు రోజులకు అమ్మ సమాధి చెందటం జరిగింది. ఒక





భక్తునితో అమ్మ "నా సమాధి ఇక్కడే జరుగుతుంది. కాలం దగ్గరకు వస్తుంది" అన్నారట. మరొక భక్తునితో, "ఇది వెళ్ళిపోయాక కన్పిస్తుందిరా-అసలు మక

రందం" అన్నారు.

7-6-81 ఆదివారం నాడు అత్తిలి హనుమంతరావుగారు, తన సోదరులతో కలిసి అమ్మను దర్శించడానికి వెళ్లారు. "మేము వెళ్ళేసరికి అమ్మ రామాలయంలో గడపమీద తలవుంచి పడుకొని వున్నారు. అప్పటికి వారం రోజు నుండి జ్వరంతో వున్నారు. అమ్మలేచి కూర్చుంటామంటే అక్కడ వున్న లక్ష్మిగారు, 'లేవటం ఎందుకమ్మా? మన హనుమంతరావు బాబే కదా'అన్నారు. 'ఎవరు వచ్చినా లేవాలి' అంటూ కూర్చున్నారు అమ్మ. అమ్మకు నమస్కరించుకుని కూర్చుంటే, అమ్మ ప్రసాదం ఇచ్చి, 'ఇక వెళ్ళొస్తారా బాబూ'అన్నారు. అక్కడ వుంటే అమ్మకు ఇబ్బందిగా వుంటుందని వెంటనే లేచి బయలుదేరాము. నేను రోడ్డు మలుపు తిరిగే వరకు వెనుకకు తిరిగి అమ్మను చూస్తూనే వున్నాను. గడప మీద తలవుంచి పడుకుని వున్న అమ్మ, తల వెనుకకు వంచి నన్ను చూస్తూనే వున్నారు. గడపపై పెట్టిన తలను వెనుకకు వంచి చూడటం చాలా కష్టం. అయినా అమ్మ అలా చూస్తుంటే, ఈ ప్రేమమూర్తిని మరలా ఇక చూస్తానో చూడనో అన్పించింది. నా మనస్సు శంకించినట్లు ఆ మర్నాడు 8-6-81 సోమవారం రాత్రి అమ్మ సమాధి చెందారనే వార్త తెలిసింది" అంటారు హనుమంతరావుగారు.

తేతలి వాస్తవ్యులు బదరీనాథ్ గారికి సరిగ్గా అమ్మ సమాధి అవుతున్న సమయంలో ఇలా స్వప్నం వచ్చింది. "అమ్మగారి దగ్గర కొంతమంది భక్తులు కూర్చుని వున్నారు. అమ్మగారు భిక్షాపాత్ర పట్టుకొని వున్నారు. అది కాశీ అన్నపూర్ణేశ్వరి చేతిలోని కొబ్బరి చిప్పలాగా వుంది. కొంతమందికి స్వయంగా అమ్మగారే భిక్షపెట్టి, "బాబు, ఇది పంచి పెట్టు" అని నా చేతకిచ్చారు. అదే స్వప్నంలో, "అమ్మగారు ఉత్తరదిశగా దేహం వదిలి వెళ్ళారని" చెప్పారు. అక్కడ ఆకాశవాణి, "అమ్మగారు మీ గూర్చి అంత నెప్పులు, బాధలు ఓర్చి, చిరునవ్వుతో లేని ఓపిక తెచ్చుకొని తిరిగారని" చెప్పింది. రాత్రి 12.05 ప్రాంతంలో ఈ కల వచ్చింది. సరిగ్గా అమ్మ సమాధి అయింది అదే సమయానికి.

లలిత అనే ఆమెకు అమ్మ సమాధి చెందిన రాత్రి, ఒక జ్యోతి ఆకాశం





వైపు వెళుతున్నట్లు దర్శనమైంది.

అమ్మ సమాధి చెందడానికి కొద్ది రోజులు ముందు శ్రీ ఎం. శ్రీరామమూర్తి

గారు అమ్మ దర్శనానికి వెళ్లినపుడు అమ్మ- "అలా కూర్చుని ధ్యానం చేసుకో బాబు" అన్నారు. "ఆ రోజు ధ్యానంలో నా మనస్సు నిశ్చలంగా నిలచి నాకు ఎంతో ఆనందం అనుభవమైంది. నేను ధ్యాన స్థితిలో వుండగా అమ్మ శరీరం నుండి జ్యోతి ఆకారంగా కాంతి బయటకు వచ్చి, వెంకటేశ్వర స్వామి విగ్రహంలో లీనమైన దృశ్యం స్పష్టంగా కన్పించింది. చివటంలో నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠకై తీసుకొచ్చిన విగ్రహాలు రామాలయంలో వుంచారు. సరిగ్గా విగ్రహ ప్రతిష్ఠ జరిగే రోజునే అమ్మ దేహాన్ని సమాధిలో ఉంచడమైంది" అంటారు శ్రీ రామమూర్తిగారు.

సమాధికి రెండు రోజుల ముందు సత్యంగారితో అమ్మ, "ఇటువంటి ఫోటోలు (అమ్మ పద్మాసనం వేసుకొని కూర్చున్న ఫోటో) వంద ఫోటోలకు ఎంత ఖరీదు అవుతుంది?" అని అడిగారట. 'ఎందకమ్మా?', అంటే, "మీరు తలోకటి తీసుకుంటారని" అన్నారు. అలా అమ్మ రాబోయే తన నిర్యాణాన్ని సూచించడమే కాకుండా, తనకూ-తన చిత్రపటానికీ భేదం లేదనీ, ఇక ముందు పటం రూపంలో వున్న అమ్మను పూజించుకోమనీ చెప్పారనిపిస్తుంది. 'అమ్మా! మిమ్మల్ని చూస్తే నాకేదో భయంగా ఉంది - ఏమిటమ్మా అలా వున్నారూ?' అని అడిగితే - "ఇది పాల మీద పొంగులా వచ్చి పోతూ ఉంటుంది. ఇది ఇంతే" అన్నారు. ఈ శరీరం పాలమీద పొంగులా వచ్చి పోతూ వుండేదనీ, ఆత్మ నశ్వరమనీ బోధిస్తూనే - తన అవతార సమాప్తిని కూడా సూచించారు అమ్మ.

అమ్మ మహాసమాధికి రెండు రోజులు ముందు కట్టా సత్యంగారితో భగవద్గీత చదివించుకొని విన్నారు. అమ్మ కళ్లు మూసుకుని పుస్తకం మధ్యలో పట్టుకొని పేజీ విప్పారు. అది సరిగ్గా 8వ అధ్యాయం, 5వ శ్లోకం 'అంత్యకాలేచ......' అన్న శ్లోకం దగ్గర తెరుచుకున్నది. (ఎవరైతే మరణ సమయంలో నన్నే స్మరణ చేస్తూ, శరీరాన్ని విడిచి వెడతారో అట్టివాడు నా స్వరూపాన్ని పొందుతాడు అని ఆ శ్లోకార్థం) "అమ్మ సరిగ్గా ఇది తీసి యిచ్చా రేమిటి?" అని గిలిపడుతూనే చదవడం ప్రారంభించాడు. అమ్మ గీత పూర్తిగా 18 అధ్యాయాలూ చదివించుకొని





విన్నారు. సాయంత్రం అయింది.

ఈ లోపున ఒకరు వచ్చి, "అమ్మా!

కు వెళ్తున్నాడు - కాస్త దయవుంచండి" అని నమస్కరించుకొని వెళ్లిపోయారు. ఈ లోపున ఇంకో వ్యక్తి వచ్చి, "అమ్మా! మా అమ్మ ప్రాణా పాయంలో వున్నారు. ఎక్కడో తుంగభద్ర నుంచి వచ్చాను. మీ చేతులతో కొంచెం ఉదకం దీవించి ఇవ్వండి" అన్నాడు. పెద్ద సీసాతో నీళ్ల తెప్పించి, దాన్ని చేత్తో పట్టుకొని, కళ్ల మూసుకొని దీవించి ఇచ్చారు.

ఆ రోజు అమ్మగారి ఆరోగ్యం కొంచెం మెరుగైంది అనుకొన్నారు సత్యం గారు. "అమ్మా! మీ ముఖంలో చిరునవ్వు ఇప్పుడు కన్పిస్తున్నది. నాకు చాలమ్మా. "వస్తానులే అమ్మా! అన్నాను కానీ నాకు వెళ్ళాలని మనసుకు అన్పించలేదు. నేను వెళ్ళి అక్కడి వారి మనస్సు నొప్పించడం ఇష్టంలేక పోయింది. మర్నాడు నేను వెళ్ళలేదు. అంతే! ఆ రోజే సరిగ్గా రాత్రి 12-05 గంటలకు అమ్మ సమాధి చెందారని తెల్లవారి కబురు వచ్చింది" అంటూ విలపిస్తారు సత్యంగారు.

1981 మే 31వ తేదీ నుండి అమ్మకు జ్వరం వస్తూనే వుంది. అంత జ్వరంలోనూ అమ్మ తన దైనందిన చర్యను యథావిధిగా కొనసాగించారు. రోజూ భక్తుల చేత భగవద్గీత చదివించేవారు. నడవడానికి ఓపిక లేకపోయినా, ఎవరో ఒకరిని ఆసరాగా చేసుకొని వారి భుజంపై చేయివేసి నడుస్తూ భిక్ష చేసేవారు. జ్వరం తగ్గుతూ, హెచ్చుతూ వుండేది. బ్రహ్మం అనే భక్తుడు అమ్మకు హోమియో మందు వేసేవాడు. అయినా జ్వరం తగ్గకపోవడం వల్ల గ్రామంలోని జిన్నా అనే వైద్యుని పిలిచి వైద్యం చేయించారు. కానీ ఫలితం లేదు. తణుకు నుండి పెద్ద డాక్టరు గారిని పిలుచుకొస్తామంటే, అమ్మ అంగీకరించలేదు. తర్వాత భక్తుల బాధ చూడలేక 7వ తేదీ "అయితే తెచ్చుకోండే. డాక్టరుగారిని తీసుకొచ్చుకోండే' అన్నారు అమ్మ. అమ్మ నోట ఆ మాట రాగానే సూరమ్మగారు కాలినడకన తణుకు వెళ్ళి డా॥ నరసింహారావు గారిని పిలుచుకొచ్చారు. తీరా డాక్టరుగారు వచ్చేసరికి అమ్మకు జ్వరం లేదు. "ఎంత కష్టపడి వెళ్లావే, ఎంత కష్టపడ్డావే - నాకు జ్వరం లేదుటే, అన్నం తినిపించేశారే డాక్టరు బాబు" అన్నారు అమ్మ. డాక్టరు అటు వెళ్ళిన కాస్సేపటికి అమ్మకు యధాప్రకారం జ్వరం! జ్వరంతో మూలుగుతున్నారు.





"డాక్టరుగారు వచ్చేసరికి జ్వరం లేకుండా చేసుకుంటారు. ఆయన వెళ్లిపోయాక జ్వరం తెచ్చుకొని మూలుగుతారు - ఇలా అయితే ఎలా అమ్మా?" అన్నారు

సూరమ్మగారు. "పోనీలేవే అమ్మా - ఈసారి డాక్టరుగారు వచ్చినప్పుడు కూడా మూలుగుతాను లేవే" అన్నారు అమ్మ. ఆ రోజు బ్రహ్మంగారు వస్తే అన్నం పెట్టి యిచ్చి, "నువ్వు అన్నం తిను బాబూ... రేపు నువ్వు రావద్దు... ఎల్లుండిరా" అన్నారు అమ్మ.

అమ్మ తన పన్ను పీకించి సూరమ్మగారికి యిచ్చి, దాచుకోమన్నారట. ఈ సూరమ్మగారినే అమ్మ 'మాయ' అనే పేరుతో పిలిచేవారు.

మర్నాడు 8-6-81 తేదీన అమ్మకు జ్వరం తీవ్రంగా వుండటంతో భక్తులంతా ఆందోళనపడ్డారు.

చివటంలో నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠకు తెనాలి నుంచి తీసుకొచ్చిన వెంకటేశ్వరస్వామి, దేవేరుల శిలావిగ్రహాలు రామాలయంలో వుంచి వెళ్లారు. మూడు రోజులైంది. మూడు రోజులూ విగ్రహాలకు పూజలు జరిగాయి. "బాబు ఇక్కడొద్దు - బాబుని కట్టిపెట్టద్దు - వద్దు - వద్దు - తీసికెళ్లి పొండి" అని సప్తమి రోజు విగ్రహాలను రామాలయం నుండి ఊరేగింపుగా దేవాలయానికి పంపించారు. అమ్మ తన వద్ద వున్న భక్తులను ఊరేగింపుగా వెళ్ళి రమ్మని పంపించారు.

ఆ సాయంకాలం రాజమండ్రి నుండి పదిమంది అమ్మ దర్శనానికివస్తే, అమ్మకు జ్వరం తీవ్రంగా వుండటాన వారిని రామాలయంలోనే కూర్చో బెట్టి అమ్మ ఫొటోలు చూపిస్తున్నారు సూరమ్మగారు. అంతలో అమ్మ సూరమ్మ గారిని పిలిపించి, 'వాళ్ళు ఎంత దూరం నుండి కష్టపడి వచ్చారో - వాళ్ళను రమ్మనవే' అన్నారు అమ్మ. వారు అమ్మను తృప్తిగా దర్శించుకున్నాక, అందరికీ మామిడి పండ్లు ప్రసాదంగా ఇచ్చి పంపించారు. అంతలో తణుకు నుండి డాక్టరు వచ్చారు. ఆయన అమ్మ కుటీరంలోనికి ప్రవేశించేసరికి అమ్మ గట్టిగా మూలగనారంభించారు. డాక్టరుగారు అమ్మను పరీక్ష చేసి, జ్వరం తీవ్రంగా ఉన్నదని చెప్పి, ఇంజక్షను చేసి వెళ్ళారు. అమ్మ "రేపాయన రావలసిన పనిలేదు" అని చెప్పారు.





సాయంత్రం అమ్మ భగవద్గీత చదివించుకొని విన్నారు. చీకటి పడ్డాక తనకు పెరుగు అన్నం, మామిడిపండు కావాలని అడిగారు. అవన్నీ పిసికి, రసం గ్లాసులో

ఇవ్వగా తీసుకున్నారు అమ్మ.

రాత్రి గడిచేకొద్దీ అమ్మ ఆరోగ్య పరిస్థితి క్షీణించసాగింది. లక్ష్మిగారి ఒడిలో తలపెట్టుకొని, కృష్ణగారి ఒడిలో కాళ్ళు పెట్టుకొని విఘ్నేశ్వరుని పటం క్రింద పడుకున్నారు.

అమ్మ ఇక సమాధి చెందుతారని గ్రహించి ఏడుస్తున్న భక్తులతో అమ్మ **"ఆడది కంటనీరు పెట్టకూడదే, ఇంటికి జయంకాదే, కంటినీరు కంటిలోనే వుండాలి. పైకి ఏడవకూడదు. కంటనీరే కట్టలేదు మీకు - ఇన్నాళ్ళూ విన్నది ఏం చేశారే?** అంటూ చెంతనే వున్న లక్ష్మి, భాస్కరి మొ॥న వారికి ఆఖరి సందేశమిచ్చారు.

**"పోట్లాడుకునేప్పుడు, ఎవరైనా రెండు అంటే పది అనకూడదు. ఎప్పుడూ దృఢంగా వుండాలి - ఏడవకూడదు. గుమ్మంలోకి వచ్చిన వారికి ఒక ముద్ద చేతిలో పెట్టి మంచి నీరివ్వాలి. అలా అయితే పైకి పోతారు. ఈ గ్రామానికి 'చివటపురం' అని పేరు వస్తుంది"** - అని చెప్పారు.

సుమారు రాత్రి 12 గం॥లు కావస్తుండగా అమ్మ ఒక్కసారిగా మూలగటం మాని, ఈశాన్య మూలగా చూస్తూ, 'వస్తున్నా వస్తున్నాను ఉండు'అని గర్జించి పలికారు. అక్కడ వున్న వారితో కొబ్బరికాయ కొట్టి, హారతి ఇమ్మన్నారు అమ్మ. హారతి ఇచ్చాక, సరిగ్గా రాత్రి 12 గం॥5నిమిషాలకు భౌతిక శరీరాన్ని త్యజించారు. **అంటే, 8-6-81 సోమవారం రాత్రి 12 గం॥ 0.5ని॥ (తెల్లవారితే మంగళవారం) - దుర్మతినామ సంవత్సర జ్యేష్ఠ శుద్ధ సప్తమి సోమవారము నాడు అమ్మ మహాసమాధి చెందారు.**

క్షణాల మీద అమ్మ సమాధి చెందారన్న వార్త నలుమూలలా వ్యాపించింది. ఆఖరి దర్శనము కోసమై భక్తులు తండోపతండాలుగా రాసాగారు. వారి దర్శనము కోసమై అమ్మను కూర్చోబెట్టారు. చిత్రమైన విషయము ఏమిటంటే, అమ్మ శరీర త్యాగం చేశాక, అమ్మ శరీరంలో అలౌకికమైన తేజస్సు క్రమంగా పెరిగి, తెల్లవారేసరికి శరీరం అంతా విభూతి రంగులోనికి మారింది. వాదపల్లి





బాబుగారు అమ్మ శిరస్సు మీద పుష్పాలను తొలగించి చూడగా కపాలభాగం చీలి, రక్తం గడ్డ కట్టి వుంది. బ్రహ్మ రంధ్రం గుండా ప్రాణ త్యాగం చేసిన

యోగీశ్వరులు అమ్మ.

దూర దూరాల్నుంచి భక్తులు వచ్చి, అమ్మను దర్శించుకున్నారు. ప్రేమను పంచే అమ్మ తమను విడిచి పెట్టి వెళ్ళి పోయినందున కన్నీరు మున్నీరుగా విలపించారు. అమ్మ సన్నిధిలో భజనలు, సంకీర్తనలు జరిగాయి. అమ్మ దేహాన్ని విభూదితో అభిషేకించారు. రామాలయానికి మూడు ప్రదక్షిణలు చేసి, అమ్మను రామాలయంలో కూర్చుండ బెట్టారు. రామ నామ స్మరణతో, జయ జయ ధ్వానాలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగి పోయింది. అమ్మ దేహాన్ని పర్ణ శాలకు ప్రక్కగా వున్న స్థలంలో సమాధి చేయడానికి నిర్ణయించారు. రాజమండ్రి నుంచి వచ్చిన సాధు స్త్రీలు వేద ఘోష చేస్తుండగా 10-6-81 (జ్యేష్ఠ శుద్ధ నవమి) సాయంత్రం 4 గం॥25 ని॥లకు అమ్మ దేహాన్ని సమాధిలో కూర్చుండబెట్టారు.

అమ్మ సమాధి అయిన 8వ రోజుకు ఆచార్య శ్రీ భరద్వాజ మాస్టరు గారు చివటం చేరుకున్నారు. అమ్మను కోల్పోయి దుఃఖ సాగరంలో మునిగి వున్న అమ్మ భక్తులందరూ మాస్టర్‌గారిని చూడటంతోనే బావురుమని కన్నీరు మున్నీరుగా విలపించారు. అమ్మ ఎక్కడికీ వెళ్ళి పోలేదనీ, చైతన్యరూపులై నిత్య సత్యులై అక్కడే వున్నారనీ, అమ్మ నిజతత్వాన్ని వారికి బోధించి, వారిని శాంత పరిచారు. "ఇది వరకు అమ్మ తమ చేత్తో ప్రసాదం పెట్టేవారు - ఇప్పుడు అమ్మ తమ ఒడిలో ప్రసాదం పోసుకొని కూర్చున్నారు - ఎవరికి చేతనైనంత వారు తీసుకోవడమే" అని చెప్పారు మాస్టర్‌గారు. 11వ రోజు వరకు అక్కడే వుండి, సత్సంగ కార్యక్రమాలను నిర్వహించారు. 10వ రోజున మాస్టర్‌గారు అమ్మ సమాధి మీద అమ్మ ఫొటోను ఉంచి షోడశోపచార పూజ చేశారు. విస్సయ్య పంతులు గారికి, ఫొటో స్థానే అమ్మ ప్రత్యక్షంగా కూర్చుని దర్శనం ఇచ్చారు. మాస్టర్‌గారికి అమ్మ చేతితో తమను స్పృశించినట్లు అనుభవమైంది. అక్కడున్న భక్తులందరికీ తాము అమ్మ సన్నిధిలో కూర్చున్న అనుభూతి కలిగింది.

18-6-81 గురువారం ఉదయం 9 గం॥లకు శ్రీ మాస్టర్‌గారు అమ్మ





సమాధి మందిర నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. భక్తుల కోరికపై శ్రీ మాస్టర్‌గారు శ్రీ వాడపల్లి బాబుగారితోను, భక్త సమూహంతోను కలిసి అమ్మ సమాధికి పూజ

చేసి, ఉత్తరపు దిక్కున ఒక గోతిని త్రవ్వించి, దానిలో అమ్మ వాడిన పవిత్ర వస్తువులనుంచారు. శ్రీ వాడపల్లి బాబుగారు అమ్మ సమాధి అయిన రోజు నుండీ, మందిర శంఖుస్థాపన జరిగేదాకా వుండి, కార్యక్రమాల న్నిటినీ పర్యవేక్షించారు.

అమ్మ సమాధి అనంతరం కూడా ఎందరో భక్తులకు భౌతికంగా దర్శనమిచ్చి, ఊరట కలిగించారు. అర్హులైన భక్తులకు ఈ నాటికీ భౌతిక శరీరంతో దర్శనం ఇస్తున్నారు. అమ్మ జీవించి వున్నప్పుడు కూడా మనవలె శరీరపరిమితులు కారు. చివటంలోనూ, వేరొక ప్రదేశంలోనూ, ఏక కాలంలో దర్శన మిచ్చిన అమ్మకు, శరీరం అనేది ఒక ముసుగు వంటిది. అమ్మ తమ ఇచ్ఛానుసారంగా ఎప్పుడైనా శరీరాన్ని ధరించగలరు. అలాంటి వారికి మరణమెలా సంభవం? అందుకనే మహాత్ములు చనిపోరు - సమాధి అవుతారు అంటారు. సమాధి నుంచి బయటకు వచ్చి, ఎప్పుడైనా యథేచ్ఛగా సంచరించగలరు మహాత్ములు.

అమ్మ భౌతిక కాయాన్ని సమాధి చేసిన తర్వాత అమ్మ కుటీరం వద్ద కూర్చుని శోకిస్తున్న సూరమ్మగారికి, అమ్మ కూర్చునే చోట అరుగులో నుంచి, ఒక అడుగెత్తు అమ్మ విగ్రహం పైకి వచ్చినట్లు దర్శనమైంది. ఒక శివరాత్రి రోజు, సూరమ్మగారికి, తెల్లవారు ఝామున ఒక చిన్న పాప సమాధికి ప్రదక్షిణలు చేస్తూ కనిపించింది. మళ్ళీ చూస్తే ఎక్కడా కన్పించలేదు. వీరికే ఒకసారి, అమ్మ ప్రక్కలో కూర్చుని, "లేవవే! లే!" అని లేపుతున్నారు. అమ్మను చూస్తూనే పట్టరాని ఆనందం పొంగుకొచ్చి, "అమ్మా! మీరిక్కడే వున్నారా?" అంటూ, అమ్మను గట్టిగా కౌగిలించుకొని ఏడ్చేశారు. అమ్మ క్రమంగా అదృశ్య మయ్యారు.

చిన్నం సీతామహాలక్ష్మి అమ్మ సమాధి అనంతరం తమకు కలిగిన అనుభవాలు ఇలా తెలిపారు :

"అమ్మ సమాధి అయిన అయిదవ రోజు తెల్లవారు ఝామున, ప్రక్క మంచం మీద పడుకున్న నా కుమార్తెతో అమ్మగారు ఏదో మాట్లాడుతూండటం వినిపించింది. మాట వివరం తెలియలేదు. అంతలోకి నా కుమార్తె లేచి కూర్చుని,





'అమ్మగారు వచ్చి, నా దగ్గర కూర్చుని వెళ్ళారే... వెడుతూ నా చేతిలో ఏదో ఉంచి, గుప్పెట మూసి వెళ్ళారు! అంది. లైటు వేసి చూస్తే, ఆ అమ్మాయి చేతిలో

మెరిసిపోతున్న కొత్త '20' పైసల నాణెం, కుంకుమ కనిపించాయి. అమ్మ సమాధి చెందారనే దుఃఖంలో ఉన్న మా కుటుంబ సభ్యులందరికీ, ఆ నిదర్శనంతో 'అమ్మ వెళ్ళిపోలేదు - ఇక్కడే వున్నారు' అనే ఊరట కలిగింది. ఆ నాణెమూ, కుంకుమా ఒక భరిణెలో ఉంచి, పూజా పీఠం మీద పెట్టి హారతిచ్చాము."

అమ్మ సన్నిధిలో సాధన చేసుకుంటూ, అమ్మ ఆశ్రమంలో వుంటున్న గీతమ్మగారు తమ అనుభవాలు ఇలా చెప్పారు. "ఒక రాత్రి నేను రామాలయం అరుగుమీద నిద్రపోతూ వున్నాను. రాత్రి 12 గం॥లకు నన్ను మూడుసార్లు ఎవ్వరో తట్టగా మెలకువ వచ్చి చూచేసరికి, అమ్మ భౌతికంగా అక్కడ నిలబడి వున్నారు. 'ఇక్కడ పడుకో కూడదే-రామాలయంలోకి వెళ్ళి పడుకో-లోపల గడియ వేసుకో' అన్నారు. నేను లేచి రామాలయంలోకి వెళ్ళి కటకటాల తలుపు గడియ వేసే వరకూ అమ్మ అక్కడే నిలబడి వున్నారు. తర్వాత అంతర్ధానమయ్యారు.

ఒకరోజు రాత్రి అమ్మ సమాధికి కొద్ది దూరంలో పడుకున్నాను. ఇంకా నిద్ర పట్టలేదు. అంతలో ఒక పాము వచ్చి అమ్మ సమాధి చుట్టూ తిరగటం చూసాను.

నేను అమ్మ కుటీరంలో ధ్యానం చేసుకుంటున్నాను. సమయం రాత్రి 1 గం॥ అయింది. నాకు అమ్మగారు ధ్యానం చేసుకునే చోటు నుంచి స్పష్టంగా ఓంకారం విన్పించింది. చూడగా, అమ్మ భౌతికంగా తమ స్థానంలో కూర్చుని, ఓంకారం చేస్తూ కనిపించారు. ఆ దర్శనం సుమారు ఒక గంటసేపు కొనసాగింది.

అమ్మ సమాధి అయిన తర్వాత, మండలారాధనకు నాలుగు రోజుల ముందు, రామాలయంలో ఆడవాళ్ళు నలుగురూ చేరి, పెద్ద గొడవగా మాట్లాడుతుంటే, 'ఈ గొడవలు ఇక్కడ కాదే - శ్మశానానికి వెళ్ళి చెప్పుకోండే'అని అమ్మగారు కుటీరంలో నుంచి కేకవేసినట్లు వినిపించింది నెక్కంటి రంగమ్మ గారికి. ఆమెకే ఒక రోజు అమ్మ కుటీరంలో ధ్యానం చేసుకొనే చోట, పడుకుని దర్శనమిచ్చారు. ఏమిటా అమ్మ సమాధి చెందారు కదా! నేను కలగంటున్నానా?'





అని కళ్ళు నులుముకొని మరీ చూశారు. అమ్మ ఇటు నుండి అటు తిరిగి ఒత్తిగిలి పడుకున్నారు. కాస్సేపటికి, క్రమంగా అదృశ్యమయ్యారు.

అమ్మ సమాధి చెందిన తర్వాత చివటం వచ్చిన ఒక మహాత్ములు, 'సత్యమైన ప్రేమకు వియోగము లేదు - త్యాగమే దానికి గీటు రాయి' అని అమ్మ కుటీరంలో గోడ మీద వ్రాశారు. భక్తులు నిత్యసత్యులైన అమ్మను ఇలా స్తుతిస్తారు.

శ్లో॥ మాతరం అచ్చమాం నిత్య గోస్తనీ తటవాసినిం
జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం సర్వదా ప్రణమామ్యహమ్

శ్లో॥ వందేహం సర్వకాలేషు శ్రీ శైవ మఠవాసినీం
మాతరం అవధూతాంబాం శుద్ధ సత్త్వ స్వరూపిణీం॥

అమ్మను చూచినవారు, అమ్మ ఆదరణను పొందినవారు, ఈ నాటికీ అమ్మ జ్ఞాపకాలతో, అమ్మ తమపై చూపిన ప్రేమను, కరుణను తిరిగి తిరిగి గుర్తు తెచ్చుకుంటూ, అమ్మ సమాధిని దర్శించుకుంటూ, శ్రద్ధా భక్తులతో అమ్మను సేవించుకుంటున్నారు. అమ్మ ఉండగా, అమ్మను చూడగలిగే భాగ్యం లేనివారు కూడా, ఎవరో చెప్పగా వినడం వల్లనో, లేక అమ్మ చరిత్ర చదవడం ద్వారానో, అమ్మను గురించి తెలుసుకొని, అమ్మ యొక్క దివ్యమైన ప్రేమను అనుభవించి, అమ్మ స్మరణలో జీవిస్తూ, అమ్మ చూపిన మార్గంలో నడవడానికి ప్రయత్నం చేస్తున్న భక్తులు, ఎందరో, దేశ విదేశాల్లో కూడా ఉన్నారు ఈనాడు.

భౌతికంగా మన మధ్య తిరుగుతున్న మహాత్ములయందు విశ్వాసం నిలపడం చాలా కష్టం. ఎందుకంటే, మానవనైజం వలన, వారి యందు కూడా మనస్సు దోషాల నాపాదిస్తూ ఉంటుంది. అందువల్ల ఒక్కోసారి మన విశ్వాసం సడలిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ విషయాన్ని గురించే అమ్మ ఇలా చెప్పారు - 'అమ్మా, మహాత్ముల దగ్గర కంటే, సమాధుల దగ్గరే నాకు ఎక్కువ ప్రశాంతంగా వుంటుంది - ఎందుకమ్మా?' అని అడిగిన భక్తురాలితో అమ్మ "మహాత్ముల దగ్గరకు వెళ్ళినప్పుడు మనం అడగడం వారు చెప్పడం ఉంటుంది. కానీ, సమాధుల దగ్గరయితే, చెప్పేదేమీ ఉండదు. మనస్సు ఏకాగ్రం చెందుతుంది" అన్నారు.

అమ్మ చరిత్రను ముగించేముందు, మాస్టర్‌గారు 'తొలిపలుకుల్లో' చెప్పిన






మాటలు మరొక్కసారి స్మరించుకొందాం!

"మనకు గోచరమయ్యే అమ్మ భౌతికదేహం కూడ, మనపట్ల కరుణ


వలన, ఆమె ధరించిన ఆచ్ఛాదన మాత్రమే. ఒక వంక ఒక స్థాయి వరకు మన సాధనకు, భక్తికీ ఆ రూపం సహకారియే అయినా, మరొకవంక ఆ రూపమే ఆమె అని మనం పొరబడటానికి అవకాశం కూడాను. అందుకే తమ నిజతత్త్వాన్ని మనకు ప్రకటం చేసే మహోన్నతము, కరుణాపూర్వము అయిన గొప్ప ఉపదేశము, బోధ - ఆమె నిర్యాణము. ఇప్పుడు చివటంలో ఉన్నది, నిజమైన అమ్మ. సమాధి చెందక ముందున్న ఆమె రూపం అన్యమైన రూపాల నుండి, మన శ్రద్ధా ప్రేమలను తమ వైపుకు మళ్ళించుకొనే ఉపకరణము మాత్రమే. అమ్మ సమాధి దగ్గర కూర్చున్నప్పుడు మన హృదయంలో అనుభవమయ్యే పరిశుద్ధమైన శాంతి అమ్మ యొక్క నిజరూపం. మహనీయుల సన్నిధిలో కంటే, వారి సమాధుల సన్నిధిలో ఎక్కువ శాంతి అనుభవం కావడానికి కారణమేమని అడిగిన భక్తులతో ఆమె చెప్పిన సమాధానమే, ఆమె సమాధికీ వర్తిస్తుంది. భౌతిక రూపం మరుగైంది కనుక, మరొక భౌతిక రూపం వైపుకు పరుగెత్తే వారంతా, నిజమైన అమ్మ తత్త్వాన్ని గుర్తించనట్లే. అమ్మ భౌతికంగా వుండగా ఎలా దర్శించేవారో - సేవించేవారో అలానే ఇప్పుడు కూడా దర్శిస్తూ వుండే భక్తులే నిజమైన భక్తులు. భక్తులు అలాంటి పరిపాకం చెందాలన్న ఆమె ఆకాంక్షే, "ఇది నిజమైన శివమఠం కావాలి" అని భక్తులతో ఆమె అన్న మాటలలో వ్యక్తమౌతుంది."

ఓంతత్సత్!





అమ్మవాడిన వస్తువులు






అమ్మ కుటీరంలో అమ్మ విశ్రమించే చిన్నగది





అమ్మ గారి పూర్వాశ్రమ ప్రదేశం





సమాధిమందిర శంఖుస్థాపన





మహాసమాధి

# అవధూత శ్రీ చివటం అమ్మ

# ఈ గ్రంథమును గురించి

పశ్చిమగోదావరి జిల్లాలోని చివటం అనే కుగ్రామంలో దాదాపు 5 దశాబ్దాల పాటు నివసించి 'రామ రామ' అని నిరంతరం అనుకోండి ' అని, 'నాలుగు కూడళ్ళు సంపాదించుకుంటే ఎంత అద్భుతమయినామో అంతకన్నా ఎక్కువ అద్భుత వైభవం కోసం చదవాలి' అని చెప్పిన అవధూత శ్రీశ్రీశ్రీ చివటం అమ్మను పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరు గారు మహిమాన్విత స్థితిని అంటున్న దత్త సాంప్రదాయానికి చెందిన అవధూతయని, ధ్యానము, భూమిపై సంచరించే దైవముగ గుర్తించి అమ్మ మహాత్మ్య ప్రపంచానికి వెల్లడి చేశారు. పూజ్య శ్రీ భరద్వాజ గారు శిరిడీ సాయినాథుని సద్గురు మహాత్మ్యం ప్రకటించుటయే కాక అనేకమంది మహాత్ములను దర్శించారు. వీరు దర్శించిన మహాత్ములలో అమ్మ కూడా ఒకరు.

దిగంబరావధూతయైన ఈ శ్రీ చివటం అమ్మ గూర్చి పూజ్య శ్రీ మాస్టరు గారి ద్వారా తెలుసుకొని వారి అనుగ్రహంతో ఈ రచయిత్రి శ్రీమతి డి. శారదా వివేక్ రచించిన ఈ గ్రంథం ద్వారా పాఠకులు అమ్మను దర్శించి అమ్మ అనుగ్రహానికి పాత్రులు కాగలరని విశ్వసిస్తున్నాము.

శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్